నవశక్తి

Vol. 2, no. 25

(Jun. 7, 1939)

బెజవాడ, 1939

Navaśakti

Vol. 2, no. 25

(Jun. 7, 1939)

Bejavāḍa, 1939

Record no. 682

జూన్ 11 : మునగాల రైతు దినోత్సవం
Regd. No. M. 3824

నవశక్తి

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారపత్రిక

సంపుటం 2 } బుధవారం 7-6-39 బెజవాడ { సంచిక 25

మునగాల ఎస్టేటులో పోలీసుల దౌర్జన్య తాండవం

నాలుగు రోజుల్లో 113 ఎరస్టులు!

శాంతంగా ఉన్న ప్రజలపై లాఠీచార్జీలు—జమీందారుతో పోలీసుల లాలూచీ—రిజర్వు పోలీసులకు జమీందారుగారి విందులు.

మునగాల ఎస్టేటు రైతులు చిరకాలమునుండి తమ జమీందారుక్రింద అనుభవిస్తూన్న ఇక్కట్లను నివారించుకొనుటకు మరొక మార్గము లేక, యీ నెల 2 వ తేదీని సత్యాగ్రహము ప్రారంభించారు. జమీందారు అక్రమముగా లాగుకొనిన ఇమ్మడి పాపయ్యగారి (నడిగూడెం) భూములను తిరిగి వారికి స్వాధీనము జేయడానికి రైతులు 2 వ తేదీ ఉదయము నాగళ్లు తోలుకొనిపోయి, సదరు భూములలో దున్నడము ప్రారంభించారు. మునగాల జమీన్ రైతు సంఘ ఉపాధ్యక్షులైన శ్రీ ఉప్పల రామయ్యగారి నాయకత్వాన 8 గురు సత్యాగ్రహులు నాగళ్ళు దున్నుతోంటే, మునగాల పోలీసు సబ్ ఇన్స్పెక్టరు, 4 గురు పోలీసులు, తుపాకులతో జమీందారుగారి కారులోవచ్చి, ఇమ్మడి పాపయ్యగారిని పిలిచి, ఈ భూమి మీదే అని రుజువు చేసుకొనడానికి కాగితాలు తెమ్మన్నారు. ఆయన వెళ్ళి, కాగితాలు తెచ్చి చూపించారు. ఇంతలో ఎస్టేటువారి కారుపై మరొకసారి 4 గురు పోలీసులు వచ్చారు. ఉప్పల రామయ్యగారినీ, వారితో సత్యాగ్రహము చేసిన 8 గురు రైతుల్నీ, ఎరస్టుచేసి, తీసుకు వెళ్లారు. ఆసాయంత్రం 4 గంటలకు మరొక 12 గురి దళం కొరట్ల పాపయ్యగారి నాయకత్వాన బయలుదేరి, భూమిలో ప్రవేశించి నాగళ్ళు తోలారు. పోలీసులు వారి పేర్లు మాత్రము తీసుకొని విడిచిపెట్టారు. బెజవాడ సబ్ కలెక్టరుగారు, జిల్లా పోలీసు డిప్యూటీ సూపరింటెండెంటు నడిగూడెము వచ్చి, ఇమ్మడి పాపయ్యగారిని "నీవు కోర్టుకెందుకు పోలే"దని ప్రశ్నించగా "ఎన్నింటికని కోర్టులకు వెళ్ళమంటా"రని పాపయ్యగారు జవాబు చెప్పారు. పిమ్మట, పాపయ్యగారిని మునగాలకు వచ్చి కలుసుకొనమని చెప్పి, సబ్ కలెక్టరుగారు, పోలీసు సూపరింటెండెంటు వెళ్ళిపోయారు.

3 వ తేదీ ఉదయం 8 గురు రైతులు ఇమ్మడి పాపయ్యగారి భూమిలో తిరిగి సత్యాగ్రహం చేశారు. పోలీసులు కంచుల రాములుగారిని మాత్రం అరెస్టుచేసి, యితరుల్ని విడిచిపెట్టారు. మునగాల రైతు సంఘ కార్యాలయములో ఉన్న నందూరి ప్రసాదరావు, మోటూరి పరంధామయ్యగారలను కూడ పోలీసులు ఎరస్టు చేశారు. ఇమ్మడి పాపయ్యగారు మునగాల బజారులో బంధువులతో మాట్లాడుతూండగా వారినికూడా ఎరస్టు చేశారు. ఎరస్టు చేయబడిన సత్యాగ్రహుల్నికలుసుకొనడానికి వెళ్లిన జె. సత్యనారాయణగారు కూడా ఎరస్టు చేయబడ్డారు.

4 వ తేదీనికూడా 8 గురు సత్యాగ్రహులు పొలము దున్నుతూండగా వారందర్నీ పోలీసులు ఎరస్టుచేసి, నాగళ్లు—ఎడ్లనుకూడా స్వాధీనము చేసుకున్నారు. చుట్టుపట్ల గ్రామాలనుండి వచ్చిన సుమారు 1000 మంది రైతులు "ఎడ్లను, నాగళ్లను కూడా ఎందుకు అక్రమంగా తీసుకుపోతా"రని అడిగినందుకు ఒకనిని పోలీసు సబ్ ఇన్స్పెక్టరు కర్రతో రొమ్ములో పొడిచాడు. వెంటనే రిజర్వు పోలీసులు రప్పించబడి, ప్రజలమీద అమానుషమైన లాఠీఛార్జీ చేయబడింది. 35 గురికి బలమైన దెబ్బలు తగిలాయి. వారందరినీ పోలీసులు ఎరస్టుచేసి, తీసుకుపోయారు. లాఠీచార్జివల్ల మోపుగా దెబ్బలు తగిలి కొందరు స్పృహతప్పి పడిపోయారు.

సుంకర నరసయ్య అనే 60 సంవత్సరముల వయస్సుగల వ్యక్తికి బలమైన గాయాలు తగిలాయి. రైతుల చేతుల్లో ఉన్న జండాలను పోలీసులు దౌర్జన్యముగా లాగుకొని, చేతులు—కాళ్లు తుడుచుకోడానికి ఉపయోగించారు. నేలమర్రి గ్రామంలో మునగాల జమీన్ రైతు సంఘాధ్యక్షులైన నల్లపాటి వెంకట్రామనర్సయ్యగారిని కూడా 4 వ తేదీని ఎరస్టు చేశారు. ఉదయం 9 గంటలకు మునగాల కాపురస్థుడైన అలుగూరి వీరనారాయణ యేదో పనిమీద వెళ్లుతూంటే, నెం. 479 పోలీసు కానిస్టేబిల్ వచ్చి, రైటరు పిలుస్తున్నాడని పోలీసు స్టేషన్‌లోకి తీసుకువెళ్ళాడు. నీవు నడిగూడెములో ఎందుకు ప్రచారము చేస్తున్నావని ప్రశ్నించి పోలీసులు అతని వీపు, గూడలమీద సుమారు 20 దెబ్బలు కొట్టారు. కొంతసేపయిన తరువాత అతనిని విడిచివేశారు. ఈవిషయము గూర్చి పోలీసు సూపరింటెండెంటుకు పిటీషన్ పెట్టుకోగా, తరువాత విచారిస్తామని పంపివేశారు.

5 వ తేదీని మరొక జట్టు ఇమ్మడి పాపయ్యగారి భూమిలో సత్యాగ్రహము చేస్తూంటే వారినీ మరికొందరు ప్రజల్నీ మొత్తం 53 గ్గుర్ని ఎరస్టు చేసినట్లు రూఢి వార్తలు వచ్చాయి. నందూరి ప్రసాదరావు వగయిరా 28 గురు ఖైదీలను 5 వ తేదీ సాయంకాలము బెజవాడకు తీసుకువచ్చి, సబ్ జైలులో ఉంచారు.

2 వ తేదీని 9 గురూ, 3 వ తేదీని 5 గురు, 4 వ తేదీని 46 గురు, 5 వ తేదీని 53 గ్గురు, మొత్తము 113 గ్గురు ఎరస్టు చేయబడ్డారు.

సత్యాగ్రహము ప్రారంభమైనప్పటినుంచీ పోలీసులు జమీందారు గారి మోటారు కార్లలో తిరుగుతున్నారు. మేకలను, పొట్టేళ్లను ఎస్టేటువారు తెప్పించి, రిజర్వు పోలీసులకు విందులు చేస్తున్నారు. అన్నివిధములయిన సప్లయిలు వారికి చేస్తున్నారు.

రాజకోట

"మహాత్ముని పద్ధతి అగమ్యగోచరంగా ఉంది"

"నేనోడిపోతిని. దర్బార్ వీరవల్లాయే జయించాడు, నేను మురిసలినయ్యాను." అని 'ఓటమియే యెరుగని సత్యాగ్రహ సిద్ధాంతానికి' మూలపురుషుడైన గాంధిజీ అన్నప్పుడు అందరము ఆశ్చర్యపడ్డాం. ఆశ్చర్యపడటమేగాదు. తీరని అవమానంతో బాధపడ్డాం. అంతకన్నా ఆశ్చర్యకరంగా రెండవప్రకటన వెలువడింది. "నేను తప్పుచేశాను. నేనుపవసించడం హింస. కాబట్టి నన్ను క్షమించమని, వైస్రాయిని, గ్వయర్‌ను, ఠాకూర్‌సాహెబ్‌ను, వీరవల్లాను కోరుతున్నాను." ఎన్నో మహా ఉద్యమాలు విజయవంతంగా నడిపిన మహాత్మునికి పరాజయం ఏమిటి? వీరవల్లా ఎక్కడ? మహాత్ముడు ఎక్కడ? ఎందులో ఉన్నది ఈకీలకం? మహాత్ముడు ప్రజా ఉద్యమాన్ని నిర్వీర్యం చేసి, వైస్రాయి జోక్యంతో, ఏదేదో ఉక్కు తీర్పులలో, ఠాకూర్‌సాహబ్, వీరవల్లాల హృదయ పరివర్తనములో నమ్మకం కల్గియుండటమే.

మహాత్ముని ప్రకటన ఫలితం ఏమిటి. ఒక వీరపోరాటం అపజయంతో ముగిసింది. దర్బార్ వీరవల్లాయే అధ్యక్షుడుగల ఒక కమిటీ ప్రకటించబడింది. ఆ కమిటీలో పరిషత్ సభ్యులు లేరు. గాంధిజీ సరిగా ప్రజలకు 'సలహా' ఇచ్చారు కాబట్టి, ఆందోళన లేనంతవరకు,

"1. 1938 ఆగస్టునుండి చేయబడ్డ అర్డర్లు నోటీసులు రద్దుచేయబడినాయి.

2. జరిమానాలు, లాక్కోబడ్డ భూములూ తిరిగి ఈయబడతాయి.

3. పౌరసత్వహక్కు అనుభవించవచ్చు ప్రజలు."

అని ఠాకూర్ సాహెబ్ ప్రకటించారు. కాని పత్రికలపై నిషేధం అలాగే ఉంచారు. అయినా మహాత్ముడేమంటున్నారు. "పత్రికలపై నిషేధాన్నిగురించి మీరు నిరుత్సాహపడకండి." ఇంతటితో ఆగినా బాగుండేది. పైగా "తీవ్ర పద జాలం (వైలెంట్ లాంగ్వేజ్) ఉపయోగించే పత్రికల్ని బహిష్కరించండి. విరోధ భావం (సంస్థానంతో) హెచ్చుకుండా పత్రికలు తోడ్పడాలి." ఈ విధంగా దర్బారే గాకుండా మహాత్ముడు ప్రజలనోళ్లను కట్టివేస్తున్నాడు.

ఈ నూతన తత్వానికి మహాత్ముడు చెప్పే వ్యాఖ్యకూడా ప్రజలను అణగి యుండమంటున్నది. "నేనొక నూతన అధ్యాయాన్ని ప్రారంభించాను. .... పాలకుడు పరిపాలితులు తమ ధర్మ నిర్వహణకు చేతులు కల్పితే అపజయం విజయంగా మారుతుంది." నిజమే ప్రజలు తమ ధర్మాన్ని నెరవేరుస్తారు. మరి పాలకుల మాటో? పటేల్‌తో వచ్చిన ఒడంబడికను భగ్నంచేసిన ఠాకూర్ సాహెబ్‌నే ఈనాడు నమ్మమంటే ఎలా? ఈ కుట్రలకంతకూ కారకుడైన "వీరవల్లానుగురించి చెడుగా భావించవద్దు" అని సలహా. ప్రజాబలంలో నమ్మకం లేక, శత్రుహృదయ పరివర్తనంలోనే నమ్మకం గాంధిగారి 'టెక్నిక్', ఈ 'టెక్నిక్'ను విశ్వసించకపోతే గాంధిజీ మరొక ఆయుధం చూపరాదు. "అహింస విషయమై మిలో మీకు నమ్మకం లేకపోతే 50 ఏండ్ల అనుభవం గల నన్ను నమ్మండి" అని అంటారు. నమ్మారుగా!

సోషలిస్టులు అధిక సంఖ్యాకులుగల ప్రజాపరిషత్తు సైతం మహాత్ముని సలహాప్రకారం సత్యాగ్రహాన్ని ఆపివేశారుగా. ఫలితం అపజయం!

అపజయంతోనే పోలేదు. సంస్కరణల కమిటీ అన్నివిధాలా తోడ్పడవలెనని, పరిషత్తుకు సలహా ఇచ్చారు. పరిషత్తు అదిసరికు తోడ్పడ నిరాకరింప నిశ్చయించుకొంది. తోడ్పాటుకు ఉదాహరణగా కాబోలు మహాత్ముడు దర్బారులో హాజరయ్యారు! ఠాకూర్ సాహెబ్‌తో కారులో నూరేగినారు! రాజ కుటుంబీకులతో విందుల గుడిచినారు! మహాత్ముని ఈ 'దివ్య లీల'లను అర్థం చేసికోలేని పరిషత్తు సేవకులకు గాంధిగారి సలహా ఏమిటి? 'మనోవాక్కాయ, కర్మలలో అహింస నవలంబించండి'. ఏది హింసో, ఏది అహింసో నిర్ణయించుటకు పరిషత్తు సేవకులు 'అంతరాత్మ ప్రబోధించే మహాత్ములు' కారు. మొన్న మొన్న జరిగిన ఉపవాసమూ, దానివలన జరిగిన ఘటనలు దేశమంతటా విజయదుందుభిగా ప్రతిధ్వనింపబడింది. మహాత్ముని ఆ విజయానికి దేశమంతా విజయహారతులు పట్టింది కాని ఒక్కదెబ్బన 'హింస' అని దానిని కొట్టివైచారు! ఇక సామాన్యులగతి ఏమిటి?

మహాత్ముని సూచనలకు జవాబుగా తీవ్రవాద పరిషత్ ప్రజా సభ్యులు ఒక ప్రకటన గావించారు. విజుభాయి శుక్ల, ఇస్మాయిల్ హిరానీ, జటాశంకర్ మెహతాగార లీవిధముగా విజ్ఞప్తి గావించారు. "సంస్కరణల కమిటీ బహిష్కరించడం గౌరవమైన పని. గాంధిగారి ప్రకటన ప్రజలలో నైతికపతనం తీసుకవస్తుంది. కాబట్టి ప్రజాపరిషత్తును సమావేశపరచి దానినే నిర్ణయించమనండి."

ఈఘటనలకు విభ్రాంతి చెంది దేశమంతా విమర్శ చేయసాగింది. దానికి మహాత్ముని ప్రియశిష్యుడు మహదేవదేశాయి. జవాబు"కొద్ది రోజుల్లోనే తెలుస్తుంది దాని అంతరార్థం.వీరవల్లా మనస్సుకూడ మారింది. "అంటున్నాడు, వీరవల్లాతోరాయబారాలుకూడసాగించుతున్నాడు.కాని అవి ఏమిటో ప్రజలకు తెలియదు. ప్రజాపరిషత్తుకు తెలియదు. ఇట్టి పద్ధతులు పోరాటంలో అవిశ్వాసాన్నే గాకుండా ప్రజాపోరాటానికి శాహతుకూడా లేని నిర్వీర్యత గలిగే అపాయాలున్నాయి. "విలువలేని పరిశోధన"లు మహాత్ముడింకా చేయకుండాలని ప్రార్థన!

రాజకోటపై జవహర్‌లాల్‌లో గల్గిన మనస్సంఘర్షణ గమనించదగ్గదే. నేషనల్ హెరాల్డులో, ఒకవ్యాసంలో జవహర్‌లాల్ ఇలా వ్రాశాడు.

"ఇటీవల రాజకోటలో జరిగిన సంఘటనలు సంస్థానాల విషయంలోనే గాక, భారతదేశము అంతటిలోనూ గొప్పమార్పులను తేగల ప్రాముఖ్యత గలవి. రాజకీయములలో గాంధిజీ అవలంబించే విధానాన్ని అవి ఎంతవరకు సూచిస్తాయి? గాంధీజీకి అత్యంత ప్రాముఖ్యత గల కాంగ్రెసు విధానాన్ని అవి ఎంతవరకు మారుస్తాయి. రాజకోటలో తాము అవలంబించినచర్య విషయములో గాంధీజీ సక్రమ మార్గాన్నే అవలంబించి వుండవచ్చును కాని, ఎక్కువ వివరములు తెలియనిచే యీవిషయమై నేను ఏమీ చెప్పజాలను, కాని రాజకోట విషయంలో ఆయన ఇటీవల అవలంబించిన పద్ధతులు నాకు అగమ్యగోచరములుగా ఉన్నవి. రాజకీయోద్యమాన్ని ఆయన యీ విధంగా ఎలా సాగిస్తారో నాకు అర్థం కావడంలేదు. అఖిల భారత సంస్థాన ప్రజా సమావేశానికి అధ్యక్షుడుగా ఎన్నుకొనబడినప్పుడు, ఆశ్చర్యకరమైన పనులు చెయ్యడానికిగాని, మామూలుకంటె భిన్నమైన విధానాలు అవలంబించడానికిగాని నాకు వీలవుతుందని నేను అనుకోలేదు. సంస్థానాల సమస్య ఒక్కొక్క సంస్థానాన్నిబట్టి ఒకవిధంగా మారుతుంది. అనేక చిక్కులతో కూడుకున్నది. అయితే వీటన్నిటికీ అంతర్వాహిని అయిన పద్ధతి ఒక్కటే ఉన్నది. ఈ ఉద్యమాలన్నిటిని కేంద్రీకృతం చేసి, ఏక విధానంతో నడుపుదామని నేను ఆశించాను. అయితే నేను అవలంబించే విధానం, సంస్థానాల విషయమై గాంధీజీ అవలంబించుతున్న విధానంతో అతకదని నేను గ్రహించాను. ఆయన పద్ధతితో సంఘర్షణ వచ్చే ధోరణిలో నేను ఏమీ చెప్పడానికి ఏమీ చెయ్యడానికి ఉద్దేశించలేదు. ఏమంటే అందువలన సంస్థానాలలో గందరగోళం రావచ్చును. అందుచేత నేను మాట్లాడక ఊరుకున్నాను. చాలావరకు యీ ఉద్యమం విషయంలో పనికూడా చెయ్యడం లేదు. నాకు చేతులు కట్టినట్లు అయింది.

"రాజకోట సంఘటన తరువాత నాకు మరీ దారీ తెన్ను తోచలేదు. నాకు అర్థంకాని విషయాలలో నేను పని యేమీ చెయ్యలేను. రాజకోట విషయాలు నాకేమీ అర్థం కావడంలేదు."

జవహర్‌లాల్ ఇలాంటి సందిగ్ధావస్థలో పడకుండా గాంధిజీకి ప్రజాఉద్యమం కేంద్రీకృతం చేయవలసిన ఆవశ్యతను తెల్పి ధైర్యంగా ఒత్తిడచేసి ఉంటే గాంధిజీకూడ తన మనస్సు మార్చుకొనునేమో మహాత్ముని మనస్సు నొప్పించుతుందేమోనని, రాజకీయ ఉద్యమాన్ని పెడత్రోవల బట్టించటానికి, సంస్థాన ప్రజాధ్యక్షుడగు జవహర్‌లాల్ ఆత్మస్వాతంత్ర్యాన్ని కోల్పోరాదు. మహాత్ముని వైఖరిని, జవహర్‌లాల్ పరాజయతత్వాన్ని (ఢిఫీటిజం) మార్పించగలిగేది సంస్థాన ప్రజలు తమంతతామే ఉద్యమాన్ని తీవ్రంగానడపటమే!

* * *

పండిత జవహర్‌లాల్ నెహ్రూ యీ క్రింది ప్రకటనను గావించాడు.

"మనము వందలకొద్దీ సమస్యలలో మునిగిపడి ఉన్నప్పటికీ, మనకు ఎన్నో చిక్కులు ఉన్నప్పటికీ, ప్రతి రోజూ ఎన్నో భారత సంస్థానాలలో జరుగుతున్న దారుణ సర్యలను నిర్లక్ష్యము చేయగలుగుతామా? అయిన మనకు ఇంతకన్న పెద్ద సమస్యా, ఇంతకన్న బాధకరమైన దారుణ స్థితి మరొకటిలేదు. రాజకోట విషయములో గాంధీ మహాత్ముడు పాల్గొనినందుకు అనేకులు రాజకోట వ్యవహారములచే ఆకర్షింపబడినారు. అందువలన కొంతకాలము ఇతర సంస్థానములలోని ఉద్యమములు అప్రాధితమైనాయి. కాని సేట్ జమ్నాలాల్ బజాజ్ జయపూర్‌లో ఖైదీగా ఉన్న సంగతిని, భారతపూర్ సత్యాగ్రహము సాగుతున్న సంగతీ, యింకా అనేక సంస్థానములలో తీవ్రముగా నిర్బంధ విధానము జరుగుతున్న సంగతిని జ్ఞాపకము ఉంచుకోవాలి. సంస్థానములలో సత్యాగ్రహము నిలిపివేయవలసినదని గాంధీ మహాత్ముడు సద్భావ సూచన కావించినారు. అంతట ప్రజలా సలహాను అనుసరించినారు. కాని అధికారులు ఈ సలహాను తీసుకోలేదు. దీనిని సంస్థానాధికారులు ఒక దౌర్బల్య సూచనగా పొరపాటుపడి నిర్బంధ విధానమును మరింత తీవ్రముగా సాగిస్తున్నారు. ఎన్ని వేలమంది నిర్బంధ విధానంక్రింద నలిగిపోతున్నారో ఎన్ని వేలమంది తిండి తిప్పలు లేక శ్రమపడుతూ యితర ప్రదేశములకు వెళ్ళిపోయినా యీ రోజు సంగతులేమీ ఆలోచించకుండా రాజకీయ ఏజెంటులును, రెసిడెంటులును, ఏమీ జరగనట్టుగా నెమ్మదిగా పనిచేస్తున్నారు. పైగా వారు అనిశ్చితమైన వాగ్దానములు తెలుపుతారు. వీటికి ఏవో అర్థాలు వీరే చెప్పుకుంటారు. కాని ప్రజలకు దుఃఖం, బాధలూ మితిమించి పోయినాయి. ఇక పరిస్థితులు ఎప్పుడూ నిలకడగా ఉండిపోతాయి. అనుకునేవారు చాలా ఘోరముగా పొరపాటు పడుతున్నారు.

భారత సంస్థానాలు అన్నింటిలోను ఒరిస్సా సంస్థానములో నేడు పరిస్థితులు మిక్కిలి దుర్భరంగా ఉన్నాయి. టాల్చేరు ప్రజలకు తెలిపిన ఒక్క వాగ్దానమును నెరవేర్చలేదు. గంగపూర్‌లో అనేకమంది ఆర్తులు ఆహారము లేక నిలువ నీడలేక బాధపడుచున్నారు. వీరిలో అనేకమంది మరణించినారు. ఇతరులను అడవులలోనికి పరిమివేస్తున్నారు.

ఇటువంటి పనులన్నీ జరుగుతుండగా వీటిని గురించి సరియైన ఒక విచారణ అయినా జరగకపోవడం చాలా ఆశ్చర్యకరంగా ఉంది. గంగపూర్‌లో పోలీసు కాల్పులను గురించి ముగ్గురు ప్రముఖులచే విచారణ జరిపించాలని నేను తెలియపర్చినాను. కాని ఇదివరకే శాఖ ద్వారా విచారణలు జరిగినాయను మిషతో నా సూచనను అధికారులు నిరాకరించారు. అసలు జరుగుతున్న సంగతి ఒక్కరికీ తెలియదు. కాని కర్ణకఠోరమైన వార్తలు మాత్రం వినవస్తున్నాయి. ఈ సహింపశక్యముకాని భారమును, దౌర్జన్యమునూ ఇంకా ఎంతకాలం ఇలాగ ఉంటాయి? మనదేశంలో ఫ్యూడలిజము, సామ్రాజ్యతత్వముల క్రింద నలిగిపోతూ అనాగరిక స్థితిలో ఉన్న బీదవారి కష్ట నష్టములను ఎవ్వరూ మరువజాలరు. మనకు స్వాతంత్ర్యం లభించునంతవరకూ వారి స్వాతంత్ర్యమునకు తొందరలేదని మనలో ఎవ్వరూ అనుటకు సాహసింపలేదు. సంస్థానములలో ప్రజలు నిర్బంధ విధానముక్రింద నలిగిపోతున్నంత కాలమూ, మనకు గాని, మరి ఏ భారతీయునికి గాని స్వాతంత్ర్యం లభించదు."

సంపుటం 2 — నవశక్తి — బుధవారం
సంచిక 25 — 7-6-39

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు). కంభంపాటి సత్యనారాయణ. పుచ్చలపల్లి సుందరయ్య. తుమ్మల వెంకట రామయ్య.

జూన్ 11 వ తేదీ మునగాల రైతుల సత్యాగ్రహ దినము

ఈ పోరాటము ఒక్క రైతులకు జెందినదే కాదు. నిజంగా యిది మునగాల జమీందారుకు వ్యతిరేకముగా జరుగుతున్న మునగాల ప్రజా పోరాటము. ఇందు కోమట్లు, కరణాలు, ఈనాందార్లు, రైతులు, సాంఘికవృత్తులుచేసే మంగళ్లు,చాకళ్లు, వ్యవసాయకూలీలు సైతం పాల్గొంటున్నారు. బ్రిటిషు ప్రభుత్వాన్నుండి ఒకప్పుడు న్యాయపీఠాధికారాలు (Magisterial powers) ఆశించిన యీ జమీందారు నిరంకుశత్వములో వివిధ వర్గాల ప్రజలందరు బాధపడుతున్నారు. వేరొకచో వర్తకులగు కోమట్లు అధికారానికి మడుగులొత్తుచూ పోరాటానికి దూరముగా వుండే వర్గమే కావచ్చు. కాని మునగాల ఎస్టేటులో జమీందారీ ఉద్యోగుల 'చీట్లకు' డబ్బు పుచ్చుకోకుండానే సరుకు అర్పించుకోవలసిన దౌర్భాగ్య స్థితిలో వున్నారు. అట్టి చీట్లు జమీందారుచే ఉల్లంఘించబడిన రాజీ షరతుల ప్రకారం డబ్బు యిచ్చుకోవలసినవి 40 వేల రూపాయలు విలువ చేసేవి ఉన్నాయి. మరి కోమట్లు ప్రజా పోరాటములో భాగస్వాములగుటలో ఆశ్చర్యము ఏముంది. ఇతరచోట్ల సాధారణముగా జమిందారీ పక్షపాతులుగా ఉండే కరణాలు ఇండ్లు పీకించుట, వారి భూములు జమీందారు ఆక్రమించుకొనుటచే ప్రజల తరపున పోరాడవలసి వచ్చింది.

ఈనాందార్ల భూములు జమీందారు ఆక్రమించుకోడం, వారనుభవించుతున్న భూములకు పట్టాలివ్వక పోడంచేత రాజీ షరతు యీనాం భూములకు జమీందారు పట్టాలిచ్చుట ఒక షరతు. ఇంక ఈనాందార్ల రైతుల తరపున పోరాడుటలో ఆశ్చర్య మేముంది.

మంగళ్లు, చాకళ్ళు, మాదిగలు వగైరా సాంఘిక సేవలు చేసే వృత్తులవారు, డబ్బు పుచ్చుకోకుండా రాజాగారి సేవలో నిమగ్నులవ్వాలి. అనవాలుగా వీరు గావించుతున్న ఈ వెట్టి చాకిరీనుండి తప్పించుకోడానికి రాజాకు వ్యతిరేకముగా లేచిన ఈ ప్రజా వెల్లువలో ఐక్యమయ్యారు. రైతులకు కూలికి పోతే యిచ్చే దానిలో సగము మాత్రము యిస్తూ (అందులో పిచ్చికొలతలు, ముక్కిపోయిన గింజలు) వెట్టిచేయించుకొనే జమిందారుకు వ్యతిరేకముగా వ్యవసాయ కూలీలు రైతులతో భుజం భుజం కలసి నిలుచున్నారు. అన్ని వృత్తులవారు కలసి ఐక్యతతో జమిందారును బహిష్కరించుటచే జమిందారుకు కమతాలనుండి ఈ యేడాది వచ్చిన ప్రతిఫలము శూన్యము నైజాము నుండి కూలీలను తెప్పించినా, వారు తమ సోదరుల యెడ సానుభూతితో వెళ్ళిపోయారు.

అందుచే మునగాలది రైతుల పోరాటము మాత్రమే గాదు. మునగాల ఎస్టేటులోని 40 గ్రామాలలోని—వ్రేళ్ళపై లెక్కించగలిగిన జమిందారీ ఉద్యోగులు తప్ప—తక్కిన ప్రజలందరు జమిందారీ నిరంకుశత్వానికి వ్యతిరేకముగా జరిపే పోరాటము.

ఇక గత ఆరుమాసములనుండి మునగాల జమీందారు అచటి రైతులను పెట్టుచున్న నిర్బంధములను, చేయుచున్న నిరంకుశ చర్యలను, శిస్తు వసూళ్ళలో, వెట్టిపనులు చేయించుకొనుటలో గావించుచున్న అత్యాచారములను రైతులు గ్రహించి వాటి నెదుర్కొనుటకు ప్రారంభించిరి. తదాది నేటివరకు అచ్చట ఉభయుల మధ్య తగాదా వ్యవహారములను సామరస్యముగ పరిష్కరింప జేసికొనుటకు రైతులు కోరుచునే యుండిరి. ఈ సందర్భమున గత పశ్చిమ కృష్ణా కాం॥ సంఘము కొంతవరకు కృషిచేయుట, కృ॥ జి॥ రైతు సంఘము, ఆం॥ రా॥ రైతు సంఘము పూనుకొని వ్యవహరించుటయు, రాష్ట్రి కాంగ్రెసు కార్యదర్శి బ్రహ్మయ్యగారు రాజీ గావించుటయు అందరు యెరిగినవిషయాలే.అయితే రైతులు యీరాజీప్రకారం దాదాపు ముప్పదివేల రూపాయిలు అనేక యిడుములకు లోనై ఒక ప్రక్క తిండికిమాడుతూ చెల్లించినప్పటికీ, జమీందారు తాను నిర్వర్తింపవలసిన ధర్మమును ఉల్లంఘించుచూ, సొమ్ము వసూలు అగుచున్న కొలది క్రొత్త షరతుల గోరుటచేత, ఏదో విధముగా రైతులలో గల ఓర్పు, కష్టసహిష్ణుత, మొదలగు శక్తులుకూడ భరింపరానివగుటచేతనే విధిలేక సత్యాగ్రహాన్ని చేయబూని రైతులు ప్రత్యక్ష పోరాటమునకు దిగిరి. వారి పోరాటము ధర్మ సమ్మతము అనుట నిర్వివాదాంశము. ఈ మునగాల పోరాటము ఒక్క మునగాల రైతులు అచటి జమీందారు పోరాటముమాత్రమే అనుకోరాదు. అచటి రైతులు పడుచున్న బాధలు ప్రతి జమీందారీలోను కొలది రూపభేదములతో జరుగుచునే యున్నవి. అందువలన వారి యీ పోరాటము జమీందారు గావించుచున్న దౌర్జన్యములను నరికట్టుటకొరకు—అక్రమ శిస్తు వసూళ్ళ నిలుపుదలకొరకు—జరుగుచున్న జమీందారు—రైతు పోరాటమనవచ్చును. కాన ఆంధ్ర జమీందారీ రైతులకు మార్గ దీపకులయిన మునగాల రైతుల పోరాటము జయముకోరుచు, వారి పోరాటమునకు మనము సహాయ సానుభూతులను తెలుపుటకు, పోరాటము విజయవంతమగు వరకు గ్రామ గ్రామమున సభలు జరిపి ప్రభుత్వ దృష్టికి దెచ్చి న్యాయము జరుగునటుల చూడవలసిన బాధ్యత ఆంధ్ర రైతాంగ మంతటిపైనను గలదు. ఈ సందర్భమున శాంతియుతముగ సత్యాగ్రహ మొనర్చుచున్న రైతులపై పోలీసువారి వర్తనమెటులున్నదో గమనించండి. 2 వ తేదీని 9 గురిని, 3 తేదీని 5 గురిని, 4 వ తేదీని 46 గురు 5 వ తేదీ 53 గురిని అరెస్టు జేసిరి, 4 వ తేదీ అరెస్టు గావించుటయే గాక తీవ్రమయిన లాఠీ చార్జి చేసిరి. సాధారణంగా ప్రజలను క్రూరంగా కొట్టుటయే యింతవరకు దేశంలో జరుగుచున్నది. కాని మునగాల రైతులపట్ల గల కోపము ఇచ్చట పోలీసువారికి వారి పశువులపైనగూడ ప్రసరించినది. నోరులేని పశువులను చావమోదుట — లాఠీలకు మనుష్యుల బలి చాలుటలేదు కాబోలు! వారి లాఠీలకు రైతుల పశువులుకూడ బలి గావలసి వచ్చినది! కాని మనుష్యులతోపాటు పశువులనుగూడ అరెస్టుచేయుట ముందు ప్రారంభించెదరేమో తెలియదు. అయితే మనమందరమిట్లు పోలీసువారి చర్యలను సహించి వూరకుండవలసినదేనా? ఇంత కాలమునుండి జమీందారును రాజీ షరతులు అమలు చేయునటుల చేయలేని ప్రభుత్వాధికారులు నేడు అమాయిక రైతుల నరెస్టు చేయుటకు, వారి పశువులనుకూడ క్రూరంగా అవి పడిపోయేటట్టుగ కొట్టుటకు వెనుదీయలేదు.

కావున ఈ విషయాలు గమనించి మునగాల రైతుల పోరాటముపట్ల ప్రజలు తమ సానుభూతిని గన్పరచుచు, పోలీసు చర్యలపట్ల నిరసన దెల్పుచు, నిర్ణయింపబడిన 11 వ తేదీని గ్రామ గ్రామమున, ప్రతి పట్టణమున సభలు గావించి, తీర్మానములు గావించి, మద్రాసు ప్రభుత్వమునకును, బెజవాడ ఆఫీసునకును, రిపోర్టులు అందజేయ ప్రార్థన. ఆంధ్రదేశమునందంతటను ఈ దినోత్సవమును జయప్రద మగునటుల చూడవలసిన బాధ్యత రైతుసంఘములపైనను, యువకులపైనను గలదు. ముఖ్యముగా సోషలిస్టులు దినోత్సవమును జయప్రదముగా కొనసాగింతురని ఆశించుచున్నాము.

బెజవాడ, 6-6-39

కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి.
అధ్యక్షులు
ఆంధ్రరాష్ట్ర రైతు సంఘం.

మన రాజకీయాలు

రాష్ట్రీయ మంత్రుల సమావేశం

ఇండియా ప్రభుత్వపు హోంమంత్రి ఆహ్వానముపై గతమాసం 25 వతేదీని వేర్వేరుకాంగ్రెస్—కాంగ్రెసేతర మంత్రివర్గాల ప్రతినిధులు సిమ్లాలో సమావేశమయారు. పంజాబు, సరిహద్దు, ఒరిస్సా, బొంబాయి, బెంగాల్, సింధు, యు. పి., బీహార్ రాష్ట్ర మంత్రివర్గాలతరఫున మంత్రులు, పార్లమెంటరీ కార్యదర్శులు సమావేశానికి వెళ్ళారు. "దేశం అంతటా శాంతిభద్రతల రక్షణకై ఏర్పడియున్న వేర్వేరు ప్రభుత్వాలమధ్య ఏంతో సహకారం, సామరస్యం, ఉండడానికి అవకాశము ఉన్నది. అట్టి పద్ధతులతో యీ నిర్మాణ సౌధాన్ని నిలుపగలిగితిమా, మన దేశము అభివృద్ధి పొందడానికి అవసరమైన ప్రధాన కర్తవ్యము ఒకటి నెరవేర్చినవార మవుతాము" అని ఇండియామంత్రి రెజినాల్డు మాక్స్‌వెల్ ఉపన్యసించాడు నూతన రాజ్యాంగ విధానము అనే "నిర్మాణసౌధాన్ని కాంగ్రెసుమంత్రులూ, కాంగ్రెసేతర మంత్రులూ కలిసి రక్షించాలని అతని ఆశయం. ఎవరి నుండి? "శాంతి భద్రతల"ను భగ్నము గావించే వారి నుండి! ఈ "నిర్మాణ సౌధాన్ని" కూలద్రోయడానికి ప్రయత్నించే విప్లవశక్తుల బారినుండి!

రాష్ట్ర ప్రభుత్వాలు మతవైషమ్యాలను అణచడానికీ, దౌర్జన్య ప్రేరేపణ శక్తుల్ని అణచడానికీ, కఠినమయిన విధానము అవలంబించాలని యీ సమావేశములో తీర్మానించబడింది. "వేర్వేరు వర్గాల మధ్య క్రోధభావన్ని" అణచడానికి కూడా కఠిన విధానము అవలంభించాలని కూడా ఆ తీర్మానములో ఉండడమువల్ల, కార్మిక—కర్షక పోరాటాలను నిర్దాక్షిణ్యముగా అణచివేయడానికి అవకాశము ఏర్పడుతోంది. అంతే కాదు. ఇండియన్ పీనల్‌కోడు 153 (ఎ) సెక్షనులో సవరణలు గావించుటకు కేంద్ర ప్రభుత్వానికి అధికారము యిస్తూ మరొక తీర్మానము ప్యాసయింది. ఇప్పుడున్న సెక్షన్ ప్రకారము, "వర్గము" అనే శబ్దములో హిందువులు, మహమ్మదీయులు మొదలయిన మతస్థులు మాత్రమే వస్తారు. అయినప్పటికీ, దీనిని కార్మికనాయకులమీద, రైతునాయకుల మీద కూడా ప్రయోగించి శిక్షలు విధిస్తున్నారు. కార్మికుల్ని, రైతుల్ని కూడా "వర్గము"అనే శబ్దములో చేర్చితే, ఇంకా విచ్చలవిడిగా కార్మిక, కర్షక నాయకుల్ని పరస్టుచేసి శిక్షలు విధించడానికి అవకాశము ఉండేలాగు కేంద్ర ప్రభుత్వము మార్పులు చేయడములో ఆశ్చర్యము ఉండదు.

కేంద్ర ప్రభుత్వం ఈ విధముగా, శాంతిభద్రతల పేరుతో ప్రజా పోరాటాలను అణచడానికి చేసే పన్నాగాలలో బొంబాయి, యు. పి., బీహార్, ఒరిస్సా, సరిహద్దు రాష్ట్రాల కాంగ్రెసు మంత్రులు, పార్లమెంటరీ కార్యదర్శులుకూడా పడిపోవడము ప్రతి కాంగ్రెసువాదికీ ఆశాభంగము కలిగించక మానదు. కాంగ్రెసు మంత్రివర్గాలకు, కాంగ్రెసు ప్రతికూల మంత్రివర్గాలకు, మధ్య "అన్యోన్య సహకారము." "సామరస్యమూ" ఉండడము అంత మెచ్చుకోవలసిన విషయముకాదు. కార్మిక, కర్షక పోరాటాల యెడ మన మంత్రులు ప్రదర్శించిన యీ దుర్బలత్వము ప్రజాక్షేమానికి వ్యతిరేకంగా పరిణమించక మానదు.

మరో విషయం. రెజినాల్డు మాక్స్‌వెల్ తన ఉపన్యాసములో "ఇటీవల ఇంతకంటె ప్రధాన సమస్య మరొకటి ఏర్పడింది. అదే యుద్ధ సన్నాహపు సమస్య. ఈ విషయములో రాష్ట్రీ ప్రభుత్వాలకూ, కేంద్ర ప్రభుత్వానికీ, మధ్య చాలా దగ్గర సంబంధము ఉండడము అవసరం." అని కూడా స్పష్టమైన భాషలో పలికాడు. యుద్ధ విమానాల దాడినుండి ప్రజల్ని రక్షించడానికి రాష్ట్రీ ప్రభుత్వాలకే సర్వాధికారాలు వదలలేదా? అని అతడు ప్రశ్నించాడు.

ఇండియా ప్రభుత్వపు హోం మంత్రి యిచ్చిన ఉపన్యాసముయొక్క గూఢార్థం యిది: దేశములో మీరు శాంతిభద్రతలను కాపాడండి. ప్రజా ఉద్యమాలను అణచేటందుకు బెంగాల్, పంజాబు మంత్రివర్గాలతో కలిసి పనిచేయండి. యుద్ధము వచ్చినప్పుడు మాకు సహాయం చేయండి. అప్పుడు మీపై ప్రత్యేకాధికారాలు చెలాయించబడవు." కాంగ్రెసు మంత్రులు యీ కుట్రకు లొంగిపోవడము ఏ కాంగ్రెసు వాదికైనా భయం కలిగించకమానదు. "కాంగ్రెసు మంత్రులూ, కాంగ్రెసేతర మంత్రులూ ఇండియా ప్రభుత్వపు హోం మంత్రిని మిత్రభావముతో కలుసుకొని, సౌమనస్యంతో కార్యకలాపం ముగించుకొని, మిత్రులవలె తిరిగి వచ్చాము" అని ఒరిస్సా కాంగ్రెసు ప్రధాని పలికిన పలుకులు నిజమైన ప్రతి సామ్రాజ్య వ్యతిరేకి మనస్సులోను బాధ కలిగించక మానవు.

నిర్బంధ విధానం

కాంగ్రెస్ రాష్ట్రాలలో ప్రజా పోరాటాలను అణచడానికి జరిగే నిర్బంధ విధానము చూస్తే మంత్రుల దిగజారుడు విధానం దేశానికి ఎంత ప్రమాదకరమో బోధపడుతుంది. పూరీ (ఒరిస్సా) జిల్లా కాంగ్రెసు సోషలిస్టు పార్టీ కార్యదర్శి గోకుల్ మోహన్‌రాయి చురమణి వేర్వేరు "వర్గాల" మధ్య వైషమ్యం కలిగిస్తున్నాడనీ, ప్రజా దౌర్జన్యాన్ని ప్రోత్సహిస్తున్నాడనీ, కారణం చొప్పున అతడు ఎక్కడా ఉపన్యాసాలివ్వకూడదని నోటీసు జారీచేశారు. దాదాపు 200 మంది రైతు సత్యాగ్రహుల్ని సరిహద్దు రాష్ట్రంలో ఎరస్టు చేశారు. మధ్య పరగణాలలో 25 మంది ఉమ్రేర్ రైతు సత్యాగ్రహుల్ని పోలీసులు ఎరస్టుచేసి అవమాన పరిచారు. ముల్తాన్ (యు. పి.) జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిని రాజద్రోహ నేరంక్రింద.153 (ఎ) సెక్షన్ (వర్గవైషమ్యం) క్రింద విచారించి 18 నెలల కఠిన శిక్ష విధించారు. మన మద్రాసు రాష్ట్రంలో మునగాల రైతు సత్యాగ్రహులమీద, ప్రజలమీద, పోలీసులు జరుపుతూన్న దౌర్జన్యాలు వింటూంటే, గుండె జలదరిస్తోంది.

బెంగాల్‌లో జమియత్ కాన్ఫరెన్సు

ఇక కాంగ్రెసేతర రాష్ట్రాలలో చూదామా అంటే, అక్కడి కాంగ్రెస్ ప్రతికూల మంత్రివర్గాలు జాతీయోద్యమాన్ని ధ్వంసముచేసే ఎత్తులెన్నో వేస్తున్నాయి. ఈ నెల 4 వ తేదీని కలకత్తాలో సమావేశమైనబెంగాల్ రాష్ట్రీ జమియత్—ఉల్—ఉలేమా కాన్ఫరెన్సు (మహమ్మదీయ జాతీయవాదులు) జరగకుండా చేయడానికి వచ్చిన కొంతమంది తుంటరులు "ముస్లిం లీగ్ చిరస్థాయియగుగాక!" "కాంగ్రెస్ మహమ్మదీయుల్ని బహిష్కరించండి!" మొదలయిన నినాదాలతో సభను భగ్నము గావించడానికి పూనుకొన్నప్పుడు అక్కడ స్వయముగా హాజరైఉన్న పోలీసు సూపరింటెండెంటు ఆ తుంటరుల్ని బయటికి పంపివేయడానికి బదులు, కాన్ఫరెన్సునే నిషేధిస్తూ ఉత్తరువు చేశాడు. ఇటీవల బొంబాయి, ఆగ్రా, మీరట్ మొదలైన ప్రదేశాలలో రాష్ట్ర జమియత్ కాన్ఫరెన్సులు దిగ్విజయంగా జరిగి, సంపూర్ణ స్వరాజ్యముతోనే హిందూ—ముస్లిము సమస్య పరిష్కరించబడగలదనీ; అందుకు కాంగ్రెసు సంస్థను మహమ్మదీయు లంతా బలపరచవలసిందనీ తీర్మానాలు ఆమోదించబడ్డాయి., కాంగ్రెస్ ప్రతికూల మంత్రివర్గము చేతుల్లో ఉన్న బెంగాల్ రాష్ట్రపు ప్రభుత్వము ఇట్టి జాతీయ శక్తుల్ని అణచివేయడానికి తన చేతుల్లో ఉన్న అంగబలాన్నీ, అర్థబలాన్నీ పూర్తిగా వినియోగించడములో ఆశ్చర్యము లేదు.

సిమ్లాలో జాతీయ జెండా గతి

పంజాబులో హయత్‌ఖాన్ ప్రభుత్వముకూడా ఇట్టి వైఖరినే ప్రదర్శిస్తోంది. గతసంవత్సరం సిమ్లాలో యిద్దరు తెల్ల సైనికులు అర్ధరాత్రివేళ ఖాదీ భండార్ యెదుట కట్టబడియున్న జాతీయ పతాకాన్ని లాక్కుపోతూంటే, ఒకపౌరుడు వారిని పోలీసులకు వప్పజెప్పాడు. ఆసైనికులిద్దరిమీద తగిన చర్య తీసుకోవలసినదిగా కాంగ్రెసు కమిటీ హెచ్చరించినప్పుడు పంజాబు ప్రభుత్వము సరేనని జవాబిచ్చిందే గాని, నేటివరకూ ఎట్టి చర్య తీసుకొనలేదు. ఈవిషయమై అఖిల భారత కాంగ్రెసు కమిటీవారు పంజాబు ప్రభుత్వ చర్యపట్ల అసమ్మతిని తెలియజేసింది.

హైదరాబాద్ ప్రభుత్వపు నిర్లక్ష్యం

హైదరాబాద్‌లో జరుగుతూన్న ఆర్యన్ లీగ్ సత్యాగ్రహములో పాల్గొని జైళ్లకు వెళ్లతూన్న వారి గతి నానాటికీ అధ్వాన్నమవుతోంది. ఇటీవల స్వామీసత్యానంద్‌జీ, విష్ణు భగవంత టాండర్కర్‌గారలు జైళ్ళలో లాఠీ దెబ్బలకు గురియై మరణించారు. వారం రోజుల క్రితం హైదరాబాద్ ప్రభుత్వముచే మరొక విషాద వార్త ప్రకటించబడింది. ఉస్మానియా ఆసుపత్రిలో నిమోనియా వ్యాధివల్లనన్నూ గుల్బర్గా ఆసుపత్రిలో ఎండగాడ్పులవల్ల మాధవరావు,

అనే యిద్దరు సత్యాగ్రహ ఖైదీలు మే 26 వ తేదీని మరణించినట్లు 5 రోజుల తర్వాత ప్రభుత్వం ప్రకటించింది. వరంగల్ జైలులో ఉన్న సత్యాగ్రహులందరూ నిరశన వ్రతం చేస్తున్నారని మరొక వార్త. ఇదివరలో హైదరాబాద్ ప్రభుత్వము సత్యాగ్రహ ఖైదీలయెడ చూపిన క్రౌర్యము ప్రజలలో విపరీతమైన కలవరము కలిగించింది. వ్యాధిగ్రస్తులయినట్టియు, దుర్బలులైనట్టియు, ఖైదీలయెడ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యముగా ప్రవర్తిస్తున్నదో యీ రెండు ఉదాహరణలవల్ల బోధపడుతూంది. మనుష్యుల ప్రాణాలను ఇంత నిర్లక్ష్యముతో చూచే సంస్థాన ప్రభుత్వాలు క్రమ క్రమముగా ప్రజల విశ్వాసాన్ని పోగొట్టుకొనడమే కాకుండా ప్రజల అసహ్యభావానికి గురికావడము చూస్తున్నాం.

కాంగ్రెసు రాష్ట్రాలలో ప్రజోపయోగ కార్యాలు

కొన్ని కాంగ్రెసు రాష్ట్రాలలో మంత్రులు ప్రజోపయోగ కార్యాలు చేస్తూన్నందుకు వారిని అభినందించితీరాలి. బీహార్ రాష్ట్రంలో లంచగొండితన నిర్మూలనానికి ప్రభుత్వం కొన్నినిబంధనలుచేసింది, లంచాలుపుచ్చుకొన్నట్లు ప్రజలచే చేయబడు కంప్లెయింట్లపై తక్షణం విచారణ గావించేటట్లు ప్రభుత్వోద్యోగులకు తాఖీదులు పంపబడ్డాయి. ప్రతి సివిల్, క్రిమినల్ రివెన్యూ, కోర్టులోను, ఇతర ప్రభుత్వ కార్యాలయాలలోను, కంప్లెయింట్ల బుక్కు ఒకటి ఉంచబడుతుంది. వాటిలో నోట్ చేయబడు అంశాలపై విచారణ చేయబడాలి. ఖైదీలందరూ చుట్ట, బీడీ, వగైరాలు కాల్చుకొనవచ్చు. ఇంకా ఇతర సంస్కరణలు కొన్ని చేయబడ్డాయి.

మధ్య పరగణాల ప్రభుత్వము రైతుల కిచ్చిన టెక్కావీ అప్పుల వసూళ్ళకై ప్రభుత్వోద్యోగులు అవలంభించే నిర్బంధ చర్యలను ఆపుచేయవలసినదిగా జిల్లా అధికారులకు ఉత్తరువులు పంపబడ్డాయి. ఉమ్రేర్‌లో ప్రారంభమైన రైతుల సత్యాగ్రహ పోరాట ఫలితముగా యీ సదుపాయము చేయబడిందని చెప్పవచ్చు. రైతులనుండి ప్రభుత్వానికి రావలసిన సుమారు 2 కోట్ల రూపాయల టెక్కావీ అప్పులు పూర్తిగా చెల్లించ నవసరములేకుండు పద్ధతు లాలోచిస్తున్నట్లు ప్రభుత్వ ప్రకటన ఒకటి వెలువడింది. అన్ని అప్పులలో 100 కి 10 రూపాయల చొప్పున తగ్గించడమా, లేక రివెన్యూ ఉద్యోగస్థులే ఏ గ్రామానికి ఆ గ్రామములో పేద రైతుల స్థితిగతులను విచారించి రిపోర్టు చేసిన మీదట వారి సిఫార్సుల ప్రకారం మొత్తాలు తగ్గించడమా, అనే విషయం ఆలోచిస్తూన్నట్లు తెలుస్తోంది.

కాని, సింధు రాష్ట్రం కాంగ్రెసేతర రాష్ట్రమే అయినప్పటికీ లంచగొండితన నిర్మూలన విషయములో ఆ ప్రభుత్వము అవలంబించబోయే విధానం కాంగ్రెసు ప్రభుత్వాలకు సహితము ఆదర్శప్రాయము కాగలదు. పి. డబ్లియు. డిపార్టుమెంటులో లంచగొండితనము క్రమ పద్ధతి ప్రకారము దారుణముగా జరుగుతూన్నదనీ, దాన్ని నిర్మూలించడానికి ప్రతి సంవత్సరము పి. డబ్లియు. డి. వుద్యోగస్థులు తమకు గల ఆస్థిని గూర్చి రిపోర్టులు పంపుతూ ఉండాలనీ, అక్రమవసూళ్లు తీసుకున్నట్లు ఋజువైతే కఠినమైన శిక్షలు విధించాలనీ సింధు ప్రభుత్వోప సంఘంవారు తీర్మానించారు. ఈ సూచనను ప్రభుత్వం అంగీకరిస్తుందని కూడా తెలుస్తోంది. ఇంతఆదర్శప్రాయమైన పంథాను కాంగ్రెసేతర ప్రభుత్వాలే అనుసరిస్తూంటే, కాంగ్రెస్ ప్రభుత్వాలుకూడా ఆచరణలో పెట్టితే ప్రజల విశ్వాసాన్ని చూరగొనగల్గుతారు.

నిరక్షరాస్యతా నిర్మూలన

బొంబాయి ప్రభుత్వం గత సంవత్సరంలో నిరక్షరాస్య నిర్మూలనానికి 4 లక్షల 22 వేల రూపాయలు ఖర్చుచేసింది. ఈయేడు 9½ లక్షలుఖర్చుచేయబోతోంది. ఒకబొంబాయి నగరంలో ప్రతిరోజు 500 పాఠశాలలు నడుపబడుతున్నాయి. 12000 మంది నిరక్షరాస్యులు అత్యుత్సాహముగా వచ్చి చదువు నేర్చుకొంటున్నారు. పల్లెలలో కూడా విద్యాధికులు ప్రభుత్వానికి చేసేసహకారం చాలా హెచ్చు. బొంబాయి రాజధాని విద్యార్థులసంస్థ ఈ విషయంలో ఎక్కువ శ్రద్ధ చూపుతోంది. పల్లెటూళ్ళ ప్రజలుకూడా వుత్సాహంగా స్కూళ్ళకువచ్చి చదువు నేర్చుకొంటున్నారు. ఇదేవిధంగా యు. పి., బీహారు రాష్ట్రాలలో కూడా ప్రభుత్వాలు ముందంజవేసి ప్రజా సంస్థలయొక్క, ప్రజాసేవకులయొక్క సహకారంతో అవిద్యా నిర్మూలన కార్యక్రమాన్ని చేబట్టాయి.

నిరక్షరాస్య నిర్మూలన కాంగ్రెసు ప్రభుత్వాలు చేయగలిగిన, కార్యక్రమాలలో ఒకటి. అయితే మన మద్రాసు మంత్రివర్గం మాత్రం యీ విషయంలో చాలా వెనుకబడియున్నదని చెప్పకతప్పదు. వేసంగిసెలవుల్లో విద్యార్థుల దళాలకు మ్యాజిక్ లాంతర్లు, పలకలు, కాగితాలు చిన్నచిన్న ప్రాథమిక పుస్తకాలు, సప్లయిచేసి గ్రామాలకు పంపి ప్రోత్సాహం యిస్తే ఎంతైనా అవకాశం ఉండేది. అవిద్యను నిర్మూలించడానికి, ఈయేడు కొన్ని విద్యార్థి సంఘాలు ఆంధ్రదేశంలో కొంత కృషిచేసి, ప్రభుత్వ సహాయం లేక, నిరుత్సాహులయారు. ప్రజా సేవకులయొక్క, ప్రజాసంస్థల యొక్క సహకారం యికముందైనా తీసుకొని, ఇతర కాంగ్రెసు ప్రభుత్వాల ననుసరించవలసిందిగా రాజాజీ ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

నెహూర్ని—ఫెడరేషన్

నేటి రాజకీయ పరిస్థితుల్ని గురించి జహ్వార్లాల్ నెహూర్ని "నేషనల్ హెరాల్డు" పత్రికలో ఒకవ్యాసము వ్రాస్తూ ఈవిధంగాచెప్పాడు.

"ఫెడరేషన్ ఇప్పటి స్వరూపముతో ఇండియాకు రాజాలదు. ఎందువల్లనంటే ఇండియా, ప్రపంచము పూర్తిగా మారిపోయాయి. బ్రిటిషువారితో కలిసి రౌండు టేబిల్ సమావేశాలలో కూర్చునేరోజులు గతించాయి. బ్రిటిషువారు దాన్ని తెలివితక్కువగా మనపై రుద్ద ప్రయత్నిస్తే, భయంకరమైన పోరాటానికి కారణ మవుతుంది. అప్పుడు ఇండియా నేడు ఉన్న స్థితిలో ఉండదు."

ఫెడరేషన్ విషయములో జవహర్లాలునెహూర్ని యొక్క ప్రాతికూల్యతను సందేహించడానికి వీల్లేదు. కొన్ని మార్పులతో ఫెడరేషన్ రావాలని వాంఛించే మితవాద ప్రముఖులకు నెహ్రూ బద్ధ శత్రువు. కాని, ప్రపంచములోను, ఇండియాలో ప్రజాతంత్ర భావాలు పూర్వముకంటె విరివిగా వ్యాపించినంతమాత్రాన పాలకవర్గము భయపడిపోయి నిరంకుశత్వాన్ని వదులుకోవడము చరిత్రలో ఎక్కడా జరుగలేదు. భారతీయుల దృష్టి నేడు రౌండు టేబిల్ కాన్ఫరెన్సులమీద కాకుండా ప్రత్యక్ష పోరాటముమీద ఉన్నదనే విషయము నిజమే. కాని, ప్రజల పోరాటశక్తికి సామ్రాజ్యవాదులు బెదిరిపోయి తమ దోపిడీ విధానాన్ని విడిచిపెట్టరు, నాయకులీవిషయాన్ని గ్రహించి, ప్రజల కొక నిర్దిష్టమయిన పోరాట కార్యక్రమాన్ని ఇవ్వాలి. బ్రిటిషువారు ఫెడరేషన్‌ని మనపై రుద్దితే, పోరాటానికి కారణమవుతుంది కదా అని చేతులు ముడిచిపెట్టుకొని కూర్చోవడం రాజనీతి కాదు. ఇప్పటినుంచీ ప్రజల్ని ఆ పోరాటానికి తయారుచేస్తేనే, స్వరాజ్యసిద్ధి గలుగుతుంది. పోరాటం ఆకాత్తుగా వచ్చినప్పుడు సరియైన ఎత్తుగడలు, తెలియలేక ప్రజలు ఓడిపోవడము జరగకుండా ఉండాలంటే, నెహూర్నివంటి అతివాద నాయకులు యిప్పటి నుంచీ ప్రజల కీయవలసి యుంటుంది.

కార్మిక కర్షకుల పోరాటశక్తి

నెహ్రూ చెప్పిన పోరాటశక్తి కార్మిక-కర్షకులలో నానాటికీ విజృంభిస్తోంది. దిగ్బాయి ఆయిల్ కార్మికులు బ్రిటిష్ పెట్టుబడిదార్ల కుటిల ప్రయత్నాలకు లొంగక, సమ్మెను సాగిస్తూనేఉన్నారు. యు.పి.రాష్ట్రంలో బట్టల మిల్లుల యజమానులు కార్మికులపై చేసే అక్రమాలను ధిక్కరించడానికి రాష్ట్రీమంతటా సర్వవ్యాపిత సమ్మె జరపడానికి యు. పి. ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ తీవ్రప్రయత్నాలు చేస్తున్నారు. 75,000 మంది రైతులు హాజరైన బెంగాల్ రాష్ట్రీ రైతుమహాసభలో రాష్ట్రీ రైతుసంఘానికీ, రాష్ట్రీయ కృషక్ ప్రజాసమితికీ మధ్య ఐక్య సంఘటనకై తీర్మానం ప్యాసుచేయబడినది. భారతదేశపు రైల్వేకార్మికులంతా ఒక్కసారి సమ్మెచేసి తమ హక్కులకై తీవ్రపోరాటం ప్రారంభించడానికి తయారవుతున్నారు. కుల్టీ ఉక్కు ఫ్యాక్టరీలో ప్రారంభమైన సమ్మె సాగుతూనే ఉంది. సరిహద్దు రాష్ట్రంలో క్యాంప్ బెల్‌పూర్ అనే పట్టణానికి సమీపంలో ఉన్న తాతాగ్రామంలో వేలకొద్ది రైతులు పంజాబ్ కాంగ్రెస్ నాయకుడైన డాక్టర్ కిచ్లూగారిని ఆహ్వానించడానికి బ్రహ్మాండమైన ఊరేగింపు జరుపుతోంటే, ముస్లిము జమీందార్లు కొందరు ఊరేగింపును ఆటంకపరచి రాళ్ళతోను, కర్రలతోను, బల్లెములతోనూ అమానుషంగా హింసించారు. ఒక ఆహ్వానసంఘసభ్యునికీ, మరొక ఎర్రచొక్కా వాలంటీరుకూ బలమైన గాయాలు తగిలి, అపాయకరమయిన స్థితిలో ఉన్నారు. కాని మహాసభమాత్రము దిగ్విజయముగా జరిగింది. జమీందార్లు చేసే దుండగాలకు లొంగిపోక ధైర్యముతో పోరాడుతామని రైతులు శపథము తీసుకొన్నారు. మునగాల ఎస్టేటు రైతులపై పోలీసులు ఎన్ని దౌర్జన్యాలు జరుపుతూన్నా, శాంతియుతంగా సత్యాగ్రహం సాగిస్తున్నారు. 6 వ తేదీని నడిగూడెంలో మొత్తము 26 గురిని ఎరస్టు చేశారు. తమ కనీసపు కోర్కెలునెరవేరేపర్యంతము సత్యాగ్రహాన్ని కొనసాగించి తీరుతామని మునగాల రైతులు దృఢనిశ్చయులయి ఉన్నారు.

పట్టాభిగారు ఫార్వర్డ్ బ్లాక్

డాక్టరు పట్టాభిగారు బందరులో యిచ్చిన తమ ఉపన్యాసంలో ఫార్వర్డ్ బ్లాక్‌మీద దండయాత్ర ప్రారంభించారు. ఫార్వర్డ్‌బ్లాక్ కార్యక్రమానికీ, కాంగ్రెసు కార్యక్రమానికీ మధ్య భేదంలేకపోయినా నెమ్మదిగా నడవవలసినప్పుడు పరుగెత్తడం, పరుగెత్తవలసినప్పుడు గ్యాలప్‌చేయడం ఏమాత్రమూ తగదనపట్టాభిగారివాదన.

కాని నేటి జాతీయ—అంతర్జాతీయ అనుకూల పరిస్థితులలో ప్రజలు నెమ్మదిగా నడవాలని సలహా యివ్వడం బహు శోచనీయము. పట్టాభిగారు చెప్పిన కాంగ్రెసు గుర్రం గ్యాలప్ చేయవలసిన ఈ రోజుల్లో క్రింద పడుకొని కదలకపోవడం నేడు చూస్తున్నాం.

విదేశాలలో భారతీయులు

సిలోన్ — వెస్టు ఇండీస్ నివాసుల దురవస్థలు

సింహళం (సిలోన్)8 లక్షలు పైగా భారతీయులు నివసించుచున్నారు. ఇందులో తమిళులు. మళయాళీలు ఎక్కువ. ఈ ద్వీపం భారత దేశానికి సమీపంలో (స్టీమరులో 2 గంటల ప్రయాణమే ధనుష్కోటినుండి)వుండుటచే ఆ దేశస్థులకు భారతీయులకు ప్రాచీన కాలం నుండి సన్నిహిత సంబంధముంది. రామాయణంలో చెప్పబడు రావణాసురుని లంక యిదియేనని ప్రజలు చెప్పుకుంటారు. ఈ ద్వీపం బ్రిటీషు సామ్రాజ్యవాదులు పెత్తనం క్రిందకు వచ్చినప్పటినుండి, ఇది బ్రిటీషువారి వలసరాజ్యంగా (crown colony) వుంది. దీనిలో సింహళ దేశీయులు. యీ దేశాన్ని నివాసంగా యేర్పరచుకొన్న యూరోపియన్లు, భారతీయులుకూడా వున్నారు. యూరోపియన్లు తమ తోటలలో పని చేయించుకొనుటకు భారతీయులను ప్రోత్సాహపరచి, యిండియా ప్రభుత్వ సహాయంతో పిలిపించుకొన్నారు. ఇపుడు దేశీయులలో వ్యాపించి వున్న నిరుద్యోగాన్ని బాపుటకు భారతీయులను తిరిగి యిండియాకు పంపివేయ బూనుకొన్నారు. కాపిటలిజం (పెట్టుబడిదారీ విధానం)లో తప్పనిసరిగా వచ్చు నిరుద్యోగ సమస్యను ఎన్నో సంవత్సరాల నుండి పనిచేయుచున్న భారతీయులను దేశాన్నుంచి వెళ్లగొట్టి (హిట్లరు యూదుల వెళ్లగొట్టినటుల) సామ్రాజ్యవాదులు పరిష్కరించ దలచుకొన్నారు.

ప్రస్తుతం భారతీయ హక్కులపై దాడి మొదటిసారి వారి ఓటింగు తొలగించుటతో ప్రారంభమయింది. 1934 సం॥తరువాత ప్రభుత్వ సర్వీసులో రోజు కూలీలుగా చేరినవారిని 8000 మందిని పంపివేయుటకు అవటి ప్రభుత్వం ఒక బిల్లును తెచ్చింది. ఈ స్కీమును అమలు నందుంచడానికి సింహళ ప్రభుత్వం 5 లక్షల రూపాయల గ్రాంటు కోరుచూ బిల్లు తెచ్చింది. ప్రభుత్వోద్దేశం సింహళ దేశీయులు కాని రోజుకూలీలందరినీ పంపివేయాలని. ఇందులకు 25 లక్షలు రూపాయలు ఖర్చగునని అంచనా వేయబడింది. మొదటి మెట్టుగా యిపుడు 8 వేల మందిని పంపివేయడానికి 5 లక్షల గ్రాంటు స్టేటు కౌన్సిలులో ప్యాసైంది.

దీని ప్రకారం 1934 తరువాత వచ్చినవారిని ఐదు సంవత్సరాలు పైగా సర్వీసులో వుండినా తమంతట తామే వెళ్ళిపోవడానికి యిష్టపడు వారిని పంపివేస్తారు. 1924 మార్చి 31 తరువాత ప్రభుత్వ సర్వీసులో జేరిన రోజుకూలీ లందరికి ఒక నెల నోటీసు యివ్వబడుతుంది. స్వగ్రామం జేరటానికి ఆతనికి, అతని భార్యకు పిల్లలకు మొత్తం నాలుగు పూర్తి టిక్కెట్లు మించకుండా యివ్వబడతాయి. స్వస్థలం జేరిన తరువాత ఒక నెల జీతం అదనంగా యివ్వబడుతుంది.

ఐదు సంవత్సరాలకుపైగా సర్వీసులోవున్న సింహళేతర రోజు కూలీలకు తమంతతాము వెళ్ళిపోవువారికి, స్వగ్రామాలకు 4 టిక్కెట్లు మించకుండా యిస్తూ, పది సంవత్సరాలలోపు సర్వీసులో వున్నవారికి రెండునెలల అదనపు జీతము, పదిహేను సంవత్సరాలలోపు సర్వీసు వున్నవారికి మూడునెలల అదనపు జీతం ఇవ్వబడుతుంది. 15 సంవత్సరాలు అంతకుమించి సర్వీసులోవున్నవారికి అతను సర్వీసుచేసిన ప్రతి నెలకు జీతంలో 1/18 వంతును లెక్కించి దానిలో నుండి అతను రిటైరుఅగు వయస్సు 60 కి ఎన్నేళ్లు తగ్గిన ప్రతియేడాదికి నూటికి రెండువంతున తగ్గించగా తేలిన మొత్తాన్ని యిస్తారు. ఈ అవకాశము 1939 డిశంబరు 31 వ తేదీవరకే యివ్వబడుతుంది.

ఈ శాసనంలో సింహళేతరులనియే ఉదహరించబడినా, ముఖ్యంగా యిది భారతీయులకే వర్తింపుతుంది. యూరోపియన్లకు వర్తించదు. పత్రికలలో ప్రకటింపబడుచున్న వార్తలనుబట్టి ప్రయివేటు యజమానుల సర్వీసులోవున్న వారిపైకూడ నిబంధనలు యేర్పరచుటకు సిలోనుకు వలస వచ్చువారికి నిబంధనలు చేయుటకు శాసనాలు కావించబడతాయట. "షాప్ అవర్సు" ఆక్టు క్రింద ప్రతి దుకాణదారు తనషాపులో నియమితసంఖ్య సింహళ దేశీయులను నియమించాలని నిర్బంధించ బడుతుంది. ప్రభుత్వ కంట్రాక్టులు కనీసం నూటికి 50 దేశీయ పెట్టుబడికల్గిన సింహళ కంపెనీలకే యిచ్చే నియమం ఏర్పరచబడు తుంది. ప్రభుత్వ సర్వీసు నుండి తొలగించిన వారిని నిర్బంధముగా పంపివేయుటకును. వ్యతిరేక ఆందోళనను అరికట్టుటకు రాజద్రోహ శాసనముకూడ గావించబడుతుంది.

ఈస్కీమువలన వెడలగొట్టబడే 8 మొదలు 10 వేల భారతీయులలో అనేకమంది సింహళములో స్థిరనివాసమేర్పరచుకొని సింహళస్త్రీలను వివాహమాడిన వారున్నారు. సింహళంలోనే జన్మించినవారున్నారు. వారికి భారతదేశము తోనూ, పూర్వ వంశాలతోనూ పూర్తిగా సంబంధం విడిపోయింది. భారతీయులమని చెప్పుకొనుటే వారికి మిగిలింది. సింహళదేశాభివృద్ధికి తమకష్టాన్ని ధారపోసిన వీరిని పని నుండి తొలగించి వెడలగొట్టడం అన్యాయం. దూరదృష్టితో ఆలోచించిన సింహళ రాజకీయవేత్తలు ప్రాచీన కాలంనుండి యీ రెండు దేశాల మధ్యవున్న సన్నిహిత సంబంధము తమ దేశానికి లాభకరమని తెలిసికోకపోరు. రాజకీయ లాభాలతోబాటు చిన్నదైన సింహళం భారతదేశాన్నుండి కొనేది స్వల్పం: విశాలమైన భారతదేశం సింహళ దేశవస్తువులకు చక్కని మార్కెటు. కాని జాతి ద్వేషం, సాంఘిక ద్వేషాలు ప్రబలిన యీ రోజులలో దూరాలోచన లోపించడంలో ఆశ్చర్యంలేదు. ఒక్క తిరువాన్కూరు పొగాకు దిగుమతిపై పన్ను విధించిన సింహళంలో 2½ లక్షలకు ఉత్తర సింహళం జీవనోపాధికి దెబ్బ తగులుతుంది.

"సిలోను ప్రభుత్వపు యీచర్య మనకు మన బానిసత్వాన్ని మరీమరీ జ్ఞాపకం చేస్తూంది. భారతదేశం స్వాతంత్ర్య దేశమే అయినచో ప్రక్కనున్న చిన్న దేశంలో భారతీయులను యిట్టి అక్రమానికి వాల్జేయదు. మన సుహృద్భావానికే ఎదురు జాచేది.

"బ్రిటీషు సామ్రాజ్యవాదపు ఏజెంటు అయిన యిండియా ప్రభుత్వం యీమధ్య ఇండియా మంత్రి శెల్లాండు ప్రభువు సామ్రాజ్యవాదులు మనకిచ్చిన రక్షణను గురించి కోతలు కోసాడు. బ్రిటీషు సామ్రాజ్యంలో భారతీయులకు జరుగుతున్న అన్యాయం అవమానం తొలగించడానికి ఏమిచేస్తుందో చూడాలి. బహుశా: యేదో ఒక మ్మతి తెలియజేస్తుంది. ఇండియా ప్రభుత్వపు అసమ్మతిని ఎవరూ లక్ష్యం చేయరు. భారత జాతి సామ్రాజ్యాంతర్గత దేశాలలో మనకు జరుగుతున్న అవమానాన్ని తొలగించడానికి ఉపాయ మాలోచించాలి. మనం విదేశ ప్రభుత్వంపై ఆధారపడి కూర్చొన్న జాలము" అని వుంది. అఖిలభారత కాంగ్రెస్ విదేశ శాఖవారు యీవిషయమై చేసిన ప్రకటనలో.

జి. వి. దేశముఖ్ ఢిల్లీ అసెంబ్లీ నిన్నటి సమావేశంలో చర్చించడానికి ఒకబిల్లుకు నోటీసుయిచ్చాడు. దీనిప్రకారం బ్రిటీషు సామ్రాజ్యంలోని యితర దేశాలు భారతీయులయెడ ఎట్టివైఖరి అవలంబించు చున్నాయో తత్తుల్యమైన వైఖరి యిండియా ప్రభుత్వం ఆయాదేశీయులయెడ అవలంబించాలని కోరుతూంది. ఈబిల్లు యిండియా ప్రభుత్వంపై వత్తిడి జేయడానికి పనికివచ్చినా యిదియే పరమావధి కాదని మరచిపోరాదు. ఏనాడు బ్రిటీషు సామ్రాజ్యాన్ని నాశనం గావించి భారతదేశం సంపూర్ణ స్వాతంత్ర్యమును సంపాదించునో ఆనాడే భారత ప్రజలు యితర దేశీయులతో సమానమైన గౌరవ, ప్రతిపత్తులు పొందగలుగుతారు.

వెస్టు ఇండీస్

క్రిస్టఫర్ కొలంబస్ భారతదేశానికి రావడానికి పడమటిమార్గాన బయలుదేరి త్రోవలో తనకు కన్పించిన అమెరికా సమీపంలో వున్న దీవులను యిండియాకు సంబంధించినవని తలచి వానికి పశ్చిమ యిండియా దీవుల (వెస్ట్ ఇండీస్) ని పేరిడుటచే నాటినుండి అవి ఆ పేరుతోనే పిలువబడుచున్నాయి. బ్రిటీషు సామ్రాజ్యానికి చెందిన 'జమైకా', 'ట్రినిడాడ్' 'బ్రిటీషు గయానా' (ఇది దక్షిణ అమెరికాలో ఈశాన్య దిక్కునవుంది)లందునూ,డచ్చి గయానాలోనూ కలసి మొత్తం 4 లక్షలు భారతీయులున్నారు, ఇందులో బ్రిటీషు గయానాలో 1,36,000 మంది 'జమైకా'లో (బ్రిటీషువారిది) 17,380 వున్నారు. 'ట్రినిడాడ్' జనాభాలో మూడవవంతు భారతీయులే. వీరి స్థితిని గురించి ఇండియాప్రభుత్వంచే నియమించబడిన మిష్టర్, టైసన్, ఐ. సి. యస్., భారతీయుల తరపున బ్రిటీషు ప్రభుత్వంచే వెస్ట్ ఇండీస్ పరిస్థితులను విచారించుటకు నియమించబడిన రాయల్ కమీషన్‌కు యిచ్చిన మెమొరాండములో యీ విషయాలున్నాయి.

జమైకా.

యీ దీవి జనాభాలో నూటికి ఇద్దరుమాత్రమే భారతీయులు. వీరు చాల వెనుకబడి వున్నారు. దాదాపు అంతా వ్యవసాయికులు. కార్మికులే. పర్తకులు స్వతంత్ర వృత్తుల అవలంబించిన వారు మహ వుంటే ఒక డజను వుంటారు. యీ ద్వీపంలో పురుగు హెచ్చుటచే అరటి తోటలు మాని యిప్పుడు కొబ్బరి తోటలు హెచ్చుగా వేస్తున్నారు. అందుచే నిరుద్యోగం హెచ్చింది. ముఖ్యంగా భారతీయులకు వారానికి రెండు రోజులుమాత్రమే కూలి దొరుకుతుంది. స్త్రీలకు అంతకంటే తక్కువ. భారతీయులను పరిశ్రమలలోకి కంట్రాక్టరులు. మేస్త్రీలు ఇతర జాతులవారగుటచే తీసికొనుట లేదు. 'కింగ్స్ టన్' ప్రాంతాన కూరగాయలు యింటింటికి తీసికొనిపోయి అమ్ముటను నిషేధించుటచే అదే వృత్తి అయిన అనేకమంది భారతీయులకు జీవనోపాధి పోయింది.

ఇచట భారతీయులలో చిన్నవారంతా ఇంగ్లీషు మాట్లాడుతారు. వీరికి చదువు అవకాశాలు కలిగించితే వృద్ధిలోకి వస్తారు. వృద్ధులు హిందుస్థానీ మాత్రమే మాట్లాడగలరు (వీరు ఇండియానుంచి వెళ్లినవారు.) వీరు హిందూదేశానికి అచటి కష్టాలు భరించలేక తిరిగి వెళగోరుతున్నారు. ఇండియా ప్రభుత్వం వారి రక్షణకు ఒక 'ప్రొటెక్టరును' నియమించి భూమి భారతీయులు వ్యవసాయం చేసికోడానికి యిచ్చే ఒక స్కీమును అమలులో పెట్టాలని 'టైసన్' కోరుతున్నాడు. శాసనసభలో భారతీయులకు ప్రాతినిధ్యమే లేదు.

బ్రిటీషు గయానా.

ఇచటికి భారతీయులవలస 100 యేండ్లనాడు ప్రారంభమయింది. ఇచటి జనాభాలో నూటికి 41 మంది భారతీయులు. ఏయితర జాతికన్నను అధిక సంఖ్యాకులు. వీరిలో 53 వేల మంది చెరకుతోటలలో కూలీలుగా పనిచేస్తున్నారు. బ్రిటీషు కాలనీలలో ఒక్క బ్రిటీషు 'గయానా'లో మాత్రమే భారతీయులు ఇతరులతో సమానమైన ఓటింగు హక్కు కలిగి వున్నారు. కాని ప్రభుత్వం భారతీయుల చదువుకు తగిన యేర్పాటులు గావించపోవుటచే వీరి రాజకీయ హక్కులు నామమాత్ర మవుతున్నాయి. శాసనసభలో 3 గురు మాత్రమే భారతీయులున్నారు. నూటికి 8 మాత్రమే ప్రభుత్వోద్యోగాలు భారతీయులకు అందుబాటులో వున్నాయి. ప్రభుత్వం యూరోపియన్ యజమానికి అనుకూలంగాను భారతీయ కార్మికునికి వ్యతిరేకంగానూ తక్కిన బ్రిటీషు సామ్రాజ్యంలో వలెనే ప్రవర్తించుతోంది.

"టైసన్" భారతీయుల నిరుద్యోగ సమస్యను నివారించడానికి, 'ల్యాండ్ సెటిల్‌మెంటు స్కీము' ప్రవేశపెట్టాలనీ, ఆదేశాన్ని ఉన్నతికి తేడానికి ఎక్కువ శ్రమపడిన భారతీయులేనని మెమొరాండంలో తెలియజేసాడు. అచటి ప్రభుత్వం "హిందూ" "ముస్లిమ్" మతసూత్రాలపై జరుగు వివాహాలను గుర్తించుట లేదు. ఇవి గుర్తింపజడాలని "టైసన్" వ్రాస్తూ సామ్రాజ్యం యితర భాగాలలో భారతీయులకు జరుగుతున్న ఆదరణ విషయం భారత ప్రజలకు చాల ఆందోళన కలుగుతోందనియు, పూర్వము 'ఇడెంచెర్డు సిస్టం' (కంట్రాక్టు పద్ధతి)ద్వారా వలసకు తోడ్పడిన భారతప్రభుత్వం ఇపుడు ఏజెంటులను నియమించి విదేశాలలో భారతీయుల హక్కుల రక్షించు ఏర్పాటులు గావించాలనీ కోరాడు.

ట్రినిడాడ్

ఇచట జనాభాలో మూడవ వంతు భారతీయులు. ప్రభుత్వంలోవున్న నల్గురు ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్లలో ఒకరైన కనీసము భారతీయుడు కాకపోయినా భారతీయుల సమస్యను అర్థం చేసికొన్నవారుండాలని "టైసన్" కోరాడు. ఉద్యోగాలు పూర్తిచేయునపుడు యిదివరకువలె జాతినిబట్టిగాక అర్హతనుబట్టి నిర్ణయించాలి. అచటి పంచదార ఫ్యాక్టరీలలో చాల కొద్దివానిలో మాత్రమే పై ఉద్యోగాలలో భారతీయులను నియమించుకున్నారు. ప్రభుత్వ రైల్వేలలోకూడ భారతీయులకు సమానావకాశాలు యివ్వబడుట లేదు. 'జాతి'నిబట్టి ఉద్యోగాలిచ్చు విధానం పోవాలని 'టైసన్' మెమొరాండంలో తెలియజేశాడు. శాసనసభలో ముగ్గురు భారతీయులున్నారు.

మొత్తం 'వెస్ట్ యిండీస్'లో వున్న భారతీయులు ఆయా దేశాల అభివృద్ధికి ఎక్కువ కారకులైనా వారికి తగినరక్షణలేదు. వారుకార్మిక సంస్థలు వగైరా స్థాపించుకోలేదు. వివిధమతాలవారున్నా యెట్టి విద్వేషాలు లేకుండా ఐక్యంగా వుంటున్నారు. మాతృదేశం స్వాతంత్ర్యం సంపాదించినపుడు తమ హక్కులు రక్షింపబడతాయని అచటి యువకులు భారత జాతీయ కాంగ్రెస్ వైపు ఆశతో ఎదురు చూస్తున్నారు.

మద్రాసు ప్రభుత్వానికి కార్మిక నివేదిక

కార్మికులకు వెంటనే చేయవలసిన సౌకర్యాలు

మే 12 వ తారీఖునాడు మద్రాసు రాష్ట్రీయ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ ప్రతినిధులు, మద్రాసు కార్మిక పారిశ్రామికశాఖా మంత్రి వి. వి. గిరిగారిని కలుసుకొని. వార్ల కనీసపు కోరికలను స్పష్టీకరించే ఒక సమగ్ర నివేదికను మంత్రిగారికి సమర్పించుకున్నారు.

కార్మిక నివేదిక.

వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులమైన మేము, విశాలతరమైన కొన్ని సమష్టి సూత్రముల నాధారముగా జేసికొని యీ నివేదికను తయారుజేసియున్నాము. మీరు త్వరలో తేనున్న సమగ్ర కార్మిక శాసనమునకిది అత్యంతము ఉపకరించగలదని మా విశ్వాసము. రాష్ట్రీయ కార్మికోద్యమము సక్రమముగా అభివృద్ధి చెందవలెననిన, రాష్ట్రీయ ప్రభుత్వంవారు ఉచితమైన సమగ్ర కార్మిక శాసనావళిని చేయవలసి ఉంటుంది. రాష్ట్రంలో పారిశ్రామిక క్రమాభివృద్ధి పర్యవసానంగా, కార్మిక తగాయిదాలు వెనుకటికన్నా హెచ్చు అయినవి. రాష్ట్రంలో పారిశ్రామిక లోకంలో, కార్యశాంతి యేర్పడాలంటే, ప్రభుత్వంవారు తక్షణమే ఉచితమైన న్యాయమైన సమగ్ర కార్మికశాసనం చెయ్యడానికి పూనుకోవాలి.

మద్రాసు గవర్నమెంటువారి ప్రకటన.

మద్రాసు గవర్నమెంటువారు వారి 22-10-37 వ తారీఖునాటి ప్రకటనలో యీ క్రింది శ్లాఘనీయమైన ఉద్దేశ్యములను వెలిబుచ్చియున్నారు:

(అ) కార్మిక తగాయిదాల సందర్భమున ఇరువక్షాలవారి మధ్య వారిలోవారికి రాజీ కుదర్చడానికి ప్రభుత్వంవారు ప్రయత్నిస్తారు.

(ఆ) కష్టనిష్ఠురాలను ముందుగా తెలియబరచి,కొంత సంప్రదింపులు జరిపిన తర్వాతగాని ప్రత్యక్ష ప్రతిక్రియకు దిగకూడదని ప్రభుత్వపు ఉద్దేశ్యం.

(ఇ) రాజీ కుదరని సందర్భమున ప్రభుత్వమువారు కలుగజేసుకొని, పరిష్కారానికి శక్తివంచనచేయక కృషిచేస్తారు.

గవర్నమెంటువారు వారి ప్రకటనలో తెలిపిన సూత్రములతో మేమున్నూ పూర్తిగా ఏకీభవిస్తున్నాము. సర్వసాధారణముగా, కార్మిక తగాయిదాలు సులభంగా కుదరకుండా ఉండడానికి కారణం కార్మిక సంఘాలను యజమాని వర్గంవారు గుర్తించడానికి నిరాకరించడమే. ఇందుమూలమున కార్మిక సంఘాలవారు, తక్షణమే సాధికార పూర్వకంగా, యజమానివర్గం వారితో రాజీ రాయబారాలు సాగించలేక పోతున్నారు. ఒక పరిశ్రమ లేక వ్యాపారసంస్థలో పనిచేసే కార్మికులలో 10%కు తగ్గని సభ్యుల సంఖ్యగల రిజిస్టర్డు (కులతత్వమునకు దూరమైన) కార్మిక సంఘాలను, ఆయా పరిశ్రమల యజమాని వర్గంవారు నిర్బంధముగా గుర్తింపునట్లు, మీరు చేయనున్న సమగ్ర కార్మికశాసనములో ఒక నిబంధనను ప్రవేశపెట్టడం అత్యవసరము అని మా మనవి. అట్లా రిజిస్టరై గుర్తింపబడిన కార్మిక సంఘాలకు, కార్మికాభ్యున్నతికి తోడ్పడే సర్వవార్తలను, గ్రంధములను తెప్పించుకొని ఉపయోగపరచు కొనడానికి అధికారం ఉండాలి.

కార్మికుల కోరికలు

1930 బొంబాయి కార్మిక తగాదా చట్టము ననుసరించి మీరున్నూ, కార్మికుల పైన యజమానులు కక్ష వుంచుకొని వారిని అథోగతిపాలు చేయకుండా ఉండేలాగున కార్మిక సంరక్షణ నిబంధనలను కొన్నింటిని మీ శాసనంలో చేర్చడం అవసరం.

కార్మిక నిబంధనలను ఏ విధంగా అమలు జరుపుతున్నది తెలుసుకోనేటందుకు కార్మిక సంఘాధికారులకు ప్రభుత్వంవారు సౌకర్యములను కల్పించాలి.

కార్మిక సంఘానికి రావలసిన రాబడి సొమ్మును వసూలుచేసే అధికారం కార్మిక సంఘానికి శాసనపూర్వకంగా మీరు ఇవ్వాలి. పనిచేసే ఆవరణలో అనుకూలమైన ఒక నిశ్చిత స్థలంలో కార్మిక సంఘాధికారులు కార్మిక సమస్యావిజ్ఞాన గ్రంథములనూ ప్రకటనలనూ కార్మిక సభ్యులకు పంచిపెట్టుటకు వీలుకల్పింపబడవలెను. విశ్రమ స్థలములలో కార్మికులతో సంభాషణలు జరపడానికి అవకాశం ఇవ్వాలి.

కార్మికు లందరినిగాని, ఒక కార్మికునిగాని నష్టపరచే నిబంధనల సవరణలు ఏమైనా క్రొత్తగా ప్రవేశపెట్టదలచిన, యజమానివర్గం వారు ముందుగానే ఆ మార్పులను గురించి కార్మిక సంఘాధికారులతో సంప్రతింపవలెను.

యజమాని వర్గంవారు, కార్మిక సంఘపు రాయబారులకు. సహేతుక వ్రాతపూర్వకమైన ప్రత్యుత్తరం ఒసగేలాగున ప్రభుత్వంవారు శాసనరీత్యా యేర్పాటుచేయడం అవసరం.

రాజీ కుదర్చలేకపోయిన కార్మికసంఘానికి ప్రభుత్వంవారు సహాయపడి, అప్లికేషను దాఖలు చేసినమీదట, ఒక పరిష్కార సంఘమును ఏర్పాటు చేయించాలి

అప్లికేషను దాఖలుచేసిన తారీఖునుండి నాల్గు వారాల గడువులోపల పరిష్కార సంఘంవారు విచారణను ముగించి, తీర్పుచెప్పడానికి సిద్ధంగా ఉండాలి. ఉభయపక్షముల అంగీకరిస్తేనేగాని విచారణను వాయిదావేయకూడదు.

బ్లాక్ లెగ్స్ సమస్య.

పై పరిష్కార పద్ధతుల అన్నీకూడా నిష్ఫలం అయిపోయి, కార్మిక సంఘంవారు తప్పనిసరిగా సమ్మె చేయడానికి సన్నిద్ధులైనప్పుడు, అవినీతికరముగా 'బ్లాక్ లెగ్స్' (సమ్మె చేస్తుండగా పనిచేయడానికి పోయే ఇతరకూలీలు)పద్ధతి యజమాని వర్గంవారు అవలంబించకుండా ప్రభుత్వంవారు శాసనంద్వారా నిరోధించడం అవసరం. పై అవినీతికరమైన బ్లాక్ లెగ్స్ పద్ధతిని అవలంబించి శాసనమును ధిక్కరించిన యజమానులమీద రిజిష్టర్డు కార్మిక సంఘములవారు ఫిర్యాదు చేసినయెడల ప్రభుత్వంవారు తగిన తీవ్రచర్య పుచ్చుకోవాలి

కార్మికుల, యజమానుల పరస్పర సంబంధములు వ్యక్తిగతమైన ఒడంబడిక నాధారముగా చేసుకొనగూడదు. సాధికార కార్మిక సంఘాలు కార్మికుల తరుపున, యజమానులతో సమష్టి ఒడంబడికనుచేసుకోవడానికి, ప్రభుత్వం వారు అంగీకరించాలి. ప్రత్యేక వృత్తి నిపుణుల విషయమున మాత్రం పై సమష్టి అంగీకారం అక్కరలేదు.

రిజిష్టర్డ్ కార్మికసంఘాలు లేనిచోట్ల గవర్నమెంటు పరిష్కర్త, అట్టి సమష్టి ఒడంబడికలను స్వయంగాచేసి రిజిష్టరు చేసుచున్నను.

ఏ పక్షమైనను, రాజీ షరతులను భంగపరచినప్పుడున్నూ, భంగపరచవారు అనేఆరోపణలు వచ్చినప్పుడున్నూ,అట్టి ఆరోపణలను విచారించడానికి ప్రభుత్వంవారు ఒక న్యాయస్థానమునకు చెందిన అధికారిని లేకఅధికారులుగల స్వతంత్ర విచారణ సంఘమును నెలకొల్పవలెను.

కార్మిక తగాయిదాల సందర్భమున పోలీసు శాఖవారి ప్రవర్తన యెట్లుండవలెనో, అనే విషయాన్ని ప్రభుత్వంవారు శాసనంలో విస్పష్టంగా తెలియజెప్పాలి.

నిరుద్యోగ భీమా సమస్య

నిరుద్యోగభీమా స్కీము సర్వపారిశ్రామిక సంస్థల కార్మికసంఘములకున్నూ ప్రభుత్వంవారు వర్తింపజేయాలి. గుర్తింపబడిన సాధికారముగల కార్మిక సంఘాధికారులతో సంప్రతించి వారిసలహా తీసుకోకుండా, యజమానివర్గంవారు రిట్రెంచ్‌మెంటు విధానం అమలు పరచరాదని, కార్మికశాసనంలో ఒక నిబంధనను ప్రభుత్వంవారు ప్రవేశపెట్టాలి. కార్మికులను తగ్గించివేయడానికి తటస్థించిన ఆర్థిక నైపుణిక కారణములకు యజమానులు ప్రభుత్వంవారికి తెలియబరచాలి.

ఇరవై రూపాయలకన్నా తక్కువయైనజీతం గడించే కార్మికులవద్దనుంచి నిరుద్యోగ భీమా కోసం వసూలుచేసే మొత్తమును ప్రభుత్వంవారు సగం చెయ్యాలి: నెలకు పది రూపాయలకు తగ్గు జీతం పుచ్చుకునే కార్మికులవద్ద నుంచి, ఏమీ కూడా వసూలు చేయకూడదు. అందుమూలమున నిరుద్యోగ భీమానిధిలో కలిగే తగ్గుదలను పూడ్చే బాధ్యత యజమానులదై యుండాలి. పనిచేసిన రోజున మూడు దమ్మిడీలు ఇవ్వడానికి మేం అంగీకరిస్తున్నాం.

కార్మికుల సమ్మెకట్టునకు వ్యతిరేకంగా ఫ్యాక్టరీలో పనిచేయడానికి అంగీకరించనందునను, డిస్‌మిస్ అయినందునను, రాజీనామా పెట్టినందునను, యజమానులు, కార్మికులకు న్యాయంగా రావలసిన సొమ్మును ఇవ్వడానికి నిరాకరించకుండా ఉండేలాగున నిబంధనలు కల్పించాలి. ఈ సందర్భములలో ప్రభుత్వం వారున్నూ యజమానులున్నూ ఇంగ్లీషు సాంప్రదాయములను అనుసరించి వెళ్లాలి.

మద్రాసు ప్రభుత్వంవారికి మా ఆఖరి విన్నపం ఇది. ఈక్రింది అంశములపైన తక్షణ శాసనావశ్యకత ఎంతైనా కలదు.

1. 8 గంటల పని దినం.

2. వృద్ధాప్యానికి, అనారోగ్యానికీ, అనాథ స్థితిలోనున్నవారి జీవనోపాధికి పింఛన్లు

2. పరిశ్రమ సంస్థలో పనిచేయవలయుకొన్న కార్మికుల పని షరతులను నిర్ధారణచేసే ప్రత్యేక సంస్థాపనం.

4. నిక్కచ్చిగా పని గంటలను నిర్ణయించడం. షాపు, అనిసైటు సర్వీసుషరతులను న్యాయసమ్మతముగా పరిపాలించడం.

లేబరు కమీషనరు గారి తీర్పు

కాకినాడ పీచు కార్మికుల సమ్మె

కాకినాడ పీచుకార్మికులు 8-3-39 వ తమకు 4 సంవత్సరాలక్రితం తగ్గించిన రేట్లను తిరిగి సంపాదించుకొనుటకూ, వారి వేతనములందు అక్రమపు మినహాయింపులు పోగొట్టుకొనుటకు సమ్మె ప్రారంభించిరి. 45 రోజులవరకు సమ్మెసాగింది. ప్రభుత్వపు నిర్బంధ విధానానికి కార్మికులు గురి అయ్యారు కాంగ్రెసు వాయకులైననూ కార్మికులకు సహకారము చేయలేదు. కార్మికులు మరి నాయకులుకూడా అరెస్టు చేయబడిరి. లేబరు కమషనరు విచ్చేసి. కార్మికుల కోర్కెలు సక్రమమైనవని గ్రహించి యజమానులు కూలి హెచ్చించుటకు అంగీకరించాలని తెలియజేశాడు. కాని యజమానులందుకు అంగీకరించనందున యజమానులపై 144 సెక్షను ఆ జిల్లా కలెక్టరు జారీచేశాడు. తరువాత యజమానులు రేట్లు నామకః హెచ్చించి తమపై నున్న 144 వ సెక్షనును రద్దు అగునట్లు చేసుకొన్నారు. యజమానులు అధికము చేసినరేట్లు కార్మిక సంఘమువారికి చాలా అసంతృప్తికరముగా నుండుటవల్ల వారు వాటికి అంగీకరించలేదు. తరువాత ఉభయ పార్టీలు లేబరు కమీషను తీర్పుకు బద్ధులగుదుమని తెలియజేసిన తరువాత లేబరు కమీషనరుకు పరిష్కార కర్తగా ప్రభుత్వం నియమించింది. సమ్మె ఆపు చేయబడింది. కార్మిక నాయకులు, కార్మికులమీద కేసులు తరువాత ఉపసంహరించబడినవి. యజమానులు మూచించిన రేట్లకంటె అధికమగు రేట్లు కొన్ని విషయాలలో లేబరు కమిషనరు తీర్పువల్ల పొందగల్గారు. కార్మికుల సమ్మె జయప్రదముగా నెరవేరింది.

లేబరు కమీషనరు తీర్పు.

కాకినాడలో పీచుకూలీలకు ఇచ్చే కూలి విషయం కలిగిన తగాదాలో విచారణచేసి తీర్పు ఇవ్వవలసిందని లేబరు కమిషనరు గౌరి రామమూర్తిగారిని నియమించివుండిరి. వారు సాక్ష్యములన్నీ విచారించి తమ తీర్పును ప్రకటించారు.

1. మామూలు (జపాను) రకము పీచు ఎండబెట్టడం, విడదీయడం, కట్టడు కట్టడం పనులకు 112 పౌనులకు 10 అణాలు కూలి.

2. మామూలు (జపాను) రకము పీచు నానబెట్టడం, విడదీయడం ఎండబెట్టడం, కట్టడు కట్టడం 112 పౌనులకు 11 అణాలు.

3. మంచిరకం పీచు నానబెట్టి, ఎండబెట్టి విడదీసి కట్టడు కట్టడానికి 112 పౌనులకు 12 అణాలు.

4. ఇంకా మంచిరకము పీచు అదేపనికి 112 పౌనులకు 14 అణాలు.

పీచు సంబంధం తక్కిన పనులు చేసేవారికి మగవారికి 6 అణాలున్నూ ఆడవారికి 4 అణాలు 6 పైసలున్నూ కూలివ్వాలి.

రోజుకు 9 గంటలపని ఉండాలి.

పేమెంటు ఆఫ్ వేజెస్ చట్టంలోవున్న మినహాయింపులు తప్ప మరే ఇతర మినహాయింపులు ఈ కూలిలో చేయకూడదు.

మునగాల ఎస్టేటులో

రైతులు ఎందుకు సత్యాగ్రహం చేస్తున్నారు?

శ్రీ ఉప్పల రామయ్య

మునగాల ఎస్టేటులో మాజమీన్ రైతు సంఘమునకున్ను జమీందారుగారికిన్ని జరిగిన రాజీ ఒడంబడిక లెట్లు భగ్నమైనాయో తెల్పుటకు ముందు ఎట్లు జరిగినవో కూడా తెల్పుట అవసరము. 1938 డిశంబరునాటి పరిస్థితులివి. వేసంగి శిస్తులకై యెస్టేటువారు దౌర్జన్యయుతంగా జప్తులను సాగిస్తూవుంటె రయితులు విసిగివేసారి గత్యంతరములేక జప్తులను నిరోధించారు. అంతటితో జప్తులు ఆగిపోయినవి. అటుపిమ్మట కలకోవ కూలీలకు ఎస్టేటువారు కూలీ ఎగబెట్టారు. అందుకై వారు సత్యాగ్రహం సాగింపగా జిల్లాప్రభుత్వాధికార్లు విచారించి పైవిషయంలో నిర్ణీతమైన కూలీ యిప్పించగా సత్యాగ్రహం విరమించబడింది. అప్పటికే ఎస్టేటులో అన్నికులాలవారున్ను వెట్టి చేయుట మానుకున్నారు. ఎస్టేటువారు జీతము యిచ్చుటకు అంగీకరించనందున పనిపాటలు కూడా మానివేయబడుటచే చాకలి మంగలి వగైరా వారిని నైజామునుండి ఎస్టేటువారు తెప్పించుకోవలని వచ్చింది. జమీందారు యీనాములను స్వాధీనపరచుకున్నట్లు నోటీసులను పంపినా ఒక యీనాందారున్ను భూమినుండి తొలగలేదు. ఒక్క రైతున్నూ సిస్తు చెల్లించలేదు. ఇట్టి పరిస్థితులలో జమీందారుకున్నూ జమీన్ రైతు సంఘానికిన్ని రాజీని కుదిర్చెదమని జిల్లాకలెక్టరు, అయ్యదేవర కాళేశ్వరరావు గారు (పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి) తెల్పారు. జమీన్‌దారి దుర్నయాలను అరికట్టుటకు ప్రభుత్వానికి మరొకపర్యాయము అవకాశమిచ్చుటకే ప్రభుత్వోద్యోగుల బలవంతముపై రాజీచేసుకొనుటకు అంగీకరించాము. పరిష్కరించబడిన శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారి నిర్ణయములను అంగీకరించవలసిన బాధ్యత మాపై వేసుకొన్నాముగాన వారినిర్ణయముల న్యాయాన్యాయములను గూర్చి ఇప్పుడు విమర్శింపబూనుకొనను ఈ రాజీప్రకారము తాత్కాలికముగా కొన్ని స్వల్పవిషయాలతో మాత్రం మాబాధలు తప్పేవేమోకాని ముఖ్యవిషయాలలో మా తగాదాలు నిల్చియే వుండేవి.

రాజీ కాగితముపై సంతకములు జరిగిన జనవరి 12 వతేదీనుండి తుదిసారి బ్రహ్మయ్యగారు నడిగూడెం వచ్చిన ఏప్రిల్ 13 వ తేదీ వరకు మూడునెలలు గడిచాయి. కాని రాజీషరత్తులలో యెన్ని అమలు జరిగేయో చూచిన, రయితుల పక్షాన మా ఒక్కషరతును మేము నెరవేర్చాము. శిస్తులలో బ్రహ్మయ్యగారి నిర్ణయము ప్రకారము చెల్లించగలిగిన శిస్తుల నన్నిటినీ చెల్లించాము కాని ఎస్టేటువారు అమలుజరుపవలసిన 13 షరతులలోను ఏ ఒక్క షరతున్నూ నెరవేర్చబడలేదు. పైగా ప్రతి విషయంలోను పేచీలను పెట్టుచూ వ్యవహారము జరుగనీయకుండా అడ్డంకులను కలిగిస్తూ కాలయాపన చేయసాగారు. రాజీషరతుల ప్రకారం జరగవలసిన వాటిలో సర్వేప్లానులు ఇచ్చేవిషయములో పేచీ; ఈనాములకు పట్టా లిచ్చుటలో పేచీ; పట్టాలలో హద్దు బందులు వేయుటలో పేచీ; వర్మకులకు పరతుల నష్టయి తాలూకు డబ్బు యిచ్చు విషయములో పేచీ; దౌర్జన్యముగా లాక్కున్న భూములు, దొంకలు, వ్రాయించుకొన్న ప్రోనోట్లు వగయిరాలు తిరిగి ఇచ్చుటలో పేచీ. మూజువాణీగా నిర్ణయించుకున్న వేసంగి శిస్తులు, ఖాళీ విస్తర్ణంపై సల్లఘ శిస్తులు, మెట్ట శిస్తు రిమీషను, బందలు కొట్టుకొనుటకు హక్కు, శిస్తులకు రశీదు లిచ్చుట మొదలగు అన్ని విషయాలలోను పేచీలనే పెట్టుచూ వచ్చారు. అన్నిటిని పరిష్కర్త ద్వారా పరిష్కరించుకొనవలెనని, పరిష్కర్త నిర్ణయములకు యిద్దరము బద్ధులమై యుండాలనే మా ఉద్దేశ్యము అందువల్లనే ఈ తగాదా విషయము లన్నిటిని పరిష్కర్తయగు బ్రహ్మయ్యగార్కి తెలుపుచూ వారి నిర్ణయములను కోరుతూ వచ్చాము. అన్నివిషయాలలోను వారుయేదోఒక నిర్ణయాన్ని యిస్తూనే వచ్చారు కాని జమీందారు మాత్రము అనిర్ణయాలను పాటించలేదు. బావుల విస్తీర్ణమునకు మెట్టరేటే తీసుకొనవలెనని నిర్ణయముంటె పల్లపురేట్లే కావాలని. రైతులు సిస్తులు చెల్లించే భూములలోని బందలను యధేచ్ఛగా కొట్టుకొన వచ్చుననే నిర్ణయము వుండగా దరఖాస్తుపైననే బావులకు మాత్రమే కొట్టుకొనవలెననియు అదియు తమ అంగీకారమున్నవారికే ననియు మొదలగు విధములుగా ఎస్టేటువారు పరిష్కర్త నిర్ణయాలనుగూడ త్రోసిపుచ్చ సాగారు. అయినను మేము చాలా ఓరిమి పూనియున్నాము. విషయములు స్వల్పమే అయినను పరిష్కర్తయొక్క నిర్ణయములనుకూడా త్రోసిపుచ్చుటయో లేక వాటికి విపరీత వ్యాఖ్యానము గావించుటయో లేక వాటిని అమలుపరచుటలో కాలయాపన గావించుటయో జరుపుటబట్టి ఈ రాజీప్రకారము అమలు జర్పించుటకు జమీందారు యెంత మాత్రము యిష్టపడుటలేదనీ మాతో దాగుడు మూతలాడుచున్నారని స్పష్టపడుచున్నది.

యివన్ని ఏదోవిధంగా సర్దుకొనవచ్చునని భావించాము. కాని అందులకు మిక్కిలి పెద్దదియు యావన్మంది ప్రజలకు సంబంధించిన విషయమగు రిమిషన్ విషయములో పెద్దతగాదావచ్చినది. అసలు ఈరిమిషన్ విషయము తగాదాతోనె ప్రారంభమయింది ప్రథమములో జిల్లాకలెక్టరు, బ్రహ్మయ్యగార్ల ముందు అంగీకరింపబడ్డ రిమీషన్, మెట్టలో సగము కిస్తీకేనని ఎస్టేటువారు విపరీతార్థము తీయసాగిరి. కాదు పూర్తిసిస్తుకే అంగీకరించారని మేము తెల్పగా వారు కమతం సిస్తులనుగూడ చెల్లించిననే ఈరిమీషన్ యివ్వబడుతుందని కొత్తషరతులను తెల్పసాగిరి. పోనీ ఈకమతం సిస్తుల విషయమైనా విచారణచేయమని కోరితే అందులకంగీకరించలేదు. అసలు ఈవిషయం రాజీ సంప్రదింపులలో లేనేలేదు. అందుపై ఈవిషయాన్ని పరిష్కర్తయైన బ్రహ్మయ్యగార్కి జిలాకలక్టరుకు తెలియజేసాము. వారీవిషయమును విచారించి జిరాయతి సిస్తుల రిమీషనుకున్ను కమతం కిస్తీలకున్ను సంబంధం లేదని తెల్పారు. కమతాల విషయం యెట్లకో ఘుంకావే శ్రీ బ్రహ్మయ్యగారు జిరాయతీ సిస్తులలో రిమీషన్ యివ్వవలసినదని, కుమారాజాగార్కి ప్రత్యుత్తరంకూడా వ్రాసారు. కాని తను పరోక్షమందు ఈనిర్ణయము ఒసగబడినది కాబట్టి తాము దానిని అంగీకరించమని ఎస్టేటు వారు అన్నారు. అసలు ఈవిషయమై విచారణ అవసరమేలేదు. పంటలు పోతే రిమీషన్ కోరబడుతుంది. ఇచ్చినప్పుడుకూడ ఈవిషయమే గుర్తించబడుతుంది. పంటల అంచనా యిందుకొరకే కరణాలవల్ల తయారు చేయబడుతుంది. కాని రిమీషన్‌కున్నూ మరేసిస్తునకున్నూ వంతు కల్పించబడదు. యిది ప్రతిసామాన్య మానవునికిన్ని తెలిసినవిషయమేను ఎస్టేటుతో గూడ ఈరాజీప్రకారం మాగాణి నిస్తులలో కొరతబంజర్లకు రిమీషన్ యివ్వబడుటకు నిర్ణయింపబడి నప్పుడుకూడా వేరే యితర షర్తులేమి విధింపబడలేదు. రిమీషన్ యివ్వబడుటకు కావలసిన కండిషను. సాగుచేయబడిందా లేదా అన్నది ఒక్కటే. ఈవిధంగా యితర షరతులేమీ లేకుండా మాగానితోకూడా కొత్తబంజర్లకు సిస్తురిమీషన్ యిచ్చుచుండగా మెట్టసిస్తుకు మాత్రం పైసనస్థానికి రిమీషన్ యిచ్చుటలో కొత్తషరతులు యేందుకుకోరాలి? అప్పటికైనా ప్రథమంలో రిమీషన్ ఇవ్వబడుటకు అంగీకరింవబడినపుడు కోరబడిన షరతులన్నిటికి ఒప్పుకున్నాము. దానిప్రకారము ఫ 1346 నుండి బకాయీల నన్నిటిని రిమీషన్ మినహా చెల్లించెదమన్నాము. అట్లు ఒకనిర్ణీత కాలములోగా చెల్లించిననే రిమీషన్ యివ్వబడుననే తెల్పినదానికికూడా అంగీకరించాము. ఈవిధంగా రిమీషన్ కొరకై కొన్నిషరతులకు లోబడుటవల్లనే ఎస్టేటువారికి మేము లోకువైనాము. కాబట్టి వారు తిర్గి కొత్తషరతులను విధించసాగారు. జిరాయితీ సిస్తుబకాయీలను చెల్లింతుమని అంగీకరించగానే కమతం సిస్తులను చెల్లించమని మరొక్కమెట్టు పైకెక్కారు దీన్ని అంగీకరిస్తే మరేమికోరేవారో?

రిమీషన్ విషయములో ఈవిధంగా పేచీ వచ్చింది. బ్రహ్మయ్యగారు తాను ప్రథమంలో యిచ్చిన నిర్ణయాన్ని వుపసంహరించుకున్నారు. వారి వాదన యేమిటంటే తాము నిర్ణయాన్ని యిచ్చినప్పుడు ఎస్టేటువార్ని విచారించలేదని. కాని ఎస్టేటువారి వకీలును విచారించిన పిమ్మటనే ఈనిర్ణయమొసంగబడినది. అసలు యింతకుముందు తెలిపినట్లు ఈ విషయంలో విచారణే అవసరంలేదు పంట పోయినందుకు రిమీషన్ యివ్వాలాలేదా? యిందుకు ఈసిస్తుతో సంబంధములేని యేవైనా షరతు లవసరమా? అషరతులకు వీటికి మాటికి కొత్తవి చేరుస్తూ వుండవచ్చునా? పండకపోయినందుకు ఏషరతులతోను నిమిత్తం లేకుండానే మాగాని సిస్తులకు యిచ్చినట్లుగానే మెట్టసిస్తుకుగూడా రిమీషన్ యివ్వవలసినదని, అథవా షరతులను కోరినచో మొదట్లో అంగీకరించబడ్డ షరతులేగాని కొత్తవి ఈ శిస్తుకు సంబంధించనివి తేసూడదని మా వాదన. మా వాదన న్యాయమైనదని మా వుద్దేశ్యము పైగా ఏరాజీ అయినను, న్యాయపూరితమున్ను లాభదాయకమును అయిననే ఎవరయినా అంగీకరించెదరన్నది సర్వసామాన్య విషయము. అదేవిధముగా రాజీ సంగీకరించుటలో మాకు కొద్ది లాభాలు కలుగుననియే కాబట్టి చివరకు రిమీషను విషయములో ఒక పద్ధతి కుదరనప్పుడు పూర్తిగా పోయిన పంటకు కూడా శిస్తులు ఎట్లు చెల్లించగలము? మానవ హృదయము గల యేమనిషి చెల్లించమనగలడు? రిమీషను లేకుండా మేము శిస్తులు చెల్లింపలేముగాన చెల్లించము. పంట పూర్తిగా నష్టమైనా నాల్గవంతే రిమీషను యిస్తామన్నా మేము అంగీకరించాము. కాని ఏవో కొత్త షరతులు విధించుటవల్ల ఆ విషయములో సమాధానం కుదురలేదు. ఇది ఇట్లా వుండగా శిస్తులు చెల్లిస్తేనే గాని యితర వ్యవహారాలు పరిష్కరించమని బ్రహ్మయ్యగారు తెల్పారు. ఇదీ కొత్త విషయమే. రాజీ ప్రకారము జరుగవలసిన వ్యవహారాలు ఎప్పటిలోగా పూర్తికావాలో నిర్ణయింపబడలేదు. ఏవి ముందు జరుగాలో కూడా నిర్ణయము లేదు. కాబట్టి అన్ని వ్యవహారాలు ఒకే కాలంలో వెనువెంటనే జరుపబడాలని తేలుతూ ఉంది. జమీందారు అమలుపర్చుటలేదని రయితులున్ను, రైతులు అమలుపర్చుటలేదని జమీందారున్ను వూరకొనుటకు వీలులేదు. మరీ ముఖ్యముగా ప్రథమంలో శిస్తులు చెల్లింపబడితేనే జమీందారు తన షరతులను నెరవేర్చాలని యెచ్చటను లేనేలేదు. రాజీ జరిగిన పద్ధతులను ఆలోచించి చూడగా జమీందారే తన షరతులను ప్రథమంలో నెరవేర్చవలసిన బాధ్యత గలదని కన్పించుచున్నది. మేమా శిస్తులను చెల్లించుట, జమీందారు దౌర్జన్యంగా వశపరచుకొన్న భూములను, ఇండ్లను దొంకలను వదలుట, పరిశీలరహితంగా ప్రోనోట్లను తిరిగి ఇచ్చుట, ఈనాములకు పట్టాలిచ్చుట మొదలగు పనులను నెరవేర్చాలి. ఈ రాజీయే గనుక కుదరకపోతే మానుండి శిస్తులను రాబట్టుకొనుటకు జమీందారుకు చట్టరీత్యా పూర్తి అవకాశము లున్నాయి. కాని మాకు జమీందారుఇవ్వవలసినవాటిని రాబట్టుకొనుటకై మాకెట్టి అవకాశాలును లేవు. చట్టముల ప్రకారం పోవుటకు అన్నివిషయాలలోను కాలదోషము పట్టినది. పైగా జమీందారు చేయవలసిన వన్నియు లోగడ వారుచేసిన దౌర్జన్యాలను, అక్రమాలను నేను సరిదిద్దుటయే కాబట్టి లోగడజరిగిన అన్యాయములను పిమ్మట ఆలోచించ వచ్చుననియు ముందుగా రైతులు మాత్రము సిస్తులను చెల్లించవలెననుటయు బావ్యము కానేరదని మావుద్దేశ్యము. జమీందారు తన అక్రమములను మానుకొనలేదుగనుకనే మా ఆందోళనలో సిస్తుల నిరాకరణనే ప్రధానాంశముగా తీసుకొన్నాము. అయినప్పటికిన్నీ తమ పలుకుబడి నంతయూ వుపయోగించి జమీందారును రాజీషర్తులకు ఒప్పించెదమని శ్రీ బ్రహ్మయ్యగారు హామీ యిచ్చుటచే మాగానీ సిస్తులను 9000 తొమ్మిది వేలవరకు చెల్లించాము. అంతకు పూర్వమే 20000 యిరవైవేల రూపాయాలవరకు మెట్ట సిస్తులను చెల్లించాము. మొత్తం 30000 ముప్ప

యివేల రూపాయాలవరకు సిస్తులను చెల్లించినను జమీందారుచేత రాజీషర్తులను అమలు జర్పించకుండా మమ్ములను మాత్రం మిగతా సిస్తులను చెల్లించమని కోరుట న్యాయముగాదు అంతేగాదు. ప్రథమంలో రాజీ జరిగినపుడు వేసంగి సిస్తులను తెట్టుఘాటులవల్ల నిర్ణయించుకొనువరకు చెల్లించవలదని అంగీకరింపబడినను నేడు ఆ సిస్తులనుగూడా చెల్లింపవలెనని కోరుట రాజీకి విరుద్ధమనియే నాభావం. వేసంగిసాగు లన్నియు పూర్తిగా బావుల క్రిందనే అవుతుంది. ఒక్క ఎకరమైనను చెరువుక్రింద సాగయ్యేదిలేదు. ఈబావులు పట్టాలలో యస్టేటువారు తనువసి వ్రాయించుకొన్నా పూర్వము రైతులవల్లనే త్రవ్వించబడినవి. యస్టేటు వారివల్ల త్రవ్వించబడినట్లు వారు ఏదాఖలాయు చూపించలేదు. చివరకు రైతులు అయిదుఏండ్ల క్రితము త్రవ్వించుకున్న బావులనుగూడ తామే త్రవ్వించినట్లు యెస్టేటువారు పట్టాలతో వ్రాయించుచున్నారు. ఇట్టి బావుల క్రింద సాగులకు రెండవకారు సిస్తులు య 1కి 5-0-0 చొప్పునవసూలు చేయుచున్నారు. యిచ్చట చట్టప్రకారము ఎట్లున్నా న్యాయము ఆలోచించినచో ఈవిషయం మహాఘోరంగా కన్పించును చట్టప్రకారమైనను ఆ భూములకు రెండుపంటలని రుజువుకావలసి యుండును. కాని యిట్టివేమియు విచారణ గాకుండగానే న్యాయము ధర్మము ఆలోచించి నిర్ణయముల నిచ్చెదమన్న హామీ ప్రకారము లేకుండా యిదివరకు వలెనే వేసంగి సిస్తులను (రెండవకారు సిస్తులను) చెల్లించమనుటయు అదియు ప్రథమములో అంగీకరించ బద్ధదానికి విరుద్ధమగుటవల్లను మేము అంగీకరించలేక పోయాము.

చివరకు రాజీకి ఇట్టి గతి పట్టింది. యెంత సర్దుకపోదామన్నా మాకు వీలు లేకపోయింది. ఇక జమీందారా, యెప్పుడీ రాజీనామా నుండి బయటపడదామన్న ఆతృతలోవున్నాడు. కాబట్టి బ్రహ్మయ్యగారు ఏప్రిల్ 15 వ తేదీన నడిగూడెము నుండి వెళ్ళినారో వెంటనే తిరిగి మామూలు ధోరణిని ప్రారంభించారు. తామే శిస్తులను చెల్లించుట కిచ్చిన గడువగు ఏప్రిలు 30 వ తేదీవరకయినా ఆగలేదు. 17 వ తేదీ నుండి పట్టాల నిస్తామన్న ఈనాములను తాము స్వాధీనపర్చుకున్నట్లుగా రిజిస్టరీ నోటీసులను ఇచ్చుట ప్రారంభించినారు. వ్యవసాయపు పనిముట్లకు తుమ్మలను ఖరీదున కిచ్చుటకు గాని, మూతలకు రాళ్ళు నిచ్చుటకు గాని నిరాకరించసాగారు. ఈనాము సూట్లకు వాయిదాలు వేయిస్తామని మునగాలలో చెప్పుచు బెజవాడకోర్టులో ఎక్సుపార్టీ డిక్రీలకై కోర్టువారి నడుగుచుండిరి. వ్యవహార సందర్భంలో మాట్లాడుటకు వెళ్ళిన పెద్దమనుష్యులకు దర్శనమిచ్చుటకే నిరాకరించిరి. అసలు ఎస్టేటునే వదలిపెట్టి వెళ్ళినారు కూడా. ఈవిధముగా గడువుపోవలనే మాఉద్దేశములను తెలుసుకొనకుండగనే వారు రాజీవిరుద్ధములగు పనులను ప్రారంభించిరి. ఈవిధంగా రాజీకి ఒకపార్టీయగు జమీందారు రాజీకే విరుద్ధముగా నడుస్తూంటే రెండవ పార్టీ చేయవలసినదేమిటి?

ఇక ప్రభుత్వపద్ధతి గూడా ఆశారహితంగానే వున్నది. 1938 జూలై నెలలోకాబోలు ప్రవదమంగా జిల్లా కలెక్టరు మా యస్టేటుకు వచ్చినపుడు మా కష్టాలనుగూర్చి మెమోరాండమును సమర్పించాము. అటుపిమ్మట ఆ మెమోరాండమునకు సబ్‌కలెక్టరు జవాబులనుగూడా ఇచ్చారు. అప్పటినుండి మా కష్టాలను తీర్చెదమను మాటేగాని క్రియాపూర్వకముగా జరిగినది ఒకటిలేదు. ఇద్దరు చాకళ్లవద్ద జమీన్‌వారు జరిమానాలు వసూలుచేసి యిచ్చిన రశీదు విషయములోను, బంగారు సాంబయ్య వారసత్వపు ఆస్తిని వేలం వేయుట కొన్ని విషయములోను, అప్పటినుండి విచారణచేస్తామని కనిపించినపుడు చెల్లప్రస్తావించుటయేగాని అంతకన్న మరేమీ జరుగలేదు ఇక యింతకుముందు వెళ్లిపోయిన పోలీసు సబ్ - సర్కిల్ యినస్పెక్టర్లు తహశీల్దార్ల సంగతి చెప్పనక్కరలేదు. ఇద్దరు సబిన్స్పెక్టర్లు ఒక్క సర్కిల్ ఇనస్పెక్టరు ఒక తహశీల్దారు యిచ్చటనుండి ట్రాన్స్‌ఫరు చేయబడుతూ శిక్షింపబడ్డారనుచు వారి ప్రవర్తన యెట్టిదో తెలుసుకొనవచ్చును. పిమ్మట దొంకల విషయముతోను, తాటిచెట్ల విషయముతోను, విచారణ చేయబడునని ఎప్పటికప్పుడే తెల్పబడుచున్నది. రామాపురం దొంకకు మాపై 144 వ సెక్షనుని నిషేధాజ్ఞలను ప్రయోగించిరి రెండు నెలలైన పిమ్మట ఒక్క నాల్గురోజులలో విచారణచేసి ఆర్డరును వుపసంహరించుకొనమని తెలుపుతూ ఆ నిషేధాజ్ఞను పునరుద్ధరించిరి. కాని నెలరోజుల పిమ్మట విచారణచేసి దొంకవిషయములో రైతులవాదనతో సంతృప్తిబడ్డా, ఇప్పటికి సుమారు 4 నెలలయినా రైతులకు దొంకను చూపించలేదు. ఇక క్రిమినల్ కేసులసంగతి, లోగడ యిప్పటినుండి బదిలీ అయిన పోలీసు అధికారులుపెట్టిన కేసులవి. రాజీ కుదిరినచో ఆ కేసు లుపసంహరించుకొనబడునని ఎప్పటికప్పుడు మాకు జిల్లా కలెక్టరు, డి. యస్. పి. ఆర్. జూపుతూ వచ్చారు. కాని రాజీ కుదిరి 3 నెలలు అయినా ఈ లోపుగా మరి యే నేరము జరుగకపోయినా ఆ కేసులు వుపసంహరించుకో బడలేదు. వారికి సంతృప్తి కలిగించుటకు మేము సాధ్యమగు ప్రయత్నము లన్నిటిని చేసినాము. చివరకు తుమ్మకంప కొట్టుకొని పోవుట, మున్నగువాటిని జరుగనివ్వకుండాకూడ బాధ్యత తీసుకొని యెస్టేటులోని తుమ్మలన్నిటిని జమీందారు తంపున కాపుదారులమను స్థితికి వచ్చినాము. ప్రచారకుల ప్రచారమును ఆపుచేయించినాము. మామూలు రైతుసంఘ ప్రచారమును సహితము తగ్గించాము. ప్రతిఫలము మాత్రము సూన్యము. కేసులను తీసివేయకపోవుటేగాదు కేసుల వాయిదాలన్నిటిని మునగాలలోనే వేయుదుమని వాగ్దాన మిచ్చిన్నీ దానికి భిన్నంగా బెజవాడ, నందిగామ, జగ్గయ్యపేట వగైరా దూర గ్రామాలచుట్టూ త్రిప్పి వేదిస్తున్నారు. పైగా కామిన్ వారంట్లు, అరెష్టువారంట్లు వృద్ధిచేశారు. ఈ విధంగా దాదాపు 30 ఏండ్లు జమీందారు చేసిన ఘోరాల్ని చూస్తూ వూరకున్న ప్రభుత్వం నేడు రైతుల శాంతియుత ఆందోళనను అరికట్టుటకై నిర్బంధ ప్రయత్నాలను కావించినది.

అన్నిటికన్న ముఖ్యమైన ప్రభుత్వలోపము యింకొకటివున్నది. మాకున్నూ జమీందారుకు జరిగిన రాజీ పరిష్కర్తగా బ్రహ్మయ్యగారు నిమిత్తమాత్రమే వచ్చినారుగాని ప్రభుత్వానికి దీనిలో జోక్యము లేకపోలేదు. నిజానికి ప్రభుత్వమువల్లనే ఈ రాజీ జరుపబడింది. రాజీచేయించెదమని పార్లమెంటరీ ప్రధానకార్యదర్శియగు అయ్యదేవర కాళేశ్వరరావుగారు జిల్లాకలక్టరుగారు. తెల్పినారు బ్రహ్మయ్యగారి ప్రసక్తి అనాడు రానేలేదు. అటుపిమ్మట మేము రాజీకొరకై బెజవాడ వెళ్లినప్పుడున్నూ ప్రథమంలో బ్రహ్మయ్యగారి మధ్యవర్తిత్వం ప్రశ్న రాలేదు. జిల్లాకలక్టరుగారే కొన్ని రాజీసూచనలను చేస్తూ కాగితంపై నోటు చేసుకొనుచుండగా జిల్లా రైతుసంఘ ప్రధానకార్యదర్శియగు సుంకర సూర్యనారాయణగారి అభ్యంతరముపై ఆపుజేసినారు. అటుపిమ్మటనే మధ్యవర్తి పరిష్కారం ప్రశ్న వచ్చి చివరకు బ్రహ్మయ్యగార్నే అంగీకరించి ఆసమయములో జిల్లాకలెక్టరు తాను బ్రహ్మయ్యగారి ప్రక్కనేవుండి రాజీని జర్పించెదమని తెల్పినారు. అటులనే బ్రహ్మయ్యగారితో పాటు మునగాలకు రెండుపర్యాయములు వచ్చి అవసరముగు సలహాలనిస్తూ వచ్చారు. బ్రహ్మయ్యగారున్నూ కలక్టరుగారి అంగీకారము లేనిదే ఏనిర్ణయమున్నూ చేసెడివారుకారు. పిమ్మట కూడా రాజీని దృష్టిలోవుంచుకొని ప్రభుత్వమున్నూ కేసులవిషయంలో దీర్ఘవాయిదాలు వేస్తూ వచ్చింది. ఈవిధంగా తమ ప్రోత్సాహముతో, తమసాన్నిధ్యంలో, జరిగి తమచే ఒకవిధంగా గుర్తింపబడిన రాజీలోని షర్తులను జమీందారు వుల్లంఘించుచుండగా ప్రభుత్వము ఏమిచేసింది? రాజీప్రకారం రైతులను శిస్తులు చెల్లించమని బలత్కారముచేసే ప్రభుత్వం జమీందారుచే యితరషరతులను గౌరవించునట్లు యెందుకు బలాత్కారము చేయలేదు? రైతులు ఒకకిస్తీ సిస్తులు చెల్లించిన పిమ్మట మరొక కిస్తీవచ్చువరకు ఈలోగా జమీందారుచే రాజీషరతులను అమలు పరచునట్లు ఎందుకు చేయలేదు? కాబట్టి ఈవిషయంలో ప్రభుత్వ అధికారులు మాకు తీరని అపకారము చేయుటేగాక రాజీని ఒకపక్షంచేతనే గౌరవించుటకుగాను వత్తిడి చేయుచున్నట్లు తెలియుచున్నది. రాజీ అమలుజరుగునని ఆశించాము. సాధ్యమైనన్ని ప్రయత్నాలు చేశాము కాని జమీందారుమాత్రము రాజీకి ఏవిధమైన సుముఖత్వము చూపకుండుటవల్ల రాజీ భగ్నమైనట్లు ఎంచవలసి వచ్చింది.

దిః 30-4-39 న మునగాలలో సమావేశమైన జమీన్ రైతుసంఘ కార్యనిర్వాహక వర్గ తీర్మానములు.

1. దిః 26-4-39 నవశక్తి పత్రికలో ప్రధాన కార్యదర్శియగు శ్రీ అక్కిరాజు మాధవరాజుగారు యిచ్చిన స్టేటుమెంటును అంగీకరించుచు రాజీ షరతులప్రకారం జమీందారుగారు నడుచుకోనందువల్ల రాజీ విఫలమైనదని ఈ కమిటీవారు భావించుచు ఇకముందు తాము స్వతంత్రముగా వ్యవహరించుటకున్ను ఈ విషయమును తత్సంబంధకు లందరికిన్ని తెలియజేయుటకును తీర్మానించుచున్నారు.

2. మునగాల జమీందారుగారితో చేసుకొన్న రాజీ ఒడంబడికలు భగ్నమైనందున రైతులు ఈ క్రిందికోర్కెలను సాధించుటకు శాంతి పద్ధతులపై సత్యాగ్రహమును సాగించుటకు తీర్మానించుచు దేశమందు ప్రజాశ్రేయోభిలాషులందరున్ను మా యీ వుద్యమమునకు తోడ్పడవలయునని ఈ కమిటీవారు ప్రార్థించుచున్నారు.

కోర్కెలు :- (1) అక్రమపు కేసులు రద్దుకావాలి, (2) పంటనష్టమునకు రిమిషనుకావాలి (3) బందలు కొట్టుకొనుటకు హక్కు కావాలి (4) వ్యవసాయ పనిముట్లకై చెట్లు కావాలి (5) పశువులమేతకై బీళ్లుకావాలి (6) దొంకల అక్రమణలు వదలాలి (7) భూముల అక్రమణ వదలాలి (8) ఇంట్లఅక్రమణలు వదలాలి (9) అక్రమపు క్రయాలను వదలాలి (10) దొంగ ప్రోనోట్లను తిరిగి ఇవ్వాలి (11) బంధువుల పేరనున్న జామీనుపత్రాలు రద్దుకావాలి (12) కమతం భూములకు పట్టాలు ఇవ్వాలి (13) కమతం శిస్తులను, జిరాయితీ శిస్తుల మట్టానికి తగ్గించాలి (14) వేసంగిశిస్తులను రద్దుచేయాలి (15) బావులక్రింద నాగులపై పల్లపుశిస్తులను రద్దుచేయాలి (16) రెండు భూములపద్ధతిని రద్దుచేయాలి (17) అన్ని చెర్వులను మరమ్మతు చేయించాలి (18) చెర్వుల ఆయకట్టులను నిర్ధారణచేయాలి (19) ఎస్టేటును గవర్నమెంటు సర్వేచేయాలి (20) సర్వేప్లానులను రైతుల అందుబాటులో ఉంచాలి (21) ఈనాము సూట్లను ఉపసంహరించుకోవాలి (22) ఈనాములకు పట్టాలివ్వాలి (23) బావులన్నీ రైతులవేనని గుర్తించాలి (24) వాగులు బందలక్రింద సాగులకు పల్లపురేటు రద్దుచేయాలి (25) వరగణ వారిచే పని పాటలు చేయించుకోవాలి (26) కోమట్లసప్లయి చీట్లకు డబ్బుయివ్వాలి (27) బావుల విస్తీర్ణానికి మెట్టరేటే తీసుకోవాలి (28) సమ్మెరీసూట్లను ఉపసంహరించుకోవాలి (29) శిస్తుబకాయీ లన్నిటిని రద్దుచేయుట (30) అక్రమవసూళ్ళనుతిరిగియివ్వాలి (31) నిర్బంధపు ఖరారునామాలు రద్దుచేయాలి (32) పట్టాముచ్చిలకాల షర్తులు మార్చాలి, (33) వెంటనే సబ్ డివిజన్లు చేయించాలి (34) రైతు స్వంతఖర్చులతో మరమ్మతులైన చెర్వులక్రింద వాగులకు మెట్టరేటు తీసుకోవాలి (35) సూక్ష్మ కట్టించుటకై వసూలుచేసిన డబ్బును తిరిగి యివ్వాలి (36) సీలితొవైల పన్నును రద్దుచేయాలి (37) ఎస్టేటును కమిటీవారి స్వాధీనము చేయాలి (38) రైతుసంఘాన్ని గుర్తించాలి.

3. సత్యాగ్రహ కమిటీ.

4. రేపాల, నడిగూడెం మునగాల గ్రామాలలో కాంపును ఏర్పాటు చేయుటకు తీర్మానించడమైనది.

5. అవసరమగు సామాన్లు తెచ్చుటను గూర్చి.

జపాను చైనాతో యుద్ధం సాగించడమేగాక అప్పుడప్పుడూ కొన్ని 'పిల్ల పరీక్ష'లు చేస్తూ ఉంటుంది. అలాంటి 'పరీక్ష'లు జపానుకు ఎంతవరకుపయోగపడుతున్నాయో వాళ్ళ అపజయాలే తెల్పుతాయి. కులాంగ్సు దీవులు అంతర్జాతీయ ప్రదేశంలోనివి. జపాను కొన్నికోర్కెలు కోరుతూ మ్యునిసిపల్ కౌన్సిలుకు ఒక విన్నపం పంపింది. దానితోపాటు కొందరు సైనికుల్నీ పంపింది. బ్రిటన్, ఫ్రాంసు, అమెరికాలను సంప్రదించి మ్యునిసిపల్ కౌన్సిల్ వాళ్ళ కోర్కెలనిరాకరించింది. 3 ప్రదేశాలవారుకూడా యుద్ధ నౌకలనుండి తమ సైనికులను ఆ దీవులపైకి పంపారు. దానితో జపాను వెనుకకు తగ్గిపోయింది. ఈ మూడు దేశాలవారు ఒక్కసారి జపాను ఆక్రమణను ఆపడానికి ప్రయత్నించడం ఇదే మొదటసారి.

జపాను : ఇతర సామ్రాజ్యాలు

కాని జపానుఇంతటితోఆగలేదు. కులాంగ్సు దీవులకు తీరానికిమధ్య యున్న రేవునుంచి విదేశ నౌకలనన్నిటినీ అవి సోదాచేయడం ప్రారంభించింది. కామన్సు సభలో బట్లరు(ఇంగ్లండు) "తీవ్రంగా ఆలోచించుతూ" ఉన్నామన్నాడు. బ్రిటిషు, ఫ్రెంచి, అమెరికన్ రాయబారులూ, నౌకాదళాధిపతులు షాంఘై పట్టణంలో కలిసి చర్చించారు. జపాను మరల మరల సైన్యాలు సంఘటితానే వచ్చింది. అందరూ కలిసి చర్చించడంవల్ల ఒకరాజీకి వస్తారని ఒకవార్త. కాని జపాను బెదిరింపు తగ్గలేదు. నౌకలను ఆపడమే గాక, యాంగెట్సీ, పెరిల్ నదులలో విదేశనౌకలు నిలువరాదన్నది. బ్రిటిషునౌకపై కాల్చి, ఒక బ్రిటిషు ఆఫీసర్ని అరెస్టు చేశారని షాంఘైనుండి ఒకవార్త. దానిని బట్టి జపాను దాడి తెలుస్తోంది. ఈ దాడి నరికట్టడానికి, బ్రిటన్, ఫ్రాంసు, అమెరికాలు పూనుకుంటాయా? వెనుకటివలెనే లొంగిపోతాయా?

సోవియట్ : మంచూకో

సోవియట్‌ను మాటిమాటికీ రెచ్చగొట్టాలని జపాను తలుస్తోంది. అందుకనే మంచూరియా (జపానుచే ఆక్రమింపబడ్డ చైనాభాగం) కు పడమట ఔటర్‌మంగోలియాతోను, తూర్పున సోవియట్‌తోను గిల్లికజ్జాలు పెట్టుకో సాగింది. ఔటర్ మంగోలియా సోవియట్ విప్లవానికి పూర్వం చైనాసామ్రాజ్యంలోనిది. విప్లవానంతరం సంపూర్ణ స్వాతంత్ర్యం పొందినది. అక్కడకూడ సోవియట్ ప్రభుత్వమే ఉన్నది. కాబట్టి ఈ రెండుదేశాలు విడిగా ఉన్నా, సోవియట్ యూనియన్‌లో ఒక భాగం క్రిందనే ఊహింపబడుతూ ఉంటుంది సాధారణంగా.

మే 20 వ తేదీనుండి అనేక సంఘర్షణలు జరిగాయి. ఔటర్ మంగోలియాకు, మంచుకోకు. బూయిర్నర్ సరస్సువద్దను; సోవియటు యూనియన్‌కు మంచూకోకు అమర్, యుస్సూరినదుల వద్దనూ ఈ ఘర్షణలు సాగినాయి. ప్రతిదానిలోను జపాను తామేగెల్చినట్లు, సోవియట్ ఔటర్ మంగోలియాల విమానాలు పడగొట్టినట్లు, సైన్యాలను వెనక్కి తరిమినట్లు, చెప్పుకుంటున్నది. జపాను ఈ అసత్య వార్తలను మనం ఇదివరకే ఎరుగుదుం. గతజూలైలో జరిగిన ఘటనలే అందుకు నిదర్శనం. పూర్వం ఛసాన్ సరస్సు తమదంటూ జపాను పెచ్చులాడింది. సోవియట్ రెడ్‌ఆర్మీ తగిన బుద్ధిచెప్పింది. తాము అనుకోకుండానే జపాను సోవియట్ సైనిక శక్తిని ప్రపంచానికి తెల్పి ప్రచారంచేసి పెట్టింది. అలాగే, చంగ్‌కూఫెంగ్‌వద్ద, సాల్ సెన్నాయా పర్వతాలవద్ద మళ్లా పోరాడింది జపాను. జర్మనీ రెచ్చగొట్టడంవల్ల జపాను అలాచేసింది. కాని పాపం సోవియట్ దెబ్బకు తాళలేకపోయింది. నేటి సోవియట్ విదేశమంత్రి ఆరోజుల్లో ఇలా చెప్పాడు.

"కమ్యూనిస్టు వ్యతిరేక ఒడంబడికలో భాగంగల జపాను - జర్మనీలు సామ్రాజ్యపు దోపిడీ విధానాన్ని సోవియటు మీద కూడా సాగిద్దామని చూశారు.... కాని పాపం పొరబడ్డారు...."

వెనుకటి సంఘటనల పాఠం నేర్చుకోపోతే జపాను తీరని దెబ్బ తింటుంది. ఈ మధ్యనే మొలటావ్ ఆంగ్లో-సోవియటు రాయబారాల విషయమై మాట్లాడుతూ జపాన్‌నుగురించి ఇలా అన్నాడు:

"ఈ నాన్సెన్సుకు ఒక హద్దువుంది జపాను రెచ్చగొట్టడం మానివేయాలనిన సమయం వచ్చింది. ఔటర్ మంగోలియా సరిహద్దులను మా సరిహద్దులలాగనే కాపాడుకొంటాం..... జపాను బెదరింపులకు లొంగం. సోవియటు యూనియన్ రక్షిస్తాం; రక్షించుకొంటాం".

చైనా - జపాను

ఉత్తర హూపే రాష్ట్రంలో చైనా గొప్ప విజయం గాంచింది. హూపే రణరంగం నుండి జపాను వెనక్కి మళ్లింది. చైనా-జపాను యుద్ధం ప్రారంభించిన 23 నెలలోనూ ఇట్టి విజయం లేదని చెప్పవచ్చు. క్రిందటి నెలలో 51 వేలమంది జపానువారు చనిపోయారని 'చంగ్‌కింగ్' వార్త. ఈ నెలలోనే చైనావారు



జంగ్-కై-షేక్

486 జపానువారిని ఖైదీలుగా పట్టుకొన్నారు; 173 మెషిన్ గన్‌లను, 1587 రైఫిల్సును, 68000 తుపాకి గుండ్లనూ పట్టుకొన్నారు. 282 'ఆరర్డ్' కారులను (జపాను వారివి) నాశనం చేశారట.

అయితే చైనావారి తీవ్ర నిరోధానికి బ్రిటన్ ఫ్రాంసు, అమెరికాలు సహాయం చేయడంలేదు. ఒక్క సోవియట్ మాత్రం చేస్తున్నది మొన్న మొలటావ్ ఉపన్యాసంలో ఈవిషయాన్ని తెలియజేశాడు కూడ.

చైనా : నానాజాతిసమితి

చైనాలో జపాను ప్రజలపై బాంబులు వేయుచూ చేయుచున్న దారుణకృత్యాలను అరికట్టడానికి జాతిసమితి చర్య తీసుకోవాలని

చైనా జయించడం ఛాంబర్లేన్‌కు ఇష్టం లేదు

సోవియట్ : జపాను సంఘర్షణ — ఆంగ్లో-సోవియట్ రాయబారాలకు అడ్డంకులు

చైనాతరపున డాక్టర్ వెల్లింగ్టన్‌కూ విజ్ఞప్తి గావించాడు. బాంబుల దురంతాల విచారించడానికి ఒక కమిటీని నియమించ మన్నాడు. అతడు కోరిన ముఖ్య విషయాలివి.

(1) ఆర్థికంగాను, వస్తురూపమునను సహాయం చేసి చైనా నిరోధానికి బలంకూర్చడం. జపాను దాడివలన ఆర్తత్రాణులైన వారికి, సహాయం చేయడం.

చైనా నిరోధశక్తిని తగ్గించే పనులు ఏమీ గావించకుండడం.

జపానుకు యుద్ధసామగ్రి, ముడివస్తువులు చైనాపై యుద్ధం సాగించడానికి పనికివచ్చే సామగ్రిని - ముఖ్యంగా విమానాలు, నూనెను సప్లయి చేయకుండటం.

సంధిషరతులను బహిరంగంగా జపాను ఉల్లంఘించడం వలన ఆయాదేశాలు జపాను దిగుమతులను అరికట్టడం.

(2) ప్రాచ్యదేశంలో హక్కులుగల దేశాల వారి జనరల్‌కమిటీగాని - ప్రత్యేక కమిటీగాని ఒకటి ఏర్పరచి, పైపనుల నిర్వర్తించుట.

(3) ఇదివరకు గావించిన తీర్మానాన్ని చైనాకు సహాయమునకు ఇంకా కొనసాగించుట.

ఇవి చాలా మితవాదంగా ఉన్నవి. జాతిసమితి 16 వ సూత్రం ప్రకారం 'ఆంక్షలు' విధించమని తాము కోరడంలేదని వెల్లింగ్టన్‌కూ తెలియజేశారు. న్యూజీలండ్, సోవియట్ యూనియనూ దానిని సమర్థించాయి. కాని బ్రిటన్ ఫ్రాంసులు మొసలి కన్నీళ్లను కురుస్తూ ఈపనులు చేయజాలమని తెల్పాయి. కారణం ఏమిటి?

చైనా జయించడం బ్రిటన్ కిష్టంలేదు

జపాను తన హక్కులకు భంగకరంగా ప్రవర్తిస్తున్నా ఛాంబర్లేన్‌కు చైనాజయించడం ఇష్టంలేదు. కాని వెంటనే జపాను వశం కావడమూ ఇష్టములేదు. ఒకప్రక్క చైనాకు ధనం అప్పు ఇచ్చినా, చైనా, జపానును జయించేటంత సహాయం బ్రిటన్ ఇవ్వడం లేదు. కారణం? చైనా జయించితే చైనాలో గోరిల్లా యుద్ధాలు సాగిస్తూ చైనా విజయాలకు కారణమౌతున్న కమ్యూనిస్టులు బలపడతారు. శాంతినికోరే ప్రజాశక్తులు బలపడతాయి. అవి విప్లవానికి దారి తీస్తాయి. సోషలిష్టు విప్లవంకన్నా ఫేసిజం మంచిదని ఛాంబర్లేను రాజనీతి. ఇంతకన్నా మరొక ముఖ్య విషయం ఉంది. అది జపాను. చైనా యుద్ధం దీర్ఘకాలం సాగించి రెండూ బలహీనపడితే చైనాపైన తాము యిచ్చిన అప్పుల నాధారం చేసుకొని, బ్రిటన్ కొంతగుంజుకోవచ్చు. అలాగే జపానుకుకూడా చివరి సమయంలో తాను మధ్యవర్తియై, చైనాలో కొన్ని హక్కులు సంపాదించుకో వచ్చు. ఇందువల్లనే బ్రిటన్ చైనాకు సహాయంచేయ నిరాకరించింది.

కాని ఈ పన్నాగానికి తక్కినసామ్రాజ్యాలు తమ భాగాలు పోతాయి గాన హృదయపూర్వకముగా సహాయం చేయవు. రెండవది సోవియట్ యూనియన్ దీని కంగీకరించదు. మూడవది చైనా ప్రజలు. జపాను సామ్రాజ్యం యెదలేగాక, ఏ సామ్రాజ్యం పట్లకూడా సామ్రాజ్యవాద వ్యతిరేక భావాన్ని కలిగి ఉన్నారు. ఏదీగతిలేక బ్రిటన్ ఉండి ఉండి చివరి రోజుల్లో జపానుతోకూడా కలిసి ఒకవేళ చైనాపై బడితే ఈ రెండు సామ్రాజ్యాలకు కూడా అపజయంతప్పదు.

ఫేసిస్టుల ప్రయత్నాలు

మొన్నటిదాకా కలవరపెట్టిన డాంజిగ్ సమస్య అలాగే ఉన్నది. లీగ్‌కమిషనర్ డాంజిగ్‌లో జరిగిన అల్లర్లను గురించి పోలండు తరపున బెదరించడానికో, క్షమాపణ చెప్పుకోడానికో బెర్లిన్ వెళ్ళాడు. మొదటి దానికన్న



రెండవ దానికే ఎక్కువ అవకాశం ఉంది. ఎందుకంటే ఈమహానుభావుడు డాంజిగ్‌లో అల్లర్లు జరిగేటప్పుడు 'సెలవు'పైన స్విట్జర్లండ్‌లో కాలక్షేపం చేస్తున్నాడు.

యుగోస్లోవియాలో ప్రజాశక్తులు ఫేసిజానికి




వ్యతిరేకంగా ప్రబలుతున్నా, రాజుగారు మాత్రం హిట్లర్ మైత్రిని అపేక్షించు తున్నాడు. రాకు

మాయని స్వాగతానికి హిట్లరు మంచి ఏర్పాట్లు గావించాడు.


హిట్లర్ బాల్టిక్ సముద్ర తీరముకోని దేశాలతో (లిథునియా) ఒడంబడిక గావించు కొనడమే గాదు. డెన్మార్కుతో ఒకరిపై ఒకరి దాడి వెడలకుండునట్లు (నాన్ ఎగ్రెషన్) డెన్మార్కు తటస్థంగా ఉండేటట్లు ఒడంబడిక గావించుకొంది జర్మనీ.

లిట్వియా ఇస్టోనియాలతోకూడ ఇట్టి ఒడంబడిక గావించుకొంది జర్మనీ.

స్పెయిన్‌నుండి జర్మనీ, ఇటలీ 'వీరులు' తిరిగి వచ్చారు. కాని ఇటలీ విమాన సైనికులింకా అక్కడే ఉన్నారట. ఫ్రాంకో విజయానికి మొట్ట మొదటనుండి ఎన్ని దొంగ వేషాలతో తాము సహాయం చేసిందీ జర్మనీ ఇటలీ పత్రికలు తెల్పినాయి. ఈ ప్రకటనవల్ల, జర్మనీ ఇటలీల దౌర్జన్యాన్ని ప్రతిఘటించని 'తటస్థ విధానం'లోని బ్రిటన్ ఫ్రాంసుల కుట్ర బయట పడుతుంది. సోవియట్ యూనియన్ స్పెయిన్‌లో జోక్యం కలుగజేసుకొనడంవల్ల, జర్మనీ ఇటలీలు కలుగజేసుకొన్నాయనే బ్రిటిషు ప్రధాని బూటకపు మాటలు వెల్లడయినాయి. ఇంతే



గాదు. ఫ్రాంకోకు ధన సహాయం గావించి, తమ వలలో వేసుకొందామని బ్రిటన్ ప్రయత్నించింది. కాని విఫలమయింది. "మేం సహాయము చేస్తేనే గెలిచావు. బ్రిటన్ వలలో పడవద్దు." అని ఫ్రాంకోను హెచ్చరించడానికి



కూడా ఈ పత్రికల ప్రకటన పనికివస్తుంది. ఇలాంటి ఫేసిస్టుల వాక్యాలు ఇంకా ఛాంబర్లేను విశ్వసించుచున్నాడంటే అర్థం, అతని ఫేసిస్టు అనుకూల రాజనీతియే.

సోవియటు యూనియన్‌పై బడాలని జర్మనీకి కోరికే. కాని వెంటనే పైబడటానికి సాహసం లేదు. కాని ప్రయత్నాలు ఎందుకుమానాలి? డాంజిగ్ వశపరచుకొని, పోలిష్‌కారిడర్ కాజేసి పోలండ్, రుమేనియాలను తటస్థపరచి సోవియటు యూనియన్‌పై బడాలనే ప్లాను ప్రస్తుతం ఆగిపోయింది. ఇక రెండవ మార్గం చూస్తున్నాడు. అది బాల్టిక్ రాజ్యాల (లిథూనియా, లాట్వియా, ఇస్టోనియా) గుండా. ఈ రాజ్యాలు జర్మనీకి భయపడిత 'టస్థంగా'ఉంటానికి అంగీకరించుచున్నాయి. సోవియట్ పైబడే సమయానికి బోహీమియా, మొరేవియాలలాగా ఇవి జర్మనీ 'రక్షణ' క్రిందకు రావచ్చు.

ఇంతేగాక ఫిన్‌లండ్ (జర్మనీకి అనుకూల ప్రభుత్వము) ఆలండ్ దీవుల వద్ద కోటలు గట్ట నిశ్చయించింది. ఇది జర్మని ప్రోత్సాహమువల్ల అని చెప్పాలి. దీనికి సోవియట్ యూనియను ఆక్షేపించింది. ఫిన్‌లండ్ దీని వివరాలు తెల్ప నిరాకరించింది. ఆలండ్ దీవులలో కోటలు గట్టడము అంటే అర్థము ఏమిటి? ఆలండ్ దీవులు లెనిన్‌గ్రాడ్‌కు(సోవియట్ యూనియను ముఖ్యపట్టణాలలో ఒకటి) సమీపముగా ఉన్నాయి. రేపు సోవియట్‌యూనియనుపై జర్మనీ యుద్ధము ప్రకటిస్తే వాటిని విమానకేంద్రముగా ఉపయోగించుకొంటుంది ఆలండ్ దీవులనుండి జర్మన్ విమానాలు లెనిన్‌గ్రాడుపై బాంబులు వేస్తాయి. ఈభయంవల్లనే బాల్టిక్ దేశాలకు రక్షణ కావాలని పదేపదే సోవియట్ కోరుతున్నది.

మొలటావ్ హెచ్చరిక

మొలటావ్ ఉపన్యాసం వచ్చేవరకు సంధి ఇదిగో కుదిరింది, అదిగో కుదిరిందని విదేశ పత్రికలన్నీ వ్రాశాయి. ఛాంబర్లేను ప్రకటన కూడా చేశాడు. కాని సోవియట్ జవాబుతో ఆ ఆశలన్నీ అంతరించాయి. ఇదివరకు పత్రికల సూచనలన్నీ వట్టివని తెలిసాయి. కారణం ఛాంబర్లేను ప్రభుత్వం 'సంధి కుదురుతుంది' అని చెబుతూ, దేశీయుల సానుభూతి తనవైపున ఉంచుకోడానికే ఈపని చేశాడు.

మొలటావ్ తన ఉపన్యాసంలో ఈ క్రింది విషయాల్ని స్పష్టంగా తెలియజేశాడు.

"దురాక్రమణ నాపడానికి, శాంతిని కోరే రాజ్యాలతో అందరితోనూ సోవియటు యూనియను కలుస్తుంది. కాని స్టాలిన్ చెప్పినట్లు ఇతరులకోసం "నిప్పులలోని జీడిపప్పును కోతికోసం పిల్లిలాగినట్లు" లాగదు." ఇంతేగాదు. దురాక్రమణకు పూనుకోకపోయినా ఇదివరకు తటస్థ విధానంలోను, లొంగుబాటుతోను ద్రోహం చేస్తున్న పెద్దరాజ్యాలనుగురించి ఇలాచెప్పాడు.

"తటస్థవిధానమూ, దాడిని నిరోధించకుండటమూ ఈదేశాలు వదిలిపెట్టినాయా అన్నది ఇప్పుడు చెప్పలేము."

సోవియట్ యూనియన్ ఎలాంటి సంధిని కోరుతుందో మొలటావ్ ఇలా తెలియజేశాడు.

"1. దురాక్రమణ నిరోధించడానికి తగిన పరస్పర సహాయ సంధి.

2. ఈ సంధి బ్రిటన్, ఫ్రాంసు, సోవియట్ యూనియనుల ఆత్మరక్షణ కోసమే అయి ఉండాలి.

3. మధ్య, తూర్పు యూరప్ దేశాలకూ, సోవియటు సరిహద్దుకోని యూరోపియన్ దేశాలకు (ఎట్టి మినహాయింపు లేకుండా) సైతం, దురాక్రమణనుండి రక్షించడానికి, పై మూడు దేశాలు హామీ ఇవ్వడం.

4. దురాక్రమణ ప్రారంభమయినపుడు పై మూడు దేశాలు ఒకరినొకరు రక్షించుకోడానికీ, హామీ నిచ్చిన చిన్న దేశాల రక్షించడానికీ అవసరమైన వెన్వెంటనే చేయదగ్గ సహాయ విధానాలను గురించి బ్రిటన్, ఫ్రాంసు సోవియట్ యూనియనులు ఒక నిశ్చిత సంధిని గావించుకొనుట."

ఇక ఈ మధ్య ఆంగ్లో-ఫ్రెంచి సూచనలు గురించి మొలటావ్ ఇలా చెప్పాడు.

" ఈ సూచనలు కొంత ముందుకువచ్చినా ఇంకా కొన్ని మినహాయింపులున్నాయి..... మధ్య, ప్రాచ్య యూరప్ దేశాలకు హామీ



కామ్రేడ్ మొలటావ్

నివ్వడంలో అభివృద్ధి ఏమీ లేదు. సోవియటు యూనియన్, బ్రిటను ఫ్రాంసులు హామీ నిచ్చిన 5 దేశాలకు, హామీ నీయవలసి వస్తున్నది. కాని ఈ సూచనలు సోవియట్ పశ్చిమోత్తర సరిహద్దులలో నున్న మూడు దేశాల (బాల్టిక్ దేశాలు) సంగతి మాట్లాడడంలేదు. ఈ దేశాలు నామమాత్రంగా తటస్థంగా ఉన్నా, సమయం వచ్చినపుడు తమ తటస్థత కాపాడుకోలేవు ఈ మూడుదేశాలకురక్షణ ఈయనంతకాలం.తక్కిన అయిదు దేశాలకు సహాయం చేయ లేదు."

ఇంత తేటతెల్లంగా ఉన్నా ఈ ఉపన్యాసములో ఎక్కడా తిరస్కరించడంలేదని బ్రిటిషు పత్రికలు ప్రజా సామాన్యాన్ని మోసగింప ప్రయత్నిస్తున్నాయి. సోవియటుజవాబు లండన్ చేరింది. జవాబుకూడా ఈ ఉపన్యాస ధోరణి లోనే ఉంటుందని వేరే చెప్పనవసరంలేదు.

బాల్టిక్‌దేశాలు వీరి హామీకోరడం లేదు. కోరకముందే తాము రక్షణ చేస్తామని నెత్తిన రుద్దడం ఎందుకని ఛాంబర్లేను పాలసీని సమర్థించే పత్రికలు అడుగుతున్నాయి. నిజానికి ఈనాడు జర్మనీకి భయపడి తటస్థతకు బాల్టిక్ దేశాలు అంగీకరించాయిగాని, ఇపుడు వీరు రక్షణనిస్తే వద్దనవు, పైకి 'మాకు హామీ నివ్వడము మామీదికి దండెత్తి రావడమే' అని అంటున్నా.

సోవియటు యూనియను ఇలా సందేహించడానికి కారణం ఏమిటి? మొన్న మొన్ననే ఛాంబర్లేను, "తమను రక్షించమని అడిగిన చిన్నదేశాలు - తాము దురాక్రమణ నిరోధించ శక్తిగల్గి ఉంటే-మనం సహాయం చేస్తాం"అని చెప్పాడు. 2 ఏండ్లనుండి తీవ్రంగా జపాను నిరోధించుతున్న చైనా సహాయం చేయమని అడిగింది. బ్రిటన్ వీలులేదని నానాజాతిలో చెప్పింది. ఒకటి రెండురోజుల్లోనే మాటలకూ చేతలకూ ఇంతభేదమున్న బ్రిటిషు ప్రభుత్వాన్ని అనుమానించడంలో సందేహమేముంది. అనుమానించడమేకాదు. సామ్రాజ్యరక్షణ మాత్రం చేసికొని, బాల్టిక్ దేశాలగుండా సోవియట్‌పై జర్మనీ దెబ్బగొట్టితే 'తటస్థత' వహించో, లోలోపల సహాయం చేసో, దెబ్బ గొట్టాలనే ఛాంబర్లేన్‌ప్రభుత్వవాంఛ. ఒకప్రక్క ఈ సంధి సంప్రదింపులు సాకుగా తీసుకొని, దేశరక్షణ అనే పేరుతో, కార్మికుల హక్కుల్ని, ప్రజాస్వామ్యహక్కుల్ని త్వరలోనే అంతరింపజేస్తుంది బ్రిటిషు ప్రభుత్వం. కాబట్టి ఛాంబర్లేను ప్రభుత్వం ఉన్నన్నాళ్లు, బాల్టిక్ దేశాలకురక్షణ ఈయనన్నాళ్లు, సంధికుదరదు.

ఛాంబర్లేను ప్రభుత్వం పోడానికి ప్రజాశక్తులలో ఐక్యముండాలి. ఛాంబర్లేను ప్రభుత్వాన్ని నిందించినా, క్రిప్సును వెడలగొట్టడం తప్పని చెప్పి అసమ్మతిచూపినా బ్రిటిషు లేబర్‌పార్టీ తీవ్రకార్యాచరణకు దిగలేదు. జనరల్‌స్ట్రైకుకు వ్యతిరేకించింది. పైగా పాప్యులర్ ఫ్రంటువిధానాన్ని బోధించుచున్న స్టాఫర్డ్ క్రిప్సును వెడలగొట్టుటను సమర్థించింది. ఇలా కార్మిక విధానం ఉన్నన్నాళ్లు ఛాంబర్లేను పోడు. ఛాంబర్లేను పోనన్నాళ్లు సోవియట్‌తో సంధి కుదరదు, కుదరనంతవరకు ఫేసిస్టుదురాక్రమణ నిరోధించవు.

కాశ్మీర్ లో

ముల్కరాజ్ ఆనంద్

['ఎడ్వెంచర్ ఇన్ కాశ్మీర్' అనే గ్రంథానికి ఇది ప్రవేశిక. ఈగ్రంథం త్వరలో ముల్కరాజ ఆనంద్ గారు ప్రకటించనున్నారు.]



"బాగ్ – ఇ – నిషట్ కిగులో....నా...."....కీచు కంఠంతో పాడిన ధ్వని ఒకటి ప్రయాణం చేస్తున్న రాయల్ మెయిల్ బస్ ఇంజను హోరును మించి మాకు వినబడుతోంది. బస్ అప్పుడే శ్రీ నగర్ లో హరిసింగ్ వీధిని ప్రవేశించింది. పాడు మోటారు హోరును సహితం బ్రద్దలు చేసుకునివచ్చి మా చెవిని బడుతూన్న ఆ ధ్వనిలో మాధుర్యంలేదు. కసుపు మంటతో చేసే రోదనలా గోచరించింది.

జనసమర్దమైన ఆ కూడలిలో, కారును రెండో గేరులో నడుపుతూ 'హారన్' తెగ మోగిస్తున్నాడు డ్రైయివరు. మెడను ముందుకుసాచి "ఏమిటా ధ్వని" అని అడిగాను నా ముందు సీటులోవున్న డ్రయివరుని.

"అది. షేక్ మహమ్మద్ అబ్దుల్లా, వారికి చెప్పిన పాట" అని సమాధానం చెప్పాడు. అల్లాగే ముందుకు త్రోవకేసి చూసుకుంటూ. ఈ కూడలిలో కారును నడపడము ఈరోజున తోచినంత కష్టంగా ఇదివరకెప్పుడూ తోచలేదనుకుంటాను.

డ్రైయివరుతోపాటు, నేనుకూడా, మంచు బిందువులతో కప్పబడిన ఆ అద్దాలగుండా ముందు దారికేసి చూశాను. అది అంతా ఇదివరకు చూచిన పాతత్రోవే. అంతా ప్రతిరోజూ ఉదయాన్నే కనబడే మామూలు దృశ్యాలే: తెల్ల తలపాగాలవాళ్లు, తెల్లని పొడుగాటి లాల్చీలు వేసుకున్న ముసల్మాన్ వర్తకులు, కర్రపావు కోళ్ళను తొడుక్కొని మంచి మంచి దుస్తులు ధరించిన పండితులు, చిరిగిపోయిన బట్టలు, అరిగిపోయిన చెప్పులు తొడుకున్న కూలివాళ్లు, పెద్దపెద్ద బానలవంటి బొర్రలున్న పంజాబీలాలాలు, సేట్ లు, సూట్ లు, హాట్ లు వేసుకుని, ఇంగ్లీషు దొరల్లాగ కారుల్లో తుర్రుమని పరుగెత్తుతూండే నల్లదొరలు.........అంతా మామూలువాళ్లే. అయినా ఇవ్వాళ ఆ వీధిలో ఏమిటో మార్పున్నట్లు తోస్తోంది.

రెండు పోలీసు దళాలు లాఠీలు పుచ్చుకుని, ఒకటి దక్షిణంగాను ఇంకోటి ఉత్తరంగాను, బిర్రబిగిసి నడుచుకుంటూ పోతున్నాయి. ఏదో విశేషముండి వుండాలి.

ఆ పోలీసు వాళ్ళని చూసిచేశాడా అన్నట్లు డ్రైవరు కారు 'స్పీడ్'ను తగ్గించాడు. 'హారన్' మోగించాడు. త్రోవపొడుగునాలేని శ్రద్ధను ప్రదర్శించుతున్నట్లు కనబడ్డాడు.

"బాగ్—ఇ—నిషట్ కిగులో నాజ్...."

అపాట మరింత స్పష్టంగా వినబడజొచ్చింది.

ఏమి జరుగుతోంది:

ఒక పక్కసందులోంచి మురుగుకంపు గుప్పున కొట్టింది. శ్రీ నగర్ లో ఈ మురుగు వాసన ఎప్పుడూ ప్రత్యక్షమౌతూనే వుంటుంది. బురద, పేడ, చెత్త చెదారంకలసి రొచ్చు అయిన వాసన. ఆ సందులోంచే ఒక వదిన వావిలేని వూరేగింపు వస్తోంది. దానిలో ఎక్కువగా ఆడవాళ్ళు పిల్లలు వున్నారు. మగవాళ్ళు ఆ గుంపులో అక్కడక్కడ మాత్రం కనుపిస్తున్నారు. వాళ్ళంతా ఏవో మట్టిబొమ్మల్ని చేతుల్లో పట్టుకుని పాటలుపాడుతూ మధ్య మధ్య ఆ మట్టిబొమ్మలమీద ఉమ్ము వేస్తూ వస్తున్నారు.

డ్రైవరు బ్రేకువేసి కారును మెల్లిగా పోనిస్తున్నాడు.

ఆగుంపు సందు మలుపుతిరిగి పెద్దబజారు లాల్ సేపాపు దగ్గరకువచ్చీ రాగానే ఒక పోలీసుదళంవచ్చి వారిమీద పడింది లాఠీలతో వారిని అటు ఇటు గెంటుతూ చెలరేగిన మూడలమందలలాగ ఆగుంపులో ప్రవేశించింది. వీరి రాకనుచూసి పిల్లలుమాత్రం పడుతూ లేస్తూ పారిపోయారు. స్త్రీలు, పురుషులు కదలకుండా అట్లాగే నిలబడి చేతులతో తలలనుమాత్రం కాపాడుకుంటున్నారు. లాఠీదెబ్బలకు తలలు పగలకుండాను కొందరు ఏమిచెయ్యడానికి తోచక అట్లాగే నిశ్చేష్టులై బెదిరిపోయిన జెంతువుల్లాగ నిలువుగుడ్లు వేసుకుని నిలబడిపోయారు. మరికొందరు ఆవేశం పట్టలేక తమ చేతుల్లోవున్న బొమ్మల్ని మరింత ఎక్కువ తిడుతూ. ఉమ్మివేస్తూ శాపనార్థాలు పెడుతున్నారు.

ఒక చిన్నపిల్లవాడు పోలీసువాడొకడిని వెక్కిరించి తప్పించుకు పారిపోయి వస్తూ తొందరలో, మా బస్ క్రింద పడడానికి సిద్ధమయ్యాడు.

"ఏయ్: ఆగు: ఆగు:" అంటూ ఇవంతా చూస్తూ ఖాల్సా హోటల్ వరండాలో నిలబడివున్న ఒక పెద్ద తలపాగా గల కాశ్మీర్ మనిషి, కుర్రవాణ్ని రక్షించడానికి రోడ్డుమీదికి పరుగెత్తుకు వచ్చాడు. ఆ కాశ్మీర్ మనిషి పడ్డవేదన చూస్తే, ఎవరికి ఆపదవచ్చినా తనకు వచ్చినట్లుగానే భావించే స్వభావం గలవాడులా కనిపించాడు.

పోలీసు వెనక్కితిరిగి చూశాడు. కుర్రాడు చేతికి దొరకకుండా పారిపోయాడు. పోలీసువాడికి ఎక్కడలేని కోపం వచ్చింది. పండ్లికిలించాడు. సకిలించాడు. కోపంతో లాఠీని శక్తికొద్దీ విసిరాడు. ఆ లాఠీవచ్చి కుర్రవాణ్ని రక్షించడానికి పరుగెత్తుకు వచ్చిన యీ కాశ్మీర్ మనిషి నెత్తికి తగిలింది. దానితో పాపమా మానవుడు రోదిస్తూ క్రింద పడిపోయాడు.

"ఆ గండి: ఆ గండి:" అంటూ ఆ వూరేగింపులోని వాళ్ల కొందరు గోలచేసుకుంటూ వచ్చి ఈ పడిపోయిన మనిషి చుట్టూ మూగారు. ఈ జనం చుట్టూ పోలీసులు మూగారు. మూగి లాఠీలతో చావగొట్టడం ప్రారంభించారు. తలలు పగిలిన చప్పుడు వినబడలేదు గాని వీపులమీద, కాళ్ళమీద, చేతులమీద తగిలే లాఠీ దెబ్బల చప్పుడు మాత్రం మాకు గుండెలదరగొడుతూ వుంది. పాపం: ఒకని కంటి గ్రుడ్డుమీద తగిలిన లాఠీ దెబ్బకు జివ్వుమని పిచికారి గొట్టం ధారలాగా చిమ్మింది రక్తం........

"బాగ్—ఇ—నిషట్ కిగులో, నాజ్ కరార్...."

ప్రక్కసందులోని గుంపు మళ్ళీ పాటను సాగించింది.

ఒక ఆడవాళ్ళ గుంపును అణచలేక పోయామని కాబోలు పోలీసులలో ఉడుకుబోతుతనం ఎక్కువై పోయింది. వారిలాఠీలు మరింత జోరుగా చెలరేగాయి. చేతికి దొరికిన వాళ్ళనందరినీ కొట్టడం ప్రారంభించారు

నాశరీరంలోని రక్తమంతా గడ్డకట్టుకు పోయింది. స్తబ్ధుడనై పోయాను. నోటమాట రాలేదు. ఈ రాక్షస కృత్యాలకు అర్థమేమిటాయని శూన్యదృక్కులతో యోచనా నిమగ్నుడనై చూస్తున్నాను.

మిసెస్. విలియమ్సు, "రోల్సురాయస్" ఏజెంటు భార్య, కులాసాగా కాశ్మీరు ప్రాంతాలుచూచి పోదామని మాకారులోనే వచ్చింది: ఇదంతాచూసి, "ఇష్: అబ్బ:.. ఎంత దారుణం:: ఎంతఘోరం:::" అంటూ రోజ్జుకొచ్చి ఫ్రంటుసీటులో ఒక మూలగా కూలబడి పోయింది.

మిస్. స్కాన్ ఫెల్డు, ఒక ఆంగ్లో-జర్మను వనిత, అర్ధనిమీలిత నేత్రాలు, చిరునవ్వు చిందువారే మోము, మాకారులోనే ప్రయాణం చేస్తోంది; ఆమెకూడా శిలాప్రతిమలాగ కూర్చుండి పోయింది.

మిస్టర్. స్టాక్, ఒక సంగీత పాటకుడు, గుల్మర్గా క్లబ్బులో తన కియానోవాయిద్య ప్రదర్శనానికి పోతున్నాడు; ఇదంతాచూసి, తనలో తానేమిటో పిచ్చిపిచ్చిగా గొణుక్కోవడం ప్రారంభించాడు.

డ్రైవరు బ్రేకును గట్టిగా లాగిపట్టి, 'గేరు'ను 'న్యూట్రల్ లోకిమార్చి, కారు కిటికీలోంచి చెయ్యిబైటికి సాచి, పోలీసువాళ్ళను ఏదో తిట్టుతో సంబోధించి.

"దుర్మార్గుల్లారా: పాపమా మనిషిమీద ఎందుకిట్లా జులుం చేస్తారు. ఆ కుర్రవాణ్ని కాపాడడానికి వచ్చిన వాణ్ని పట్టుకు చావగొడతారెందుకు? మీకు జ్ఞానం లేదూ?...." అని అరిచాడు.

ఆ గొడవలో ఇతని మాటలు ఎవరు వినిపించుకుంటారు? సణుగులు, గొణుగులు; తిట్లు, శాపనార్థాలు; కేకలు, చప్పట్లు; ఏడుపులు, పెడబొబ్బలు; ముక్కేవాళ్లు, మూలిగేవాళ్లు; ఒక రక మేమిటి? ఆ ప్రభాత వాతావరణమంతా రణ గొణ ధ్వనితో నిండిపోయింది. కాని ఆ వూరేగింపు మాత్రం ఆగలేదు.

"బాగ్—ఇ—నిషట్ కి గులో నాజ్, కరార్ — — — కరా — — — ర్ — — —" పాడుకుంటూ వచ్చి బజారు వీధిని ప్రవేశించింది. ఆడవాళ్ళ చెవులనున్న వెండి రింగులు ఉదయకాలపు సూర్యకిరణాలకు మెరుస్తున్నాయి. జరుగుతూన్న దురన్యాయాలపట్ల ఆ స్త్రీలకున్న కోపంలో అవికూడా భాగం పంచుకున్నాయా అన్నట్లు వంతంతో అవికూడా అటు ఇటూ వూగులాడు తున్నాయి. వాళ్ళ పొడుగాటి బట్టకొంగులు జెండాలలాగ గాలిలో రెప రెప కొట్టుకుంటున్నాయి. చేతులలోనున్న మట్టి బొమ్మ(మిగతా 19 వ పేజీలో

కార్మిక సమస్యలు

రైల్వే కార్మికులు సమ్మెకు తయారవుతున్నారు.

మే 1 వ తేదీన అఖిలభారత రైల్వే కార్మికుల మహాసభ, రైల్వే కార్మికుల అత్యవసర కనీసపు కోర్కెలనుగూర్చి అత్యంత ప్రాముఖ్యమైన నిర్ణయమునకు వచ్చింది. (వివరాలు 10-5-39 నవశక్తి) రైల్వే కార్మికుల ఫెడరేషను ప్రధాన కార్యదర్శి గురుస్వామిగారు రైల్వే కార్మికులందు వారి కష్టాలనుగూర్చి చెలరేగిన అసంతృప్తిని, రైల్వే బోర్డువారి నిర్లక్ష్యభావమును సూచించి, మన కేంద్ర ప్రభుత్వము వీరి కష్టాలను గూర్చి విచారించుటకు సమాధానపరచు కమిటీని నియమించాలని కోరుచూ ఒక తీర్మానమూ, యీలోపు సరియైన సమాధానము లేనియెడల 3 నెలల తరువాత రైల్వే కార్మికుల మహాసభ ప్రత్యేక సమావేశం జరిపి రైల్వేబోర్డువారు కార్మికులపై నిరాఘాటముగా సాగించుచున్న ప్రస్తుత విధానమును ప్రతిఘటించుటకు సాధనోపాయములు నిర్ణయించవలెనని తెచ్చిన మరొక తీర్మానమూ యేకగ్రీవంగా ఆమోదింపబడినవి. సిమ్లాలో మే 19 వ తేదీన రైల్వే కార్మికుల ఫెడరేషను ప్రతినిధులు రైల్వేబోర్డువారితోకలసి మాట్లాడుటకు పూర్వం కార్మిక ప్రతినిధులు సమావేశమైరి. రైల్వే బోర్డు వారిని సమాధానపరచు కమిటీ నియామకమునకు అంగీకరించాలన్సిందిగా, వారి కడసారి నిర్ణయం తెలియచెయ్యాలని నిశ్చయించుకొనిరి.

కామ్రేడ్ గురుస్వామిగారు కార్మిక ప్రతినిధులకు రైల్వే బోర్డుతో సంప్రదింపులకు నాయకత్వం వహించిరి. మహాసభయందు ఆమోదింపబడిన తీర్మానమును రైల్వేబోర్డు చీఫ్ కమిషనరుకు తెలియజేసిరి. రైల్వే కమిషనరు "ఇప్పటికే రైల్వే ఉద్యోగస్థులకు ఎక్కువ ప్యానులిస్తూ ఆదాయానికి భంగము కలుగజేసుకొంటున్నారని, ప్రభుత్వంను నిందిస్తున్నారని, కనుక ఎక్కువ ప్యాసులు సౌకర్యములు చూపుట సంభవముకాదని" తెలియజేశాడు. పారిశ్రామిక సలహా బోర్డుతో తాము సంతృప్తిపడలేదని రాయల్ కమిషన్ సిఫార్సు ననుసరించి సమిష్టి మధ్యవర్తి సంస్థను నియమించాలని కామ్రేడ్ గురుస్వామిగారు తెలియజేశారు. కాని రైల్వే బోర్డు ప్రతినిధి ఇందు అంగీకరించక కారణాంతరముల వల్ల రాయల్ కమిషనువారి సిఫార్సులు ఆచరణ యోగ్యము కావని తెలియజేశారు. బోర్డు ప్రతినిధి ఫెడరేషనువారి కోర్కెలు లేబరు డిపార్టుమెంటుకు తెలియచేయుటకు అంగీకరించాడు. కార్మికుల కోర్కెలు రైల్వేబోర్డు సంప్రదింపులతోనే అంగీకరించు సూచన లగుపడుటలేదు.

కాని, రైల్వేబోర్డు ప్రతినిధి రైల్వే కార్మికుల కోర్కెలను తగు శ్రదతో పరిశీలించి, రైల్వేబోర్డు ఫెడరేషన్ ప్రతినిధుల ప్రత్యేక సమావేశమందు తమ అంతిమ నిర్ణయమును తెలియచేస్తామని చెప్పాడు, తరువాత కార్మికుల ప్రత్యేక సమావేశము జరిగింది.

రైల్వేబోర్డువారికి, రైల్వే కార్మికుల కష్టాలను గూర్చి సమాధాన కమిటీ నియామకమునకు అంగీకరించాలని కోరుచూ, 3 నెలల వ్యవధి యివ్వబడింది. తృప్తికరమగు సమాధానము లేకపోతే రైల్వే కార్మికులు ప్రత్యేక కార్యాచరణకు దిగవలసివుంటుంది. అనుభవజ్ఞులైన నాయకులు, యన్. యం. జోషి, జమ్నాదాసు మెహత, గురుస్వామిగార్ల సలహాతో రైల్వేబోర్డు యీ కనీసపు కోర్కెలను అంగీకరించని యెడల, రైల్వే లైనులన్నిటిమీద సమ్మెచేయుటకు సంకల్పించుకొని, అందుక్కు యిప్పటినుంచి తయారగుచున్నారు. బొంబాయిలో కామ్రేడ్ గురుస్వామిగారు మాట్లాడుచూ, రైల్వేబోర్డువారు తమ నిర్ణయమును వెల్లడించు సమయమున్కు, కార్మిక్కుల అస్త్రములన్ని ధరించి సంసిద్ధులుగ నుండాలని హెచ్చరించాడు. రైల్వే బోర్డుకు అల్ టిమేటం యివ్వబడింది.

ఆసభకు జి. ఐ. పి రైల్వే ప్రతినిధి ఖడ్గికర్ అధ్యక్షత వహించి. విచారణ కమిటీగాని, సమాధాన పరచు కమిటీగాని నియామకానికి అంగీకరించనియెడల రైల్వే కార్మికులు జనరల్ స్ట్రయిక్ కు సిద్ధంగావలసి వుండునని తెలియజేశాడు. గురుస్వామిగారు మాట్లాడుతూ వెంటనే సమాధాన కమిటీ నియామకమునకై తీవ్రముగా కృషిచేయాలని, రైల్వేబోర్డు ఫెడరేషన్ సమావేశమందు రైల్వేబోర్డువారి నిర్ణయము తెలియుననియు, ఫెడరేషను ప్రత్యేక సభయందు తమ కార్య విధానములు నిర్ణయించు కొనవలెనని, తెలియచేశాడు. ప్రతినిధులందరు, తమ సంఘములను తీవ్రముగా బలపరుచుకొని, కార్యాచరణక్కు సంసిద్ధులుగ నుండవలసిన భారమును గ్రహించిరి.

మీరజ్ లో యం. యస్. యం. రైల్వే కార్మిక సాంవత్సరిక మహాసభ జూన్ లో జరుగనున్నది. ఆ మహాసభయందు రైల్వేబోర్డుయొక్క ప్రస్తుతపు నిర్లక్ష్య నిరాదరణ విధానమును యెదుర్కొనుటకు కార్యక్రమమును నిశ్చయించు కొంటారు. యీమహాసభ అత్యంత ప్రాముఖ్యమైనది. గాన, అన్ని బ్రాంచీల నుంచి ప్రతినిధులందరు హాజరయి సరియయిన నిర్ణయములకు వచ్చెదరని యాశించుచున్నాము.

రైల్వే యూనియన్ వారి నిర్ణయములను ఆచరణలో పెట్టుటకు సోషలిస్టులు రైల్వే కార్మికులకు అన్నివిధముల సహకారము చేయ కోరుచున్నాము. రైల్వే చీఫ్ కమీషనరు రైల్వేవారికి, పనివారికి యత్యధికమగు సౌకర్యములు కల్గించి ఆదాయమునకు భంగముగటిల్లజేయుచున్నారని ప్రజలు నిందించుచున్నారని తెలియజేశాడు. కాని రైల్వే కమీషనరు ప్రజలను అడ్డంబెట్టి కార్మికుల కోర్కెలను నెరవేర్చక్కుండుటకై చెప్పిన మాటలు తప్ప చాటియందు నిజములేదు. రైల్వే కమీషనరుకు సమాధానంగా అన్ని ప్రజా సంఘాలచేత యిది అసత్యమని తీర్మానములు చేయించ వలెను.

యం. యస్. యం. రైల్వే పనివారలు

మిరాజ్ లో 13 వ వార్షిక సమావేశము

యం. యస్. యం. రైల్వే పనివారల యూనియన్ 13 వ వార్షిక సమావేశము మిరాజ్ లో జూను 26 వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు జరుగును. కామ్రేడ్ యస్. గురుస్వామిగారు అధ్యక్షతవహింతురు. శ్రీ జమ్నాదాస్ మెహతా యం.యల్.ఏ గారు సమావేశ ప్రారంభోత్సవము జరిపెదరు. అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు యూనియను నిబంధనలను సవరించుటను గూర్చి ఆలోచించుటకు యూనియనుయొక్క ప్రత్యేక సర్వసభ్య సమావేశ మొకటి జరుపబడును.

* * * *

మద్రాసు

కార్మిక రక్షణనిధి

మేయరు కె. వెంకటస్వామినాయుడుగారు యీక్రింది విజ్ఞప్తిని గావించారు.

"చూళై మిల్లులలోని, మద్రాసు పబ్లిషింగ్ హౌస్ లోని నిరుద్యోగ కార్మికుల రక్షణకొరకు వసూళ్ళు చేయుటకై నేనొక కమిటీ నియమించితిని. అట్టి కార్మికులు 3000 ఉన్నారు. వారిపై ఆధారపడినవారు 12000 ఉన్నారు. వారికష్టములు చెప్పనలవికాదు. వారికి యితర విధమగు సహాయము లభించువరకు తినుటకు బియ్యమునైన యిప్పించదలచితిని.

బిడ్డలపాపలతో పస్తుఉన్న ఈ కార్మికుల దుస్థితి గుర్తించి, ఉదారస్వభావులు యధారీతి రక్షణనిధికి సాయపడెదరుగాక"

* * * *

చిట్టివలస

సమ్మె అంతమగుట

చిట్టివలస జూటుమిల్లు పనివారల సమ్మె 100 దినములతర్వాత ముగిసినది. కార్మికసంఘమునకును మిల్లు యజమానులకును ఒడంబడిక ఈక్రింది షరతులతో అంగీకారము గావింపబడినది.

1. ఫిబ్రవరి 14 తేదినాటికి మిల్లులో పనిచేయుచున్న ప్రతికార్మికుని పనిలో చేర్చుట. 2. కార్మికునకు 10 దినముల శెలవులతో జీతమిచ్చుట. 3. ఉద్యోగమునుండి విరమించుటగాని తీసివేయుటగాని జరుపవలసినచో 15 దినముల ముందుగా నోటీసు ఇవ్వవలెను. 4. మిల్లులో ఉద్యోగములు ఖాళీవచ్చినప్పుడు ఇదివరలో పనిచేసిన కార్మికులకే ఇవ్వబడవలెను. ముఖ్యముగ 1938 సం॥ మే నెలలో తీసివేయబడిన కార్మికునకే ప్రాధాన్యము ఇవ్వబడవలెను. 5. కొద్దిషరతులతో కార్మికసంఘమును గుర్తింపబడును. అట్టిషరతులప్రకారం ఇప్పుడున్న కార్మిక సంఘముయొక్క ఎన్నికలు నెల దినములలో జరుగవలెను. పిదప మిల్లువారిచే సంఘము గుర్తింపబడును. పైషరతుల ప్రకారం ఒడంబడిక జరిగినపిదప పనివారు మిల్లునకువెళ్ళి పనిచేసుకొను చున్నారు.

23 తేదిని జరిగిన కార్మిక మహాసభయందు ఈషరతులు తీర్మానింపబడి ఆమోదింపబడెను.

స్నాతకోపన్యాసకుడు సర్ అగ్బరు హైదరీయా?

కామ్రేడ్ యర్రమిల్లి నరసింహారావు

భారత దేశంలో 600 సంస్థానాలున్నాయి. వీటికన్నింటిలో పెద్దది హైదరాబాద్(దక్కన్) సంస్థానం. అంటే యిది సామ్రాజ్యవాదప్రభుత్వరక్షణకు పెట్టని కోట. ఈ కోటబెల్లు ఊడితే బ్రిటిష్ ప్రభుత్వం ఒక గజం క్రుంగదని చెప్పవచ్చును. తిరువాన్కూరు, కొచ్చిన్ సంస్థానాలు విద్యా సౌకర్యాలలో కొంతవరకు బ్రిటిష్ యిండియాతో సరితూగుతాయి. అలాగే మైసూరు పారిశ్రామిక రంగంలో కొంత గణుతికెక్కింది. కాని నిరంకుశత్వానికి మూలకందమగు హైదరాబాద్ సంస్థానం ఫ్యూడల్ సిద్ధాంతములకు ప్రత్యక్ష నిదర్శనం మాత్రమే. అభివృద్ధి ప్రతిరంగంలోనూ కనబడే యీ రోజుల్లో హైదరాబాద్ సంస్థానం మాత్రం వెనుకబడి యుంది.

హైదరాబాద్ ఘనత!

ఈ సంస్థానంలో వార్తాపత్రికలనే మాయపేరుతో ప్రచురింపబడే 7 కాగితాలు ఒక అణాకు అమ్మబడుతున్నాయి. ఇవి దుష్ప్రచారాలకు, ప్రజోద్యమాల నణచివేసేందుకూ ఉపయోగబడుతాయి. ఈ సంస్థానానికంతకీ ఒక యింగ్లీషు దినపత్రిక ఉంది. దీని వ్యాప్తి కొద్ది వందల ప్రతులే. పోనీ యితర ప్రాంతాల్లో ప్రచురింపబడే పత్రికలకు పెద్దవాటికీ ప్రవేశానుమతి చూసేందుకు అజ్ఞలేదు తను స్థాపించిన రెండు కాలేజీలను తలచుకొని యీ సంస్థానం గర్వించవచ్చు! వీటికితోడు కొద్ది యింటర్ మీడియేట్ వరకూ కాలేజీలున్నాయి. వీటిలో ఒకటి హైదరాబాద్ పట్టణంలోనూ మిగతావి జిల్లా ప్రాంతాల్లోనూ ఉన్నాయి. రెండు కాలేజీలలో ఒకటి మద్రాసు విశ్వవిద్యాలయము నందును, మరొకటి ఉస్మానియా విశ్వవిద్యాలయమునందును చేర్పబడి యున్నవి ఉస్మానియా విశ్వవిద్యాలయం బ్రిటిష్ ప్రాంతాల్లో చాలా పేరు మ్రోగింది! పెద్ద విశ్వవిద్యాలయాధికారులు దీనికి జయగీతాలు పాడారు! కారణం హిందూదేశానికంతకీ ప్రధాన భాషయగు 'హిందూస్థానీ' లోనే యిచ్చట చదువు చెప్పబడుతుంది గనుక. నిజంగా అది 'హిందూస్థానీ భాష'యేనా యని ప్రశ్న. ఈ హిందూస్థానీ భాషలో 10 మాటలకి 9 మాటలు పూర్తిగా లేక కొంతవరకు అరబిక్ పర్షియన్ భాషకు చెందినవై వుంటాయి. ఈ భాషని దేశభాష అనే పేరుతో-సంస్థాన జనాభాలో 100 కి 85 మీద రుద్దుతోంది ప్రభుత్వం. తమ కుమారుల విద్యకొరకు 100 రూపాయలకు 85 సుంకుపుచెల్లించే తల్లిదండ్రులు లిపిభాషమూలంగా విద్యను బోధించడం సహించలేకపోయారు. దీని నెదుర్కొంటే 'హిందూ మహమ్మదీయ కలహం' ఆపాదించారు.

దుస్తుల నిబంధనలు

విశ్వవిద్యాలయంలోని 500 లకు పైగా మించిన విద్యార్థులు వారికియిష్టములేని దుస్తులు ధరించాలని నిబంధన. జాతీయ దుస్తులైన ధోతీ లాల్చీలు పనికిరాదని. భోజనసమయాల్లో కూడా పొడుగుపాటి, నల్లటి వింతగా కుట్టబడిన దుస్తులు ధరించాలని శాసిస్తుంది. ఒక రోజుకూడా యిటువంటి నిబంధన సహించగలమా? కాని సంవత్సరాల్ల తరబడి తప్పని సరిగా అనుసరింపబడినది. కొద్దిమందికో సంఘీయూలజీ' అనేపేరుతో ధనం దుర్వినియోగం చేయబడుతూంది. ఈ అన్యాయం సంవత్సరాల తరబడిసాగింది.

కాలేజీ విద్యార్థి సంఘం.

ఇక కాలేజీ విద్యార్థి సంఘం ఒక తంతు. దీని ఎన్నిక సభ్యుల సంఖ్య 10. వీరిలో 9 మంది హిందువులు కానివారు. మిగిలిన ఆ ఒక్క హిందూసభ్యుడు అధికార రహితుడై నామమాత్రుడుగా ఉంటాడు. పోనీ ఆ మహమ్మదీయ విద్యార్థులకైనా అధికారం శూన్యము. స్కాలర్‌షిప్పుల విభజనలో జరిగే అన్యాయం చెప్పనవసరం లేదు. విద్యార్థుల తెలివితేటలు పాటింపక కుల మత విభేదాలను పురస్కరించుకొని స్కాలర్‌షిప్పులు యివ్వబడడం గమనింపదగిన విషయం. ఈ అన్యాయాలు అక్రమాలు సంవత్సరాల తరబడి హైదరాబాద్ సంస్థానంలో సాగాయి.

వందేమాతరం తగాదా

ఈ వందేమాతర గీతం తగాదా హైదరాబాద్ విద్యార్థుల్లో అణగియున్న శక్తుల్ని రేకెత్తించింది. ఈగీతం హిందూ విద్యార్థులు వారి ప్రార్థనామందిరంలో 4 సంIIరాల నుంచి పాడుతున్నారు. హఠాత్తుగా ప్రభుత్వం త్రుళ్లిపడింది. గీతంవాదన గీతమనీ, కలహ ప్రేరేపణీయమైనదనీ అన్నారు. గీతాన్ని పాడరాదని నిషేధించింది ప్రభుత్వం. దీని నుల్లంఘించిన విద్యార్థులు పెద్దమంది ఉస్మానియా విశ్వవిద్యాలయాన్నుంచి తరిమివేయ బడ్డారు.

మొనగాడు సర్ హైదరీ అక్బరీ

ఇట్టి అన్యాయాలకీ, అక్రమాలకీ దోహదమిస్తున్న హైదరాబాద్ నైజాం ప్రభుత్వ కార్యనిర్వాహకవర్గ అధ్యక్షులు రైట్ ఆనరబుల్ సర్ అగ్బరీ హైదరీగారు. వీరి రాజనీతి భారతదేశమంతా ఎరుగును. రాజనీతి సంగతి పరిగణింపక పోయినా వీరి విద్యాపోషణ మరీ పేరెక్కింది. వీరు రాజకోట దర్బార్ వీరవల్లాను. తిరువన్కూరు సర్‌గారిని తలతన్నిన రాజీ పద్ధతులకు వ్యతిరేకులగు, సామ్రాజ్యవాద ప్రభుత్వ రక్షకులు. వీరి అజ్ఞపలననే 400 మంది విద్యార్థులకు పైగా ఆగ్రా విశ్వవిద్యాలయాల్లో స్వస్థానాన్ని వదిలి తలదాచుకొన్నారు!

సర్ అగ్బరీయా స్నాతకోపన్యాసకుడు?

1939 అక్టోబరు 7 వ తేదీని వాల్తేరులో జరుగనున్న ఆంధ్ర విశ్వవిద్యాలయ పట్టణ ప్రధాన మహోత్సవంలో స్నాతకోపన్యాసాన్ని అగ్బరు హైదరీగారు యిస్తారు. అలా చేయవలసినదని మదరాసు గవర్నరుగారు వీరిని ఆంధ్ర విశ్వవిద్యాలయం తరపున కోరారు. (విశ్వవిద్యాలయ చట్టప్రకారం గవర్నర్లే విశ్వవిద్యాలయ ఛాన్సలర్లు!) ఆంధ్ర విశ్వవిద్యాలయం, వందేమాతరం గీతంపై హైదరాబాద్ సంస్థానంలో చెలరేగిన పోరాట సమయంలో వీరు ప్రదర్శించిన శక్తియుక్తులను మెచ్చుకొంది కాబోలు. లేక వీరి ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని "హిందూస్థానీ" భాష ఆంధ్ర విశ్వవిద్యాలయాధికారుల్ని వీరిని గౌరవింప ప్రోత్సహించింది కాబోలు! లేదా మరి వీరి సంస్థానంలో ప్రచురింపబడే పత్రికలకు, పుస్తకములకు పారితోషికంగా వీరికి పట్టం కట్టబోతుంది కాబోలు! వందలకొలది విద్యార్థుల్ని తన సంస్థానం నుండి తరిమివేసిన సర్ హైదర్ అక్బరీ మంత్రిసత్తముడు మన ఆంధ్ర విశ్వవిద్యాలయ స్నాతకోపన్యాసాన్ని యివ్వనున్నాడు. బ్రిటిష్ సామ్రాజ్యవాదం కూడా అంగీకరించిన పుస్తకాలను, పత్రికలను తన సంస్థానపు పొలిమేరనైనా చేరనీయని విద్యాపోషకుడైన సర్ హైదర్ అక్బరీ మన పట్టభద్రులకు హితబోధ చేస్తాడు! ఆంధ్ర విశ్వవిద్యాలయ పీఠంపైనుంచి రేపు రైట్ ఆనరబుల్ హైదర్‌గారు తమ స్నాతకోపన్యాసాన్ని చదువుతారు. బాగు! ఆంధ్ర ప్రజామండలి సెనేట్, సిండికేట్లు (ముఖ్యంగా కాంగ్రెసు) సభ్యులు దీని కంగీకరించినట్లేనా? సర్ హైదర్ అక్బరీగారు వారి స్వ సంస్థానంలో చేస్తున్న విద్యాపోషక సూత్రాలకు విజయగీతాలు పాడినట్లేనా? వందేమాతరం విషయములో మరువరాని వీరి ప్రభుత్వం తీసుకొనిన చర్యలను మన ఆంధ్రదేశమంతా అంగీకరించి నట్లేనా?

ఆందోళన లేవతీయాలి!

ప్రజాందోళన లేవతీసి వారి రాకను ప్రతిఘటించడం, సంస్థాన ప్రజోద్యమాలకి గొప్ప బలాన్ని చేకూరుస్తుంది. అందుచే ప్రతీ సామ్రాజ్యవాద వ్యతిరేక సంస్థ మీటింగులను జరిపి వీరి రాకయెడల తమవిముఖతను తెలియచెయ్యాలి. నిర్ణీత కార్యక్రమాన్ని యీ ఆందోళన సాగించేందుకు, సామ్రాజ్యవాద వ్యతిరేక సంఘములైన కాంగ్రెసు, కాంగ్రెసు సోషలిస్టుపార్టీ, రైతు, యువజన, విద్యార్థి, కూలి సంఘాలు ప్రజానీకానికివ్వాలి. ఆంధ్ర ప్రజలు దీని ననుసరించాలి.

సర్ హైదర్ అగ్బరీ రాకను ప్రతిఘటించాలి.

వయోజనవిద్య - ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి సంఘం

మనమద్రాసు రాష్ట్రంలో నూటికి 7-కే మంది మాత్రమే చదువను వ్రాయను నేర్వగలిగియున్నారు. విద్యావిహీనతతోపాటు, ఆర్థిక విషయాలలో, ఆరోగ్య సూత్రాలలో, వైజ్ఞానిక రహస్యాలలో అజ్ఞానం వ్యాపించి ప్రజాసామాన్యం యెంతో వెనకబడివుంది. కాంగ్రెస్ మంత్రివర్గం స్వీకరించి రెండేళ్ళు అయినప్పటికి ప్రజలలో విద్యావ్యాప్తికి యెట్టి ప్రయత్నాలు చెయ్యకపోవడం చాలపొరపాటు యు. పి. బిహార్, బొంబాయి మొదలగు రాష్ట్రాలలో ప్రభుత్వం యీవిషయంలో యెంతో శ్రద్ధ తీసుకుని ప్రత్యేకం కమిటీలు యేర్పాటుచేసి నిరక్షరత్వాన్ని నిర్మూలిస్తున్నాయి. కాని మనరాష్ట్రంలో శ్రీయుతలు శనివారపు సుబ్బారావుగార్ల వంటి సంఘసేవకులు కొద్దిమంది ఉదారస్వభావంతో ముందుకువచ్చి కొద్దిసంవత్సరాల నుండి వయోజన విద్యాప్రచారం చేస్తూవచ్చారు. నూటికి తొంభై పైగా నిరక్షర కుక్షులైనప్పుడు యేకొద్ది స్వయం సేవకులకో యీపని వదలితే యిసుకతో వారధికట్టినట్టే అవుతుంది. యిన్ని లక్షల ప్రజాసామాన్యానికి విద్యచెప్పించే యేర్పాటులు ప్రభుత్వమే చెయ్యాలి. అట్లుగాక మద్రాసు ప్రభుత్వం యీవిషయంలో చీమకుట్టనట్లుగా వుండడం చాల శోచనీయం.

వేసంగి సెలవలలో గ్రామాలకు పోయి వయోజనులకు విద్యగరపుటకు అనువైన మార్గాలు అన్వేషించుటకు ఆంధ్రరాష్ట్ర విద్యార్థి సంఘం వక ఉపసంఘాన్ని గత ఫిబ్రవరి మాసంలో నియమించింది నాలుగు వారంలో యెంత నిరక్షర కుక్షిఅయినా చదువను, వ్రాయను నేర్చుకోడానికి వీలగునట్లుగా తేలికమార్గం కనిపెట్టబడింది. అక్షరాభ్యాసంతోపాటు చరిత్ర భూగోళం, ఆర్థిక విధానం, ఆరోగ్య సూత్రాలు నేర్పడానికి వక సిలబస్‌కూడ అస్కీములో చేర్పబడింది. ఈస్కీమును ఆధారంగా పెట్టుకుని విశాఖపట్టణంజిల్లా భోగాపురంలో ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి సంఘం తరపున కామ్రేడ్స్ పి. వి. రమణయ్య, డి. ఏ. నారాయణరావు గార్లు సుమారు నెల రోజులనుండి అద్భుతమైన సేవచేయుచున్నారు.

భోగాపురం పెద్ద గ్రామమైనా చెరువు వక్కటే స్నానపానాదులకు అన్నింటికి అదే ఆధారం. ప్రజలకు ఆరోగ్య సూత్రాలు తెలియక పోవడంవల్ల అన్నిరకాలకల్మషం అందులో చేయుతుంది. పైసోదరులిద్దరు గ్రామంలో కాలు పెట్టగానే కొందరు గ్రామస్థుల సాయంతో చెరువు నీటిని యెవరును మలినం చెయ్యకుండా కాపలాద్వారా అరికట్టి, గ్రామస్థుల కందరికి మంచినీరు యేవిధంగా మలినం పొందితే యేయే జబ్బులు వస్తాయో బోధించారు. ఆగ్రామానికే చేరియున్న హరిజన గూడెంలోని మంచినీళ్ళబావిని శుభ్రం చేశారు. వుపన్యాసాలద్వారా ప్రపంచ పరిస్థితులు చరిత్ర, భూగోళం, సంఘ నిర్మాణం, వ్యవసాయ శాస్త్రం మున్నగు వివిధ విషయాల్ని గురించి చెప్పరు. రైతులందరి కోరిక మీద అగ్రికల్చరల్ డిమాన్‌స్ట్రేటర్‌గారిచే కొన్ని వుపన్యాసాలు కూడ యిప్పించారు. నూతన పద్ధతులతో చదవడం, వ్రాయడం యెంతోమంది నేర్చుకుంటున్నారు. గ్రామఫోను రికార్డులద్వారా దేశభక్తి మద్యపాన నిషేధం మున్నగునవి బోధించబడుతున్నాయి.

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి సంఘం గర్వంతో చెప్పుకోతగ్గ యీఘనకార్యాన్ని నిర్వహిస్తున్న సోదరులు రమణయ్య, నారాయణరావుగార్లను అభినందిచు చున్నాము.

జి. రామకోటేశ్వరరావు
ప్రధాన కార్యదర్శి
ఆంధ్రరాష్ట్ర విద్యార్థి సంఘం.

శ్రీ విజయకుమార సిన్హాగారి సందేశం.

రెండవ లాహోరు కుట్రకేసు గత రాజకీయ ఖైదీయగు విజయకుమార్ సిన్హాగారు ఇచ్ఛాపురం వేసంగి పాఠశాల విద్యార్థులకి క్రింది సందేశమును కరాచీ నుండి పంపియున్నారు.

సామ్రాజ్య వ్యతిరేక సంస్థయగు కాంగ్రెసు నేడు విషమావస్థలో చిక్కుకొని యున్నది. కాని మనమార్గమున కలుగు అడ్డంకులకు మన మెన్నడు అధైర్యము చెందరాదు. ఈ విషమావస్థ నుండి దాటించు మహత్తర బాధ్యత నేటిరోజున అతివాద శక్తులపై యున్నది. ముందుకు రాదలచినచో దేశములో నున్న అతివాద పక్షీయులు వారి దైనందిన కార్యక్రమములో శాస్త్రీయ విచక్షణ అవసరం. స్వల్ప శిక్షణగల సోదరులు, వారెంత మనశ్శుద్ధి కలవారై నప్పటికి మన ఉద్యమమునకు ఉపయోగపడరు. వారు వామపక్షేతర స్వభావ మార్గమున తప్పక ప్రవర్తించి జాతిభేదముల పురిగొల్పు సంకుచిత దృక్పథమును ప్రదర్శించెదరు. అందుచేత ప్రజాసామాన్యములో పనిచేయు ప్రచారకులకు రాజకీయ పాఠశాలలు స్థాపించుట ప్రస్తుతపరిస్థితులలో అత్యవసరము. అందువలన మనవారు అల్ప శిక్షితులుకాకుండా జాతీయ-అంతర్జాతీయ రణరంగములయందు చేకూరిన అనుభవములచే నేర్పడిన విప్లవ నాయకత్వ తంత్రములను నేర్చుకొందురు.

మీ పాఠశాల విద్యార్థులకు నా విప్లవాశీస్సులు, ఆంధ్రదేశములో నా తోడి రాజకీయ ఖైదీలుగ నుండిన యెవరి దర్శనభాగ్యము నాకు కలిగెనో ఆట్టివారిమధ్య నుండనోచుకొననందుకు నా అతివాద సంతాపమును మీ విద్యార్థులకు తెలియజేయుడు. మీ పాఠానుక్రమణికలో వామ పక్షీయుల ఐకమత్యమును ఒనగూర్చి జాతీయ ప్రాగ్భాగమును దిట్టపరచు మన ఉద్యమముయొక్క యెత్తుగడలకు ప్రాముఖ్యత యిత్తురని తలంచెదను. అతివాదశక్తులు వర్గసంస్థల స్థాపనలయందు వలసినంత విజయమును పొందినవిగాని దేశీయ మహాజనసభయొక్క అభివృద్ధితో బాటు జయము గాంచలేక పోయినవి. ఒక సంరంభమ్మయొక్క ఇట్టి ముఖ్యమైన ఆచరణీయసమస్యలను మీరు తప్పకుండా చర్చించెదరని నమ్ముచున్నాను. మీకు జయము కలుగుగాక.

విజయకుమార్ సిన్హా.

* * *

విద్యావనం.
అందలి విద్యావిధానము.

విద్యావనము ప్రారంభించుటకు ముఖ్యకారణములు బాలబాలికలలో జాతీయభావములను పెంపొందింపజేయుట. (2) చేతిపనులు వగైరా నేర్పుట. (3) మానసిక శిక్షణతోబాటు శారీరక శిక్షణకు ప్రాముఖ్యము నిచ్చుట. (4) బిడ్డలకు మనస్తత్వములను బట్టి వారిలో దాగియున్న కళానైపుణ్యమును, శక్తి, సామర్థ్యములను కనిపెట్టి ఎవరికి తగిన విద్య వారికి నేర్పుట. (5) ఉద్యోగ కాంక్షచే, క్రమ పరీక్షలలో ఉత్తీర్ణులు కాగోరువారిని అట్టి పరీక్షలకు, అనగా మెట్రిక్యులేషను, మొదలైన పరీక్షలకు తయారుచేయుట. (6) వ్యక్తిగతముగా ఏ ఒక్క కళ, అనగా చిత్రకళ, సంగీతము, వ్యాయామవిద్య మొదలగువాటియందు ఉత్తీర్ణులను చేసి, తగిన ధృవపత్రముల నిచ్చుట. (7) వాటికి తోడుగా పిల్లలను గురుకుల వాసముల కలవాటుపరచి దురభ్యాసములకు దూరముచేసి సర్వకాల సర్వావస్థలయందును, పిల్లలపై నిఘాఉంచి, మాతృవాత్సల్యముతో పెంచి ప్రపంచ విజ్ఞాన పరిస్థితుల నవగాహనచేసుకో గలవారినిగా తయారుచేయుట.

ఇట్టి మహత్కార్యమును తలపెట్టి గత అక్టోబరు మాసములో ఈ పాఠశాల ప్రారంభించినపుడు మంతెనవారిపాలెం వాస్తవ్యులును, మరికొందరు స్నేహితులును మాకు చేయూతనొసగి తోడ్పడియున్నారు; ఇప్పటికిని తోడ్పడుచున్నారు. ఉపాధ్యాయులుగాగూడ కొద్ది వేతనములతో తృప్తిపడి స్వార్థత్యాగముతో పని చేయుచున్నారు. మా విద్యావిధానమునుగురించి విపులముగా తెలుసుకొన గోరువారును, క్రొత్తగా బాలబాలికలను చేర్పించగోరువారును వెంటనే అన్నాప్రగడ సరళాదేవి, విద్యావనం, మంతెనవారిపాలెం పోస్టు, (వైయా)పొన్నూరు గుంటూరు జిల్లా అని వ్రాసి, విషయసూచికలను, దరఖాస్తుఫారములను తెప్పించుకొన గోరెదను.

అ॥ కామేశ్వరరావు,

* * *

ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి సంఘం

జూన్ నెల ప్రవేశించింది. పాఠశాలలు త్వరలో తెరవబడతాయి. విద్యార్థి వుద్యమం విజృంభించాలంటే నూతన సంవత్సరానికి సరియైన కార్యక్రమం నిర్ణయించుకోవాలి నిర్మాణ సమస్యలు, జనరల్ సమ్మె, వలంటీరు దళాలు మున్నగు ముఖ్య సమస్యలన్నియు సాకల్యముగా చర్చించాలి. కనుక కార్యనిర్వాహక వర్గం జూన్ నెల పదవతేదీ బుధవారంనాడు ఉదయం తొమ్మిది గంటలకు బెజవాడ కమ్మహాస్టలులో సమావేశమవుతుంది. సభ్యులెల్లరును తప్పక హాజరు కావలెనని కోరుచున్నాను.

ప్రధాన సమస్యలు చర్చించబడతాయి గాన జిల్లా విద్యార్థిసంఘాల ప్రధాన కార్యదర్శులను కూడ చర్చలలో పాల్గొనుటకు ఆహ్వానించుచున్నాను.

చర్చ విషయాలు.

1. నిర్మాణ సమస్యలు
2. జనరల్ సమ్మె
3. వయోజన విద్య
4. వలంటీరు దళాలు
5. రాజకీయ బాధితులు
6 స్టూడెంట్ కాల్
7. కాకినాడ సమావేశము
8. యితర విషయాలు

జి. రామకోటేశ్వరరావు,
ప్రధాన కార్యదర్శి,
ఆంధ్రరాష్ట్ర విద్యార్థిసంఘం.

* * *

ప॥ గోదావరి జిల్లా కాంగ్రెసు సంఘము
తణుకు.

కార్యనిర్వాహకవర్గ సమావేశపు నోటీసు.

11-6-39 వ తేదీని ఆదివారం ఉదయం 9 గంటలకు భీమవరంలో పాత తాలూకాబోర్డు ఆఫీసు భవనమునందు ప॥ గోదావరిజిల్లా కాం॥ కార్యనిర్వాహక సభజరుగును. కావున సభ్యులందరు తప్పక దయచేయ ప్రార్థితులు.

గమనించండి

చర్చనీయాంశములు:

1. 16-5-39 మొదలు 10-6-39 వరకు జరిగిన కార్యక్రమ నివేదిక.
2. 16-5-39 మొదలు 10-6-39 వరకు గల జమా ఖర్చుల నివేదిక.
3. ఇరిగేషన్ ఎంక్వయిరీకమిటీ నియామకము.
4 వ్యవసాయకూలీల ఆర్థిక విచారణ కమిటీ నియామకము.
5. స్థానికసంస్థల ఎన్నికలనుగురించి మన సంఘ ధనమును ఖర్చుపెట్టుటనుగురించి.
6 పాలకవర్గపుప్రమాణపుఖర్చులనిర్ణయం
7. కాశీపట్టణ వ్యవహారములు.
8. కాంగ్రెసు మెంబర్లను చేర్పించే యేర్పాటులను గురించి.
9 గతసంవత్సరపు తణుకుతాలూకా కాంగ్రెసు కార్యదర్శిగారిపైన చర్యగైకొనుటగూర్చి.
10. భీమవరం పంచాయితీ యూనియన్ విషయమై వచ్చిన రిపోర్టును గూర్చి.
11. లంకగొంది పిటీషనులగురించి.
12. ఫెడరేషను, యుద్ధ బహిష్కరణ, వలంటీరుదళముల ఆవశ్యకతనుగురించి కరపత్రములను ప్రకటించుట.
13. 18-4-39 తేదీని తాడేపల్లిగూడెంలో చేయబడిన తీర్మానముననుసరించి పంపబడిన ప్రశ్నావళులకు సమాధానము లివ్వని జిల్లా బోర్డు మెంబర్లు, శాసనసభ్యులు, ఋణముల రాజీబోర్డు సభ్యులగురించి.
14. నెలసరి జమాఖర్చులు పంపని అధీన సంఘములగురించి
15 అత్తిలి టవును కాంగ్రెసు కార్యవర్గ సభ్యులపై వచ్చిన రిపోర్టును గురించి.
16. నిడదవోలు పూర్వ అధ్యక్ష కార్యదర్శులు తగాదాగురించి అధ్యక్షుని విచారణ రిపోర్టు.
17. ప్రశ్నావళులకు జవాబు పంపిన మెంబర్లు రిపోర్టులు.
18. రాష్ట్రసంఘమువారిని కోరిన అప్పును గురించి వారు వ్రాసిన ఉత్తరమును గురించి.
19. అధ్యక్షుని అధీనసంఘముల తనిఖీ రిపోర్టు.
20. భీమవరంతాలూకా కాంగ్రెసు సంఘమునకు మనసంఘంరు 132 లు యివ్వవలెనని వ్రాసిన వుత్తరం.
21. ఏలూరు కాంగ్రెసు ఆఫీసు అద్దె వగైరాలు నిమిత్తం కొమ్మారెడ్డి సత్యనారాయణగారు వ్రాసిన ఉత్తరం.
22 గతసంవత్సర జమా-ఖర్చు ఆమోదమునుగురించి.
23. నిడదవోలు, కొవ్వూరు గ్రామ సంఘములు పట్టణసంఘములుగా పరిగణించుటగూర్చి
24. అత్తిలి సూర్యనారాయణగారు గావించిన తీర్మాన సూచనగురించి.
25. సాధారణసంఘ సభ్యులు పంపిన తీర్మానములు.
26. జూలై మొదటివారంలో జరుగనున్న సాధారసంఘ సమావేశపు ఎజండాను గురించి.
27. కాంగ్రెసు సంఘ నియమావళి సబు కమిటీ రిపోర్టు.

కార్యదర్శిప్రవేశపెట్టు యితరవిషయములు

తణుకు, 28-5-39. ఇట్లు, భూపతిరాజు బాపిరాజు, ప్రధాన కార్యదర్శి.

షరా:-అవసరమైనచో సభ మరుసటి దినము కూడా జరుగును.

* * *

ఆంధ్ర ప్రజలకు విన్నపము

23-5-39 తేదీని జరిగిన ఆంధ్రరాష్ట్ర రైతు సంఘ సాధారణ సభలో రాబోవు అఖిలభారత కిసాను మహాసభను బెజవాడలో జరుపుటకు నిశ్చయింపబడెను. బెజవాడ మొగల్‌రాజపురం మధ్య 40 ఎకరముల భూమిని సభకొరకు, అఖిలభారత దేశీయ పారిశ్రామిక, వ్యవసాయిక, వస్తుప్రదర్శన శాలలకొరకును తీసుకొనుచున్నాము. సభా ప్రదర్శన శాలలను నిర్మింపబడుటకు అవసర ప్లానులను తయారు చేయబడుటకు యిదివరలో కాంగ్రెసు సభాశాలను ఏర్పాటుచేసిన యింజనీర్లతో ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడుచున్నవి. సభ జయప్రద మగుటకు కనీసము 30000 వేల రూపాయలైననూ అవసరమని అంచనా వేయబడినది ఆహ్వానములకు అతిథిసత్కారములకు చేర్పడిని యిదివరలో రెండు అఖిలభారత మహాసభలను జయప్రదముగా నిర్వహించిన ఆంధ్ర ప్రజలు, నాయకులు, సేవకులు దేశమునకు ప్రాణము, మూలబలములైన నేటి పీడిత భారత కైతాంగ సమావేశము జయప్రద మొనర్చబడుటకు పూనుకొనవలెనని కోరుచున్నాను.

ఈ మహాసభకు ఆంధ్రులందరూ విరివిగా ఆహ్వానసంఘ సభ్యులుగజేరి తోడ్పడకోరుచున్నాను. అన్ని జిల్లా రైతుసంఘములు, కాంగ్రెసు మున్నగు ప్రజాహితైక సంఘములు వందలకొలది ఆహ్వానసంఘ సభ్యులుగా చేర్చుటకు ప్రారంభించవలయును ఈ సందర్భమున ఉత్తర ప్రత్యుత్తరములు జరుపువారు, ఆహ్వానసంఘ సభ్యత్వ రసీదు పుస్తకములు కావలసినవారు, ఆంధ్రరాష్ట్ర రైతు సంఘ ఆఫీసు, గవర్నరుపేట, బెజవాడకు వ్రాయగోరెదను.

ఇట్లు
తణుకు 29-5-39 కొ॥ సత్యనారాయణమూర్తి. అధ్యక్షుడు
అఖిల భారత రైతుసభ ఆహ్వానోపసంఘము.

వివాహాలు : పూర్వం - ఇపుడు - ఇకముందు

[సామాన్యంగా ప్రజలు ఇపుడు సమాజంలో వున్న కుటుంబ సంబంధాలు దైవ నిర్మితమనీ, అనాదినుండి యిలాగే వున్నాయని ఎంచుతారు' ఇవి స్థిరంగా లేవనీ మానవసమాజం పరిణామం చెందిన వివిధ దశలలో వివిధ రకాలుగా కుటుంబ సంబంధాలుకూడా పరిణామం(మార్పు) చెందుతూ వచ్చాయని ఏంగెల్సు 'కుటుంబం స్వంత ఆస్థి, రాజ్యాంగ యంత్రం' అను పుస్తకంలో సహేతుకమైన వాదనలతో ఋజువు పరచాడు. ఈ క్రిందివ్యాసం ఆ పుస్తకం నుండియే సంగ్రహింపబడినది. సం.]

మానవసమాజం మార్పు చెందిన మూడు ప్రధానదశలలో మూడు ప్రధానమైన వివాహ విధానాలు ఆచరణలో వుండేవి (1) పశు యుగంలో (Savagery) సమిష్టి వివాహము, (group marriage) (2) అనాగరికయుగం (barbarism) లో జతకట్టు వివాహము, (3) నాగరిక యుగం (civilisation) లో ఏకభర్తృ, ఏకపత్నీ వివాహం ఆచరణలోకి వచ్చాయి.

పశు యుగం.

పశు యుగంలో సమిష్టి (group) వివాహాన్ని మూడు దశలుగా విభజించవచ్చు. మొదటిదశలో పశువులవలెనే స్త్రీ పురుషుల సంయోగం జరిగేది. ఏ విధమైన కట్టుబాటు లేకపోవుటచే వివాహమే అనబడదు. రెండవదశలో ఒకతల్లికి జనించిన బిడ్డలు అనగా అన్నదమ్ములు, అక్కచెల్లెండ్లమధ్యనే స్త్రీ పురుష సంపర్కముండేది. మూడవదశలో ఒక వంశంలో లేక కుదురులో జన్మించిన స్త్రీలు, మరొక వంశంలో లేక కుదురులో జన్మించిన పురుషులకునూ, రెండవ వంశంలో లేక కుదురులో జన్మించిన స్త్రీలు మొదటి వంశంలో లేక కుదురులో జన్మించిన పురుషులకునూ సమిష్టిగా భార్యలుగా ఎంచబడేవారు, అనగా అన్నదమ్ములు అక్క చెల్లెండ్రమధ్య స్త్రీ పురుష సంపర్కం ఈ సమయంలో నిషేధించబడింది.

ఈ యుగంలో మనుష్యులు సంఖ్య తక్కువగా వుండేది. రాళ్లు వగైరా పనిముట్లుగా ఉపయోగించేవారు. తమచుట్టూవున్న అరణ్యాలలో వేటాడేవారు. స్త్రీలు వేటాడుటవంట వగైరా కృత్యాలు చేసేవారు. పురుషులు యుద్ధాలు చేయుట, వేటాడుట, చేపలు పట్టుటవగైరా పనులు చేసేవారు. నిపుణులు పనిముట్లు చేసేవారు. ఎవరి పనిముట్లకు వారే యజమానులు. ఈకాలంలోనే సామాజిక కట్టుబాటులను అమలునందుంచుటకు 'గణము' (జన్స్) అను సామాజికసంస్థ ప్రారంభ మయింది.

అనాగరిక యుగం.

ఈ యుగంలో మానవ సమాజం కొంత వృద్ధిపొందింది. మందలను మేపుకొను తెగలకు యితర అనాగరిక తెగలకు శ్రమ విభాగం (Division of labour) ప్రారంభమయింది. పశువుల మందలు మొదట అస్థిగా పరిగణింపబడుతూ వచ్చాయి. ఆరోజులలో పశువులే, ధనంగా (మారకపు వస్తువు) పరిగణింపబడేది. తోటలు వేయుట, చేతిమగ్గం, కమ్మరి కొలిమి ఆచరణలోకి వచ్చాయి. రాగి, సత్తు పనిముట్లు, వెండి బంగారునగలు ఉపయోగంలోకి వచ్చాయి. రెండవదశలో యినుప కత్తులు, నాగలికర్రు ఉపయోగంలోకి వచ్చి విరివిగా వ్యవసాయం చేయుట ప్రారంభమయింది. చేతి పరిశ్రమలు వ్యవసాయమునుండి వేరు చేయబడి ప్రత్యేక వృత్తిగా మారాయి. యుద్ధములో జయించబడిన విరోధితెగల స్త్రీపురుషులు బానిసలుగామారి యజమాని, బానిస అను పరస్పర విరోధులైన వర్గాలు మానవ సమాజంలో మొదటసారి బయలుదేరాయి. తెగలసమాఖ్యలు(Tribal confedration)ఏర్పడుట, గోడలమధ్య నిర్మింపబడిన పట్టణాలు నిర్మింపబడుట జరిగింది.

ఈయుగంలో వివాహాన్ని రెండుదశలగా భాగించవచ్చు. మొదటిదశలో జంట వివాహం Pairing marriage) ఆచరణలోకి వచ్చింది. కాని బయటవారితో సంపర్కం పూర్తిగా నిషేధింప బడలేదు. ఇంతవరకు వంశం తల్లిని బట్టియే నిర్ణయించబడేది. గృహములో పెత్తనం పూర్తిగా స్త్రీదే.

రెండవ దశలో వ్యవసాయం విరివిగా సాగి భూమి వ్యక్తుల ఆస్థిగా మారింది దీనితో పురుషులకు ఇంటిపైకూడ అధికారం వచ్చింది. వంశం పురుషునిబట్టి నిర్ణయించబడుట ప్రారంభమయింది. పురుషుడు ఆస్తికి స్వంతదారు అవుటతో పాటు యింటిపై పూర్తి పెత్తనం సంపాదించాడు. స్త్రీ భర్తకు యావజ్జీవం కట్టుబడి వుండాలని వచ్చింది. అంటే ఏక భర్తృవివాహాలు ఆచరణలోకి వచ్చాయి. స్త్రీకి యితర పురుషులతో సంపర్కం అవినీతిగా యెంచబడి నిషేధించబడింది. కాని పురుషుడు బహుభార్యలను వివాహమాడుట, దాసిస్త్రీలతో సంపర్కం పొందుట నిషేధింప బడలేదు. ఒకపురుషుడు తనకున్న ఆస్థిని బట్టి ఎక్కువమందిని వివాహమాడుట కూడ తప్పుగా ఎంచబడుట లేదు. అనగా మానవసమాజచరిత్రలో మొదటిసారి స్త్రీలపై పురుషుల అధికారం స్థాపింపబడింది.

నాగరిక యుగం

ఈ యుగం మొదటిదశలో సమాజం యజమానులు, బానిసలు అను వర్గాలుగా విభజింపబడింది. భూమి అమ్మకం తాకట్లు ప్రారంభమయ్యాయి. వస్తువుల మార్పిడిచేసే వర్తకులు అనే నూతన వర్గము బయలుదేరింది. నాణెములు చలామణీ ప్రారంభమయింది. పట్టణాలు గ్రామాలమధ్య స్పర్థ, భాగ్యవంతులు బీదల మధ్య స్పర్థ, వడ్డీయిచ్చేవారు బాకీదారులమధ్య స్పర్థ ప్రారంభమయింది. ప్రజలంతా ఆయుధ సహితులుగా వుండే 'గణాలు'. (Gens) ప్రజాభిప్రాయమనే న్యాయస్థానములతో కూడిన ప్రాచీనప్రాజాస్వామికాపోయిలు సైన్యము, ఉద్యోగుల నిరంకుశత్వము వానిస్థానాన్ని ఆక్రమించాయి. రెండవ దశలో జమీందారీ విధానం (Feudalism) రాచరికంతో కూడిన ప్రభుత్వవిధానంగా వచ్చాయి. పన్నులు, మగతాలవిధానం ప్రారంభమయింది. బానిసలు, దాసులుగా మారారు. పట్టణాలలో చేతిపరిశ్రమాగారాలు బయలు దేరాయి. జమీందారులు దాసులమధ్య, వర్తకులు (Burgher) జమీందారులతో కూడిన రాచరికం మధ్య, వర్గ కలహం ప్రారంభ మయింది.

మూడవ దశలో ప్రజాస్వామిక విప్లవాల ద్వారా ఫ్యూడల్ సమాజంపోయి ధనస్వామిక (bourgeoise) సమాజం వచ్చింది, యంత్రాలు, స్టీమ్ యింజను పరిశ్రమలలో విప్లవాన్ని తెచ్చాయి. వ్యవసాయంలో సైతం యంత్రాలు ఉపయోగించడం ప్రారంభమయింది. బ్యాంకులు, కరెన్సీ అమలులోకి వచ్చింది. ప్రజాస్వామిక ప్రభుత్వాలు, పార్లమెంటరీ ప్రభుత్వాలు నిరంకుశ రాచరికం స్థానాన్ని ఆక్రమించాయి. దాసుల (serfs) వ్యవసాయ బానిసత్వం పోయి దినకూలీలుగా మారారు. పరిశ్రమల యజమానులు కార్మికుల మధ్యవర్గ కలహం స్పష్టంగా ఇదివరకు ఎన్నడూ లేనంత తీవ్రంగా కట్టుదిట్టాలతో జరుగుట ప్రారంభమయింది.

ఈ నాగరిక యుగంలో వివాహం ఒకే స్త్రీ పురుషులమధ్య యావజ్జీవ సంబంధంగా యెంచబడుతూంది. స్త్రీ పురుషులకు పైకి ఏకభర్తృత్వం ఏకపత్నీత్వం అవశ్య అవలంబనీయంగా ఎంచబడుతున్నా ఆచరణలో స్త్రీలకు మాత్రమే నిర్బంధంగా వుంటూంది. పురుషులు మాత్రం బహు స్త్రీ వివాహం (సంపర్కం) యిప్పటికీ సమాజంలో వున్న వ్యభిచారం, పడపువృత్తి ద్వారా అనుభవిస్తూనే వున్నారు. ఏ పని స్త్రీలు చేస్తే అవమానకరంగానూ సహించరానంతటి నేరము చేసినటులుగా యెంచబడుతున్నారో, అపనే పురుషులు చేస్తే స్వల్ప పొరపాటుగా మాత్రమే యెంచబడుతూంది. పెట్టుబడిదారీ విధానం వృద్ధిపొందిన కొలదీ రహస్య వ్యభిచారం, పడపువృత్తి వృద్ధిపొందుతున్నాయి. పడపువృత్తి స్త్రీలలో తమ శరీరాన్ని అమ్ముకొనుటద్వారాగాని జీవనం సాగించలేని కొలది మందినే పతనం గావించుతూంది కాని పురుషులలో దాదాపు అందరిని యీ చెడువృత్తిలో దిగి పతనమవడానికి అవకాశమిస్తోంది

ఏకపత్నీ (పతీ) వివాహం మనిషి చాల భాగ్యానికి స్వంతదారుడు అయిన తరువాత ఆ ఆస్తిని బిడ్డలకు సంక్రమింప జేయాలనే భావంపైనే ఆధారపడింది. ఇందులకు ఏకపతీ వివాహం అవసరం. పురుషునికి బహు స్త్రీ సంపర్కానికి ఆచరణలో ఎట్టి అటంకం లేకుండా పస్తుత ధనిస్వామికసమాజంలో చేయబడింది. అయితే ఏక పత్నీ (పతీ) వివాహం స్వంత ఆస్థి హక్కులు నశించుటతోనే (సోషలిస్టు సమాజంలో) రద్దయిపోతుందా అని మీరు ప్రశ్నించవచ్చు. అటుల నశించిపోదు. ఏక పత్నీ (పతీ) వివాహం సోషలిస్టు విధానం క్రింద మానవసమాజంలో మొట్టమొదటిసారి సంపూర్ణంగా ఆచరణలోకి వస్తుంది ఏమంటే వస్తూత్పత్తి సాధనాలన్నీ సమాజానికంతటికీ చెందుతాయి. అపుడు సమాజంలో కొంతమంది స్త్రీలు తమ భుక్తికొరకు పడపువృత్తి అవలంబించే అవసరమే వుండదు. అందుచే వ్యభిచార వృత్తి నశించుతుంది. ఏక పత్నీ (పతీ) వివాహం వాస్తవంగా అపుడే ఆచరణలోకివస్తుంది.

వస్తూత్పత్తి సాధనాలన్నీ సమిష్టి ఆస్థిగా మారినపుడు కుటుంబం సమాజంలో ఒక ఆర్థిక వ్యవస్థగా ఉండబోదు. గృహకృత్యాలలో ఎక్కువభాగం సామాజిక పరిశ్రమగా మారిపోతుంది. అంటే బిడ్డల పోషణ, విద్య సమాజిక (ప్రజాప్రభుత్వ) కర్తవ్యంగా మారిపోతుంది. బిడ్డలను-వారు న్యాయశాస్త్రప్రకారం జరిగిన వివాహంద్వారా పుట్టినా సరే లేక అక్రమ సంతానమైనా సరే-పోషించుట సమాజం సమానంగానే చూస్తుంది. అపుడు ఒక యువతి తాను ప్రేమించిన యువకునితో సంయోగంవలన వచ్చే ఫలితాలనుండి భయపడవలసిన ఫలితమే వుండదు. అయితే యిందుమూలాన స్త్రీ పురుష సంయోగం హద్దుమీరి జరగడం 'కన్యలగౌరవం', 'స్త్రీల సిగ్గు' అనేది లేకుండా పోదా? అంతేగాక నాగరిక ప్రపంచంలో (ధనస్వామిక సమాజంలోనే) ఏకపత్నీ (పతీ) వివాహంతో పాటు దానికి విరుద్ధమైన పడపు వృత్తిని మనం చూచుట లేదా? నూతన సోషలిస్టు సమాజంలో పడపువృత్తితోపాటు ఏకపత్నీ (పతీ) వివాహం నశించిపోదా? అనే ప్రశ్నలు మీరు వేస్తారు.

ఇచట మీరొక సంగతి గుర్తించాలి, ఏకపత్నీ (పతీ) వివాహం క్రమంగా ఆచరణలోకి వచ్చుటతోపాటు 'వ్యక్తిగత స్త్రీపురుషప్రేమ' (Individual sex love) అనే నూతన భావం ప్రారంభమయింది. మధ్యయుగాలకు ముందు స్త్రీపురుషవ్యక్తిగతప్రేమఅనేదే వుండేదికాదు. వ్యక్తిగత రూపలావణ్యం, సన్నిహిత సంబంధం, సానుభూతి, ఒండొరుల గుణాలను మెచ్చుకొనుట (Admiration) స్త్రీపురుషుల మధ్య సంయోగ వాంఛ కల్గించుతుంది అనే సంగతే ప్రాచీనులు ఎరుగరు. ప్రాచీన యుగాలలో తలిదండ్రులచే వివాహాలు కుదర్చబడేవి, భార్యాభర్తలు అలవాటు పడిపోయేవారు. ప్రాచీన కాలపు వీరగాధలలోని ప్రేమ వ్యక్తులకు సంబంధించిన ప్రేమగా గాక ఒక కర్తవ్యంగా నెరవేర్చబడేది (అందుచేతనే, అప్పటికవులు సాహసకార్యాలు చేసిన వారిని పెండ్లాడుటే ప్రేమగా వర్ణించారు) మధ్య యుగంలో స్వేచ్ఛాపౌరులగు స్త్రీ పురుషుల మధ్యప్రేమ సమాజం ఒప్పుకోని రహస్య మార్గాల ద్వారానే సాధ్యమయ్యేది. ఆదిమ నివాసులలో వ్యక్తిగతప్రేమ అనేదే వుండేది కాదు. అప్పటి స్త్రీపురుష సంపర్కం పశువులలో గాంచు సహజప్రవృత్తి (Natural instinct) మాత్రమే.

ప్రస్తుతం మనం చెప్పకొనే స్త్రీపురుష ప్రేమకు ప్రాచీనుల సంభోగవాంఛకు చాల వ్యత్యాసముంది. (1) ప్రేమ ప్రేమించేవారు ప్రేమించబడేవారి మధ్య పరస్పరము ప్రతిఫలించేదిగా వుంటుంది: అంటే స్త్రీ పురుషులు సమానసత్వాలు గల్గివుంటారు. పశుయుగంలో స్త్రీసమ్మతి పుచ్చుకోడం అవసరంగా ఎంచబడేది కాదు. (2) యిప్పటిప్రేమ ఎక్కువకాలం వ్యాపించిందిగానూ, గాఢమైనదిగానూవుంటోంది. ప్రేమికులు ఎడబాటు వియోగాలను ఎంతో దురదృష్టంగా యెంచుతారు. (3) ఒక నూతన నైతిక సూత్రం బయలుదేరింది. స్త్రీ పురుష సంభోగం వివాహబంధితుల మధ్యనేనా అనే ప్రశ్నతోపాటు, నేడు అది ప్రేమ వివాహమేనా అనే ప్రశ్నకూడ అడుగ బడుతోంది.

ప్రాచీనకాలమునుండి మధ్యయుగాల వరకు వివాహం చాలావాటిలో భార్యాభర్తలకు మాత్రం సంబంధించినదిగా వుండేది. ప్రారంభదశలో ఒక తెగలో జన్మించిన స్త్రీపురుషులు ఆతెగలోని

పురుషులు స్త్రీలకు వివాహితులైనట్లుగానే ఎంచబడేవారు, జతకట్టు వివాహంలో తల్లులే భార్యాభర్తలను నిర్ణయించేవారు. సామాజిక ఆస్థిపోయి స్వంత ఆస్థి ప్రాధాన్యతలోకి వచ్చిన తరువాత ఆస్థి, ఆర్థిక పరిస్థితులే వివాహంలో భార్యాభర్తలను నిర్ణయించ బడటానికి కారణాలౌతున్నాయి.

బూర్జువా (నాగరికుని) దృక్పథంలో వివాహము ఒక కంట్రాక్టు వంటిది. ఇద్దరు మానవుల మనశ్శరీరాలను యావజ్జీవంబంధించి వుంచేది కాబట్టి ప్రధానమైనదికూడ, పైకి స్త్రీ పురుషులయిద్దరి సమ్మతిమీదనే జరగాలసినదిగాఎంచబడుటకూడ నిజమే. కాని యీసమ్మతి ఎటుల అనేక యితర నిర్బంధాలద్వారా సంపాదించబడుతుందో, కంట్రాక్టుకును (వివాహాన్ని) నిర్ణయించేది ఎవరో అందరూ ఎరిగిన విషయమే. కాని అన్ని యితర కంట్రాక్టులలోనూ రెండుపక్షాల సమ్మతిని జరుగుతున్నాయిగా! వివాహంలో ఎందుకు అలాజరగటంలేదు? వివాహము తరువాత ఐక్యజీవితాన్ని గడుపవలసిన ఆయిద్దరు యువతీ యువకులు స్వేచ్ఛగా స్వతంత్రంగా తమ శరీరాలను వినియోగించే హక్కును కలిగివుండలేదా? వివాహితులగు స్త్రీ పురుషులు ఒండొరుల ప్రేమించుకోవాలలి వుంటే, ప్రేమించిన యువతీయువకులే పెండ్లాడవద్దా? తల్లిదండ్రులకంటే, బంధువులకంటే, పెండ్లిళ్ల పేరయ్యగార్లకంటె ప్రేమికులకే పెండ్లినిర్ణయించడంలో ఎక్కువ హక్కులు వుండవద్దా? పూర్వంనుంచీ వస్తున్న ఆచారాలు వంశపారంపర్యంగా వున్న నమ్మకాలు చెదరిపోతున్న యీసమయంలో, మనం యీవిషయాలు పరిశీలించాలి. ప్రపంచం ఆకస్మికంగా పదిరెట్లు విశాలవంతం అయింది. వృద్ధిపొందుతున్న బూర్జువావర్గం ముఖ్యంగా (ఇంగ్లండు వంటి) ప్రొటెస్టెంటుదేశాలలో - వివాహసంబంధాలలో జరుగు కాంట్రాక్టులలో కూడ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం గుర్తించబడుతూ వచ్చింది. వివాహము ఆవర్గంలో వారిమధ్య మాత్రమే జరగాలి కాని ఆవర్గంలో మాత్రం భార్యా భర్తలను నిర్ణయించుకోడంలో కొంత స్వేచ్ఛ యివ్వబడుతూంది. మరి వ్రాతలలో ప్రేమించే వారి మధ్యనే వివాహం ఆదర్శంగా, హక్కుగా, అంగీకరించ బడింది.

ఇతర ప్రధాన మానవ హక్కులకు, యీ హక్కుకు భేదముంది. తక్కిన హక్కులను (వాక్స్వాతంత్ర్యం, సమావేశ స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం వగైరా) పరిపాలన చేయుచున్న బూర్జువా వర్గం మాత్రమే నిజంగా అనుభవించుతూంది. కాని ప్రేమవివాహాల విషయంలో మాత్రం వేరువిధంగా జరుగుతోంది. బూర్జువావర్గంలో దానిని ఆవరించిన ఆర్థిక పరిస్థితుల ప్రభావంవలన, ప్రేమ వివాహాలు చాలా కొద్దిగానే జరుగుతున్నాయి. కాని అణచివేయబడిన శ్రామికవర్గంలో కార్మికులకు ఏవిధమైన ఆస్థి లేకపోవుటచే ప్రేమ వివాహాలు చాల విరివిగా జరుగుతున్నాయి. అందుచే నిజమైన స్వేచ్ఛ గలిగిన ప్రేమ వివాహాలు కాపిటలిస్టు ఉత్పత్తి విధానం స్వంత ఆస్థి సంబంధాలు రద్దు అయిన తరువాతనే పూర్తిగా ఆచరణలోకి వస్తాయి. అంటే ఆర్థిక పరిస్థితుల ఆలోచింపవలసిన అవుసరంతొలగినపుడే యువతీ భర్తను యువకుడు భార్యనూ స్వేచ్ఛగా స్వీకరించే అవకాశముంటుంది. పరస్పర అనుభూతి వుండి, ప్రేమ వివాహాలు సర్వసాధారణ మౌతాయి.

ప్రస్తుతం ప్రేమ స్త్రీలకు సంబంధించినంత వరకు ఏకభర్తృపైనే కేంద్రీకరింపబడివుంటుంది. అంటే ప్రేమపై, ఆధారపడిన వివాహం వ్యక్తిగతంగానే వుంటుంది. ఇపుడు స్త్రీలు పురుషుల విశ్వాసఘాతుకత్వాన్ని వ్యభిచారాన్ని సహించడానికి కారణం, ఆస్థి హక్కులన్నీ పురుషులకు వుండుటచే తను జీవితాధారానికి, బిడ్డల భవిష్యత్తుకు వారిపై ఆధారపడి యుండుటయే. సోషలిస్టు సమాజంలో స్వంత ఆస్థి హక్కులు వుండవుగాన, బిడ్డల పోషణకు సమాజమే బాధ్యత వహిస్తుంది గాన పురుషుల విశ్వాసఘాతుకత్వం, వ్యభిచారప్రవర్తన సహించబడదు. నిజమైన ఏకపత్నీ (పతీ) వివాహం ఆచరణలోకిస్తుంది.

....ఐతే ఏకపత్నీ (పతీ) వివాహం ఇపుడున్న విధంగానే ఉంటుందా? ఉండదు. స్వంత ఆస్థిహక్కులు ఉండుటవల్ల ఏకపత్నీ (పతీ) వివాహముపై ముద్రితమైన చిహ్నాలు పోతాయి. ఇందులో ప్రధానమైన పురుషుని ఆధిక్యత పోతుంది. వివాహం రద్దుకాని స్థిరమైన సంబంధంగా పరిగణింపబడదు. ప్రేమపై ఆధారపడిన వివాహమే నీతి అయినది; అంతేగాదు భార్యాభర్తలమధ్య ప్రేమ కొనసాగుచున్న సంసారమే సరి అయినది. భార్యా భర్తలమధ్య ప్రేమ నశించుటతోనే వివాహం రద్దుకావాలి. ప్రేమ లేనపుడు వివాహ విచ్ఛేదం భార్యాభర్తల కిద్దరకు లాభకరమే!

వివాహం యిదివరకు నాల్గురూపాలు పొందినదనే సంగతి గుర్తించినపుడు, యిప్పటి ఏకపత్నీ (పతీ) వివాహం ఐదవ రూపమని గ్రహించినపుడు యిప్పటిరూపం ముందుకూడ స్థిరంగా వుంటుందా? అనే ప్రశ్న బయలుదేరుతుంది. దీనికి జవాబు ఒకటే ఉంది. సమాజం మార్పుచెందిన కొలదీ యిదివరకువలెనే వివాహ విధానంకూడ మార్పుచెందుతుంది. వివాహం: సామాజిక విధానంలో సృజింపబడింది. అది మానవ సమాజ విజ్ఞానాన్ని తెలియజేస్తూంది' ఏకపత్నీ (పతీ) కుటుంబం నాగరికయుగంలో చాల అభివద్ధి పొందింది. ముఖ్యంగా ఆధునిక కాలంలో చాలామార్పుచెందింది. ప్రేమపై ఆధారపడిన వివాహం యింకా వృద్ధిచెంది, స్త్రీ పురుషుల సమానత్వం స్థాపింప బడుతుంది. భవిష్యత్కాలంలో ఏకపత్నీ కుటుంబం సామాజిక అవసరాలను తీర్చలేకపోతే, నాగరికత వృద్ధి పొందుకొలదీ వివాహం ఏవిధంగా మార్పుచెందునదీ జోస్యం చెప్పడం సాధ్యం కాదు.

ఆదిమ కాలంలో సమాజానికి కావలసిన అవసరాలను తీర్చడానికి కావలసినపనులు చేయడంలో స్త్రీ పురుషునితో సమాన భాగస్వామిగా వుండేది: స్వేచ్ఛా స్వాతంత్ర్యా లనుభవించడములో సమాన హోదాలో వుండేది; వివాహంలో స్త్రీ పురుషులకు ఎట్టి న్యూనాధిక్యతలు వుండేవి కావు.

మధ్య యుగంలో గృహకృత్యాలు నెరవేర్చుటలోనేగాని సమాజానికి కావలసిన వస్తువుల తయారుచేయుటలో స్త్రీకి ప్రధాన భాగముండేదికాదు. ఆస్థికి, వస్తు ఉత్పత్తి సాధనాలకు పురుషుడే యజమానిగా వుండేవాడు; స్త్రీకి అంతకుపూర్వమున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు నశించాయి; పురుషునిపై ఆధారపడవలసిన స్థితికి స్త్రీ వచ్చింది; అందుచే వివాహంలో స్త్రీ బాధ్యతగల వ్యక్తిగా కాక భరించవలసినదిగా మారిపోయింది; బహుభార్యా వివాహం ఆచరణలోకి వచ్చింది.

నాగరిక యుగంలో బూర్జువా సమాజంలో క్రింది వర్గాల స్త్రీలు (కార్మిక స్త్రీలు) ఫ్యాక్టరీలలో, పరిశ్రమలలో పాల్గొని వస్తూత్పత్తి విధానములో భాగస్వాములు అవుతూన్నారు; అందుచే బూర్జువాసమాజంలో స్త్రీ మరల కొంత స్వేచ్ఛా స్వాతంత్ర్యాన్ని పొందింది. కాని స్వంత ఆస్థి విధానం వుండుటచే వివాహం చేసికోవడంలో సంపూర్ణ స్వాతంత్ర్యం లేక వర్గ హద్దులలోనే జరగాలిసివస్తూంది; ప్రేమ వివాహాలకు కొంత అవకాశం కలిగినా స్త్రీ పురుషునితో సమాన హోదాను సంపాదించలేదు. బిడ్డల విష్యత్తు కొరకు, తన భుక్తికొరకు స్త్రీ భర్తపై ఆధారపడి యుండవలసివచ్చుటచే స్త్రీ ప్రేమలేని సంసారంకూడ చేయవలని వస్తూంది; విశ్వాసఘాతకుడు, వ్యభిచారి అయినభర్తతోకూడసంసారం చేయవలసి వస్తూంది. కొందరు స్త్రీలు తమ భుక్తికొరకు పడపువృత్తి అవలంభించాలని వస్తూంది.

సోషలిస్టు సమాజంలో ప్రయివేటు ఆస్థివుండదు. ఉత్పత్తి సాధనాలన్నీ సమాజ అధీనమవుతాయి. స్త్రీ పరిశ్రమలలో సమాజసేవలో పాల్గొనడానికి సంపూర్ణ అవకాశ ముంటుంది. స్త్రీలు తమభుక్తికి తామే పనిచేసి సంపాదించుకొంటారు; అందుచే కొందరు భుక్తికొరకు పడపువృత్తి అవలంబించాలసిన అవరసరమే వుండదు. బిడ్డల పోషణ, విద్యపు ప్రసూతి ఏర్పాట్లు సమాజమే (ప్రభుత్వమే) చేస్తుంది, స్త్రీతన భుక్తికొరకు, బిడ్డల సంరక్షణ కొరకు భర్తపై ఆధారపడవలసిన పనివుండదు. ప్రేమలేని భర్తతో, విశ్వాసఘాతకుడు వ్యభిచారి అయిన భర్తతో కాపురం చేయవలసిన ఆవశ్యకత వుండదు. వివాహవిచ్ఛేదానికి సంపూర్ణ అవకాశాలుంటాయి. అంటే సోషలిస్టు సమాజంలో వ్యక్తుల మధ్య ప్రేమవుంటేనే వివాహం జరుగుతుంది: ప్రేమ వున్నంత కాలమే కలసి కాపురము చేస్తారు: ప్రేమ నశిస్తే విడిపోతారు.

★

తూ॥ గో॥ జిల్లా ఆర్థిక రాజకీయ పాఠశాల

రాజోలు డివిజన్ కాంగ్రెసు సోషలిస్టు పార్టీ యాజమాన్యమున 16 జూన్ '39 తేదీ లగాయతు 30 జూన్ '39 వరకు 15 దినములు రాజోలు డివిజన్‌లో ముందు నిర్ణయింపబోవు గ్రామములో జిల్లా ఆర్థిక రాజకీయ పాఠశాల నడుపబడును. అందు కామ్రేడ్స్ సి. వి. కృష్ణారావు, పి. అనంతం, పి. సూర్యనారాయణ, జె. రామలింగయ్య మొదలగు వారు అద్యాపకులుగా నుందురు. మిలిటరీ డ్రిల్లుకూడ నేర్పబడును. విద్యార్థులుగా చేరగోరువారు ఈ నెల 12 వ తేదీలోగా కామ్రేడ్ అల్లూరి శీతాగామరాజుగారు టేకిశెట్టిపాలెం-అంతర్వేదిపాలెం పోస్టు-రాజోలు డివిజన్-తూర్పు గోదావరిజిల్లా. అడ్రసుకు దరఖాస్తులు చేరునటుల పంపించవలయును.

రాన్‌పూర్ సంస్థాన సేవకులకు శిక్షలు

రాన్‌పూర్‌లో జనవరి 6 వ తేదీని దొమ్మిలో, ఒరిస్సా సంస్థానములకు రాజకీయ ఏజెంటగు మేజర్ బజెల్గెట్ హత్య సందర్భమున స్పెషల్ సెషన్స్‌జడ్జీ జై. యు. షీరర్‌గారు విచారణ జరిపి శిక్షలను విధించినారు.

ఈ హత్యసందర్భమున ఇరవైనలుగురిపై నేరములు మోపబడినవి. ఈ ముద్దాయిలు రాన్‌పూర్ ప్రజామండలి కార్యదర్శియగు రఘునాధ మహంతికిని ప్రసిద్ధ ప్రచారకుడగు దివాకర్ వరదాకును, చింతా నాయక్ అను పైముగ్గురికి ఉరిశిక్షలు పడినవి.

ఎనిమిదిమందికి ద్వీపాంతరవాస శిక్ష విధించినారు. నలుగురికి ఇండియన్ పీనలుకోడు 120 సెక్షనుక్రింద రెండేళ్ళు కఠిన శిక్ష విధించినారు, మరి ఒకనికి 147 సెక్షనుప్రకారం రెండేళ్ళు కఠినశిక్ష విధించినారు. తక్కిన ఎనిమిది మంది ముద్దాయిలను, విడుదల చేసినారు.

షీరర్‌గారు తీర్పుచెప్పుచు సంస్థానములలో ఏడేళ్ళకు పైగా ఖైదు శిక్ష విధించినప్పుడు దానిని ఖాయపరచవలసి ఉంటుంది కనుక ఉరిశిక్షలను, ద్వీపాంతరవాస శిక్షలను స్థిరపర్చుటకు రికార్డులను హైకోర్టు వారికి అందజేసుకుంటామన్నారు.

సంస్థాన సేవకులకు విధింపబడ్డ ఈ శిక్షలు అమానుషం. మన దేశసేవకుల్ని ఈవిధంగా హత్యగావించబడటం చూడగలమా? దేశమంతటా ఆందోళన లేవదీసి మన సేవకుల్ని మనం రక్షించుకోవాలి. ఈ విషయంలో కాంగ్రెసు మంత్రివర్గాలన్ని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. సంస్థాన సేవకుల రక్షించుకొనేదాక స్వాతంత్ర్య ప్రజా భారతీయుడెవడూ నిద్ర పోరాదు!

మునగాల రైతుల సమస్య

కాట్రగడ్డ నారాయణరావు ఎం. ఎల్. ఏ., గారి స్టేటుమెంటు

గతసంవత్సరం ఫిబ్రవరినెలలో జిల్లా రైతు సంఘాధ్యక్షులైన కామినేని వెంకటప్పయ్యగారితో కలిసి మునగాల ఎస్టేటులో సంచారము చేసితిని. అంతకు పూర్వం ఆఎస్టేటునుగూర్చిన విశేషాలు నాకు తెలియవు. కాంగ్రెసు మంత్రులు అధికారములోనికి వచ్చినారు గనుక తమకష్టాలు గట్టెక్కుతవనే ఆశతో మునగాల రయితులు నావద్దకు వచ్చి తమ కష్టాలను మంత్రివర్గమునకు తెలుపమని చెప్పినపుడు వారి బాధలను గూర్చి కొద్దిగా తెలిసికొని, స్వయంగా చూచుటకై ఆ ఎస్టేటుకు వెళ్ళితిని. కాని నేను విన్నదానికన్న అనేకరెట్లు అధికంగా కష్టాలు పడుచున్నారని స్వయంగా చూచినపిమ్మట తెలిసికో గలిగాను. తిరిగి ఏప్రిల్ నెలలో మరొక పర్యాయం వెళ్లి కొన్ని మారుమూలగ్రామాలనుకూడా చూడగల్గినాను. ఎస్టేటువారు చేస్తున్న దురాగతములని రైతులు పేర్కొన్న వాటిలో ముఖ్యమైనవి (1) జమీందారు రైతులలో తగవులు పుట్టించి వారిని కోర్టులకు పోనీయకుండా తానే విచారించుట (2) రయితులను శిక్షలుగా దెబ్బలు కొట్టించుట, జరిమానాలు వేయుట, నీళ్లు నిప్పులేకుండ పహరానిర్బంధములో నుంచుట, ప్రతిఫలశూన్యమగు ప్రోనోట్లను వ్రాయించుకొనుట, భూములను ఇండ్లను స్వాధీనము చేసికొనుట, తన నిర్బంధాలకు భయపడనివారిని సాంఘికంగా బహిష్కరించునట్లు ప్రజలచే ఖరారునామాలు వ్రాయించుకొనుట అన్ని కులములవారి చేతను వెట్టి చేయించుకొనుట వగైరాలు. ఆవిధంగా దెబ్బలు తిన్నవారిని కొందరిని నేను స్వయంగా చూచాను. దెబ్బలింకను స్పష్టంగా కాన్పించుటే గాక, ఒకరికింకను నోటినుండి నెత్తురు పడుచుండెను. ఈవిషయములన్నిటిని వెంటనే జిల్లాకాంగ్రెసు సంఘమునకును, జిల్లా ప్రభుత్వాధికారులకున్ను తెలియజేసాను. పిమ్మట నియమింపబడ్డ పశ్చిమకృష్ణాజిల్లా కాంగ్రెసు ఉపసంఘమువారి నివేదికకూడ నేను తెలుసుకొన్న విషయాలనే మరింత విపులంగా తెలియబర్చి యున్నది.

పిమ్మట ప॥ కృ॥ కాంగ్రెసు సంఘము ఎస్టేటుకు కొంతమంది ప్రచారకులను పంపింది. ఆ ప్రచార ఫలితంగా రైతులలో తీవ్ర సంచలనము కలిగింది. అయిననూ ఆ ప్రచారకులపై కొన్ని నిందలువేయుచూ తామే జమీందారీ దుర్నయాల నరికట్టెదమని స్థానిక ప్రభుత్వాధికారులు తెల్పుటచే ప్రచారకులపై ఆరోపణలు ఆధార రహితములని తెలిసినప్పటికిన్నీ వెనుకకు పిల్పించాము. కాని జమీందారీ దుర్నయాలు మాత్రం ఏమాత్రమును తగ్గలేదు. అందువల్లనే రైతులలో తీవ్ర అందోళన ప్రబలి శిస్తులకొరకై జేయబడు జప్తులను నిరోధించుట, కలకోవ కూలీల ఆందోళనను సాగించుట జరిగి ఎట్టకేలకు జమీందారుతో రాజీ కుదిరింది.

రాజీని జరుపుటలో రైతులకు సలహానిచ్చిన నేను రాజీని అమలుపర్చు విషయంలోకూడా సలహాల నివ్వవలసియుంది. అందుకొరకే రాజీ ప్రకారం రైతులకు శిస్తులు చెల్లించమని తెల్పినాను. రాజీ పత్రముపై సంతకముచేసినా ఆ రాజీకి విముఖుడుగా ఉన్నట్లు జమీందారు చర్యలవల్ల స్పష్టంగా ప్రథమం నుండీ తెలుస్తూనే వచ్చింది. జమీందారు రాజీప్రకారం ఒక వీసమెత్తు చేయకపోయిననూ రైతులను అక్రమ శిస్తులు చెల్లించమని తెల్పినను, ఒక పర్యాయం స్వయంగా ఎర్నేని సుబ్రహ్మణ్యంగారితో కలిసి ఎస్టేటుకు వెళ్ళి రాజీ అమలు జరుగు విధానమును చూచినాను. రైతుల పరిస్థితులనుగూడా విచారించినాను. కాని అప్పటికే రైతులు గుడ్డిగవ్వ అయినా లేకుండా సకలావస్థలు పడుతూ వున్నారు. రు. 1కి 0-2-0 చొప్పున వడ్డీకైననూ అప్పు తెచ్చుకొందుమన్న పెట్టుబడిదార్లు తాకట్టుపైనగాని అప్పు ఇవ్వమనుచున్నారట. శిస్తులకొరకై ముందెప్పుడో రాబోవు వేరుశనగ పంటను పుట్టి 1కి రు. 10½ చొ॥ జట్టీలకిచ్చుచున్నారట. ఈ విధముగా రైతులకు తినుటకు తిండే లేక బాధపడుచున్ననూ రాజీని గౌరవించుటకై ఏదోవిధముగా శిస్తులను చెల్లించుచున్నాను కాని అప్పటి పరిస్థితులనుజూచి, జమీందారు రాజీప్రకారం ఏమియు జేయకుండుటను జూచియు వ్యవహారమీవిధముగా సాగుచుండినచో విపరీత పరిస్థితులేర్పడ వచ్చుననియు, కాబట్టి రాజీని త్వరగా అమలు జర్పించమనియు శ్రీ ఎర్నేని సుబ్రహ్మణ్యంగారికి తెలియబర్చాను. ఆ రాత్రి కుమార రాజాగారితో మాట్లాడుతూ రైతులు శిస్తులు తప్పక చెల్లించెదరని తెల్పితిని. ఈ విధంగా జమీందారు రాజీకి అనుకూలురు కాదని స్పష్టంగా తెలిసినప్పటికిన్నీ రైతులచే శిస్తు చెల్లింప జేసితిమి.

నా భయం నిజమైనది. జమీందారుచే భగ్నం చేయుటకు ఒక ఎత్తుఎత్తినారు. రాజీ జరిగిన దినమునుండియు మెట్ట శిస్తుకు రిమీషన్ ఇస్తానన్న రిమీషను ఇచ్చుటకుగాను చివరకు కొత్తషరతులను కోరసాగినారు. రిమీషన్ పేచీ వచ్చినపుడే నేను మునగాల వెళ్ళినాను. కలెక్టరు, బ్రహ్మయ్యగార్ల ముందు అంగీకరింపబడ్డ రు. 0-2-0 రిమీషను రెండు కిస్తీలకా, ఒక కిస్తీకా యన్న తగాదా అది. అవును కుమార రాజాగారుకూడ నాతో మాట్లాడినపుడు కమతం శిస్తులు చెల్లిస్తేనే రిమీషను ఇస్తానని తెల్పలేదు. కాబట్టి కమతం శిస్తుల విషయం వార్కి తర్వాత తట్టినది. ఇది రాజీని భగ్నం చేయుటకే బుద్ధిపూర్వకముగా తెచ్చిన పేచీయని తలుస్తాను. ఈ నా ఉద్దేశ్యమున కనుగుణంగానే బ్రహ్మయ్యగారున్ను, కలెక్టరున్ను రిమీషను ఇచ్చుటకున్ను, కమతం శిస్తులగున్ను సంబంధము లేదని తెల్పినట్లు నాకు తెలిసింది. కమతం శిస్తుల జోక్యం లేకుండా మెట్ట శిస్తులకు రు. 1 కి 0-2-0 చొ॥ రిమీషను ఇవ్వవలసినదని బ్రహ్మయ్యగారు కుమార రాజాగారికి వ్రాసిరట కాని వారు దాన్ని అంగీకరించలేదట. ఈ పరిస్థితులలో జమీందారు తాను రైతులతో ప్రభుత్వాధికారుల సమక్షన వారి ప్రమేయంవల్ల రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శిద్వారా చేసుకున్న ఒడంబడికలను ఉల్లఘించినాడని ఖండితముగా చెప్పగలను.

ఇవి జరిగి ఇప్పటికి 1½ నెలలైనది. రయితులస్థితి మరింత అధ్వాన్నమైనది. శిస్తులు చెల్లించుటకు డబ్బులేక పోవుటేగాక తినుటకు తిండిగాని, త్రాగుటకు నీళ్ళుగాని ఆ ఎస్టేటులో లేనేలేవు. ఎస్టేటు కంతటికీ మంచిదగు మునగాల బావితోనే అర్ధరాత్రివేళకూడా మంచినీళ్ల తోడుకొనుటకై ఎంతో కష్టమగుచున్నది. పశువుల గ్రాసమా అసలే లేదు. పీట్లు అన్న వేలేవు. తుమ్మకాయ మేయునన్నచో చెర్వుకట్టమీదికి పశువు వెళ్లితేనే జమీందారు మనుష్యులు తోలుకొనిపోయి బందెలదొడ్డిలో పెడుతారు. మాగాణీపైర్లు తక్కువగుటచే ఎండుగడ్డికూడా తక్కువే. చివరకు గతిలేక పశువులు తాటాకు ఈతాకులను నమలుట కూడా నేనెరుగుదును. ఇట్టి దుర్భర పరిస్థితులలో రయితులెచ్చటనుండి డబ్బుతెచ్చి శిస్తులు చెల్లించగలరు? రయితుల వాదనలో నాకు న్యాయము కన్పిస్తున్నది. జమీందారు, రాజీ ప్రకారం నడచుటలేదు, నడుచునన్న ఆశలేదు. ప్రభుత్వం జోక్యం కల్గజేసుకొని జమీందారుచే అమలు పర్పించునన్న హామీలేదు. కాబట్టి రాజీ అమలులోనున్నట్లు తామెట్లు భావించాలి? ఎట్లా ముందు శిస్తులు చెల్లించాలి?

రయితుల సంస్థలనిచూచి రాజీని వారు అమలు జర్పిన విషయమును, జమీందారు కఠినత్వమును గుర్తించి, స్థానికప్రభుత్వాధికారులచే తలకుమించిన విషయమని తెలుసుకొని మంత్రివర్గమే ఈవిషయంలో జోక్యము కల్గజేసికోవాలి. రయితులు తమ కోర్కెలు నెరవేర్పబడునంత వరకు తమ ఆందోళనను సాగించెదమని ఐక్యకంఠముతో నాతో తెల్పినారు. గత నాల్గు నెలల నుండి జరిగిన విషయములను బట్టివారు పూర్తిగా నిరాశలయినారు. కాబట్టి మంత్రివర్గము వెంటనే జోక్యము కల్గజేసికొని, లోగడ జమీందారీ నిర్ణయాలను సరిదిద్ది రయితుల కోర్కెలను ఈడేర్పవలెనని కోరుచున్నాను. లేనిచో మిక్కిలి చైతన్యం పొందిన ఎస్టేటు ప్రజలలో తీవ్ర అసంతృప్తి జనించునని తెల్పుచున్నాను.

ఆంధ్రరాష్ట్ర సోషలిస్టు పార్టీ

కార్యనిర్వాహకవర్గ తీర్మానాలు

1. మునగాల జమీందారుకు, యెస్టేటు రైతులకు జనవరి నెలలో జరిగిన రాజీని అమలు జరిపించుటకు రైతులెంత కష్టపడి ప్రయత్నించిననూ ప్రథమము నుండి జమీందారు రాజీని భగ్నమొనర్చి రైతుల యొక్క కోర్కెలను నిరాకరించుచూ రాజీకి విరుద్ధముగా ప్రవర్తించుటవలన రైతులు రాజీ ప్రకారము తమ కోర్కెల నీడేర్చుకొనుటకు యీ నెల 2 వ తేదీ నుండి మరొక మార్గములేక గావించుచున్న సత్యాగ్రహమును యీ సంఘమువారు అభినందించుచూ ఆ సందర్భములో ప్రభుత్వోద్యోగస్థులు సత్యాగ్రహుల యెడల అవలంభించిన వైఖరిని ఖండించుచున్నారు. సత్యాగ్రహులను తదితర రైతులపైనూ 4 వ తేదీన పోలీసులుగావించిన అమానుష లాఠీచార్జీనిఖండించుచూ లాఠీచార్జీకి గురియైన రైతు సోదరులను అభినందించుచున్నాము. మునగాల రైతులయొక్క కోర్కెలను రాష్ట్రీమంతటా ప్రజలకు తెలియపర్చి రైతుల కోర్కెల యెడల ప్రజా సానుభూతిని గలిగేటట్లును, ప్రభుత్వము వెంటనే రైతుల కోర్కెలను జమీందారు యీడేర్చునట్లును, జోక్యము గలుగచేసుకొనునట్లు ప్రభుత్వముపై ఒత్తిడి గొనివచ్చుటకు తగినంత ఆందోళన చేయవలసినదిగా పార్టీ సభ్యులు కృషిచేయవలెను.

2. 'ఫార్వర్డు బ్లాకు' సోషలిస్టుపార్టీవలే ప్రత్యేకసిద్ధాంతాలను కలిగియుండని మాట నిజమే. కాని కాంగ్రెస్ మహాసభచే అంగీకరించబడిన కార్యక్రమమే నాయకత్వము నేడు ఆచరణలో పెట్టుటలేదు; అందుచే కాంగ్రెసు కార్యక్రమమును ఆచరణలో పెట్ట గోరు కాంగ్రెసువాదులందరూ ఒక సంఘముగా ఏర్పడి, నాయకత్వము యిపుడు చేస్తున్న లోటును దిద్దుటకు ప్రయత్నించుట సబబే కదా! అలా చేయుట కాంగ్రెసులో చీలికలు కల్పించుట కాదు; కాంగ్రెసు కార్యక్రమాన్ని ఆచరణలో పెట్టి, దేశమందంతటా ప్రజా పోరాటాల ద్వారా ప్రస్తుతము నాయకత్వంలోని దిగజారుడు విధానాన్ని అరికట్టుటకు మార్గమే అది. కాంగ్రెసులోని కమ్యూనిస్టులు, సోషలిస్టులు, ఇతర జాతీయ తీవ్రవాదులందరు ఫార్వర్డు బ్లాకువంటి దానిలో జేరి అందరిచే అంగీకరింపబడిన ఒక నిర్ణీత కార్యక్రమముపై ఐకమత్యంతో పనిచేస్తే, కాంగ్రెసులో సంపూర్ణ ఐక్యతను సాధించగలం; జాతీయపోరాటాన్ని ముందుకు తీసికొని పోగలము. అని ఆం॥ కాం॥ సో॥ పార్టీ కార్య నిర్వాహకవర్గం అభిప్రాయపడుతూ అ॥భా॥కాం॥సో॥ పార్టీ కార్యనిర్వాహక వర్గాన్ని ఫార్వర్డు బ్లాకులో జేరరాదను నిర్ణయాన్ని పునరాలోచించి మార్చుకోవలసిందని కోరుతున్నది.

3. ఆంధ్రరాష్ట్రీ కాంగ్రెసు సంఘము, 10 వేల శాంతి సైన్యాన్ని తయారుచేయుటకు నిశ్చయించినందులకు వారిని అభినందించుచున్నాము. ఈ సైన్యములో చేరడము ప్రతి వ్యక్తియొక్క కర్తవ్యము. జిల్లా సోషలిస్టు పార్టీలు, రైతు సంఘాలు, కార్మిక సంఘాలు వెంటనే ఈ సైన్యములో చేరడానికి, వాలంటీర్లను రిక్రూటు చేయవలసినదిగ హెచ్చరించుచున్నారు. జిల్లా పార్టీలు, ఆయా జిల్లాలలో ఎంతమంది వాలంటీర్లను ప్రతినెలా చేర్చినది రిపోర్టు ఆఫీసుకు పంపాలి.

4. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టుపార్టీ సభ్యులుగా నుండి, ఈ మధ్య టైఫాయిడ్ జ్వరమువల్ల చిన్న వయస్సునందే, కామ్రేడ్ పుచ్చలపల్లి గోవిందమ్మ మరణించినందులకు విచారమును తెలియజేయుచున్నాము.

5. విజయనగరము పార్టీ కార్యదర్శి కామ్రేడ్ వైద్యనాధము, నిరుద్యోగము వల్ల బాధపడుచూ ఆత్మహత్య గావించుకున్నందులకు విచారమును తెలియజేయుచున్నాము.

కాశ్మీర్ లో

(12 వ పేజీ తరువాయి) లమీద ఉమ్ముతూన్నప్పుడల్లా వారి ముఖాలలో ఉద్రేకం పొంగి పొంగి వస్తూండేది.

వీళ్ళనుచూచి ఆగ్రహం పట్టలేక కాబోలు, దక్షిణ వైపు నుంచి వస్తూన్న పోలీసు దళం, సహజంగా దాటిరావలసిన వంతెనను దాటిరాకుండా అడ్డదారిని కాలువను అడ్డంపడి, ఆహారం కోసం క్షుద్ర జంతువుల మీదకు దుమికే క్రూరమృగాల్లాగ వచ్చి పడ్డారు, ఊరేగింపుమీద.

మళ్ళీ దెబ్బల చప్పుడు.....ఈ మారు తలలుకూడా పగిలివుంటాయి. ఆ స్త్రీలు మాత్రం తమ స్థలాల్లోంచి కదలలేదు. చేతులలోని బొమ్మలమీద ఉమ్ముతూనేవున్నారు.

"ఏమిటా మట్టి బొమ్మలు?" అని అర్థంలేని ప్రశ్న వేశాను.

ఎవరూ సమాధానం చెప్పలేదు. మాడ్రైవరుమాత్రం ఇంజను ఆపివేసి, తలుపు తీసుకొని చేతులూపించుకుంటూ వెళ్ళి ఒక పోలీసువాడిని దభాలున చొక్కా మెడ పట్టుకుని,

"అక్రమాన్ని కాపాడడానికి వచ్చిన మనిషి నెందుకు కొట్టావు?" అని అడుగుతున్నాడు.

పోలీసువాడు, డ్రైవరును ప్రక్కకు గెంటిపారవేసి, ఇద్దరు కాశ్మీరీయులతో పెనుగులాడుతూన్న యింకో పోలీసు దగ్గరకు పరుగెత్తాడు.

నేనుకూడా తలుపు తీసుని క్రిందకు దిగాను. నాకు తెలియకుండానే నా కాళ్లు చేతులు వణుకుతున్నాయి.

"కుక్కల కొడుకులు! వాళ్ళు వినిపించుకోరు!" అన్నాడు తిరిగి వచ్చిన డ్రైవరు.

"అసలీ గొడవంతా ఎందుకు వచ్చింది? కారణమేమిటి?" అని అడిగాను.

"వుండు, వుండు, చెబుతాను" అంటూ తన సన్నని పూవల్లాంటి చేతులతో జనాన్ని అటూ ఇటూ ఒత్తించుకుంటూ ఆ గుంపు మధ్యకు పరుగెత్తాడు డ్రయివరు.

"నిన్నటిరోజున" అని, నాఅవస్థ అంతా చూస్తూన్న ఒక చిన్న షాపు కీపరు చెప్పడం మొదలు పెట్టాడు, "ప్రధానమంత్రి గోపాలస్వామి. అతడు చాలాక్రూరుడు పబ్లిజలను పీడించుకు తింటాడు—ఇక్కడికి వచ్చాడు. పబ్లిజలంతా ఆయన కారుచుట్టూ మూగి గోలచేశారు. ఆయనగారు ఉగ్రుడై, కారును జనంమీదనుంచి తోలించాడు. పాపం! ఒక దురదృష్టవంతుడు ఆ ఒత్తిడిలో తప్పుకోలేకపోయాడు. ముందుచక్రానికి 'మడ్ గార్డు'కు మధ్య ఇరుక్కుపోయాడు. చుట్టూ వున్న జనం, మనిషి చచ్చిపోతున్నాడని గోల చేశారు. ఆ గోపాలస్వామి వినిపించుకోలేదు. కారును త్వరగా పోనివ్వమని డ్రైవరును హెచ్చరించాడు. పాపం! అయితే డ్రైవరు కారును ఆపడానికే ప్రయత్నించాడు. కాని ప్రధాని ఆజ్ఞను తిరస్కరించలేకపోయాడు. ఇరుక్కుపోయిన మనిషి కెవ్వుకెవ్వున ఏడుస్తున్నాడు, రోడ్డుమీద కారు జాడల్లో ఆ మనిషి రక్తంతో పడిన టైరు ముద్రలు కనబడ్డాయి. "మడ్ గార్డు" అంతా రక్తమయం అయింది. కారు మాత్రం ఆగలేదు కొంతదూరంపోయాక ఒకఇంగ్లీషు దొర ఇదంతా చూసి కారును ఆపించాడు...." అని చెబుతున్నాడు.

"ఆమనిషి చచ్చిపోలేదా?" అన్నాను.

"అప్పుడు ప్రాణం ఉంది. ఎముకలు విరిగాయి. పాపం! మాంసం కండలు గుడ్డపీలికలలాగ వ్రేలాడిపోయాయి" అన్నాడు.

ఈ మాట చెప్పేటప్పుడు అతని పెదవులు కంపించాయి, నేనూ అప్రయత్నంగా పెదవులుకొరుక్కున్నాను,

ఇంతలో మరల ప్రక్కసందులోనుంచి గొల్లుమన్న శబ్దం. నేను ఆ సందువద్దకు పరుగెత్తాను,

పోలీసులు, ఆ స్త్రీలమీద ఇంకో లాఠీ చార్జి చేస్తున్నారు. స్త్రీలు పాటపాడుతూనే వున్నారు, "బాగ్-ఇ-నిషట్ కి గిలో...." మధ్య మధ్య రొమ్ములు బాదుకుంటూ, చేతులలోనున్న గోపాలస్వామి బొమ్మమీద ఉమ్మి వేస్తూ వున్నారు. పోలీసులు ఆ గుంపులో కొన్ని భాగాలమీద మరీ ఎక్కువగా లాఠీ చార్జి చేశారు. వాళ్ళు మాత్రం పారిపోలేదు.

నాకు వాళ్ళ ధైర్య సాహసాలకు చాలా ఆశ్చర్యం వేసింది. కాశ్మీరీలు పిరికివాళ్ళని, పంజాబులో ఒక సామెత. ఔను పాపం! తరతరాలనుంచి అణగద్రొక్కబడుతూన్న వాళ్ళమీద ఎన్ని సామెతలయినా సృష్టించబడతాయి!

రక్తం స్రవిస్తోన్న ఆ దృశ్యంకేసి చూడలేకపోయాను. ముఖం ప్రక్కకు తిప్పుకున్నాను.

దూరానవున్న పర్వతాలకేసి చూశాను. ఈరణగొణ ధ్వనికి పైన, స్త్రీ పురుష విచక్షతలేకుండా లాఠీలతో బాదమోదుతూన్న పోలీసులకు పైన, లాఠీలను ధిక్కరించి తళతళ మెరిసే చెవుల రింగులతో ముందుకు సాగిపోతూ, నూత్న వికాసంతో కాశ్మీరీల స్వభావాన్నే మార్చివేస్తూన్న ఆ వీరవనితలకుపైన, దిగాలుపడి నిల్చుని వున్నాయి ఆ పర్వతాలు. రకరకాల చెట్లతో నిండిన కొండలోయలు, గాలికి సంగీతాలు తీస్తున్న లతానికుంజాలు, వింత శోభనిచ్చే రంగు రంగుల అడవిపూలు, వీటిని గురించి ఆలోచించాను. నా మనస్సుకా ఊహా ప్రపంచపు ప్రకృతి శోభ, ఆ వర్ణనలు ఏమీ నచ్చడంలేదు. నా దృష్టి మళ్ళీ ఈ కాశ్మీరీ వీరులవైపుకే తిరిగింది. ఆ పర్వతాలకంటె వీరే ఎక్కువ అద్భుతంగా కనపడ్డారునాకు. ఎందుకంటే వాడు కశ్మీర స్వరూపాన్నే మార్చివేశారు.

గ్రంథావలోకనం

బడదీదీ

రచయిత: శరత్‌బాబు :

అనువాదం: 'చక్రపాణి'

★

వంగభాషలో నవలా సాహిత్యానికి దోహదమిచ్చినవారు ముగ్గురు. (1) బంకిమచంద్ (2) టాగూర్ (3) శరత్ చంద్రుడు. బడదీదీని శరత్‌బాబు వ్రాశాడు. ఏ విషయాన్ని అందుకున్నా ఇతని లేఖిని అమృత మొలికిస్తుంది. ఇతని పుస్తకాలు చదువుతూ ఉంటే థామస్‌హార్డీ జ్ఞప్తికి వస్తాడు. హార్డీ రచనలవలె ఇతని రచనలు గంభీరంగా సర్వతోముఖంగా ఉండకపోయినా ఇరువురి రచనలకూ సామ్యం ఉంది. ఇద్దరూ ఒక కుంచతోనే వ్రాశారేమో ననిపిస్తుంది.

బడదీదీ లో జమీందారీ జీవితం చిత్రించ బడింది. సురేంద్రుడు 'స్నేహ కర్కశమైన' సవతి తల్లి అదుపులో పెరిగాడు. అందువల్లనే—'ఒకటి కాదొనా నెరుంగడు, ముంచరెయ్యడ నొకపాటెఱుంగ డెద యెంతయు గోమల మెప్పుడైన'-తల్లి—"గుడువగ నిల్చుగాని తన కుంగలయాకటి ప్రొద్దెరుంగడు"

సురేంద్రుడలా ఉండటమే తల్లికి ఇష్టం. అలా కాకుంటే ఆమె వాత్సల్యం ఎలా ప్రవహించాలి? ఆమెకు జీవితంలో సుఖం ఎలా లభిస్తుంది? అందుకనే ఆవిడ అతన్ని స్వశక్తిమీద ఆధారపడ నిచ్చింది కాదు.

అట్లాంటి వాతావరణంలో సురేంద్రుడు యం. ఏ. ప్యాసయ్యాడు. ఐనా అతని హృదయం స్వయం కృషికి అర్రులు చాచింది. తనకు తానుగా ఈ ప్రపంచంలో జీవిత రహస్యాన్ని అన్వేషించాలనుకున్నాడు స్నేహితుడు సలహా యిచ్చేదాక దానికి మార్గంతోచలా. చివరికి తండ్రితో విదేశాలకువెళ్ళి చదువుకొస్తానన్నాడు. మారుటమ్మ "స్వయంగా వాడు బ్రతకలేడు. నన్నుకూడ వాడితో పంపండి". అన్నది. దానితో అతని ఆశాంకురాలు అంతరించాయి. ఎలాగైనా పరాశ్రిత జీవితంలోంచి బయటపడాలని చెప్పకుండా లేచిపోయాడు. లేచిపోయినా ముక్తి లభించలేదు. ఎప్పుడూ స్వచ్ఛంద జీవన మెరుగని జీవి ఎలా స్వయముగా జీవిస్తుంది.

వ్రజబాబు ప్రథమపుత్రికయైన మాధవి సురేంద్రునికి ప్రాపులు పెట్టింది. భర్తృ సహచర్యానికి ఎక్కువకాలం నోచుకోని మాధవియొక్క ప్రణయినీ హృదయము మాతృ హృదయంగా మారిపోయింది. తల్లిని వదలి వచ్చిన సురేంద్రునికి మళ్ళీ తల్లి బడదీదీ దొరికింది. అతనికి కావలసినవన్నీ బడదీదీ-మాధవి-చూస్తుండేది. కాంపెన్‌సెస్ కావలసివచ్చినా, కళ్ళజోడు పోయినా ఆ యవశిశువు బడదీదీకి కబురు పంపించేది. అతని తత్వాన్ని పూర్తిగా గ్రహించిన మాధవి అవస్థపడి ఆవస్తువుల్ని తెప్పించి ఇస్తూ ఉండేది. "ఇలాంటి అమాయకుడు ఎలా నెగ్గుతాడా" అని జాలిపడేది. ఆ జాలే వాత్సల్యంగా, ప్రణయంగా పరిణమించింది. మాతృ హృదయానికీ ప్రణయినీ హృదయానికీ అట్టే తేడాలేదని సోషియాలజీ సైకాలజీ చదువుకున్న వాళ్ళకి తెలిసిందే. బడదీదీలోని ఈ పరిణామాన్ని చూచి మాధవి స్నేహితురాలైన మనోరమ స్త్రీ జాతిని గురించే అసహ్యముగా భర్తకు ఉత్తరం వ్రాసింది. మానవతత్వం ఆమెకేం తెలుసు మరి?

స్వధర్మము గుర్తించ లేకుండా పెరిగిన సురేంద్రుడు, వ్రజబాబు రెండో కుమార్తెయైన ప్రమీలకు చదువు చెప్పక పొర్లుమాలాడు. బడదీదీ మందలించింది. దానితో కష్టం కలిగి అతను చెప్పకుండా వెళ్ళిపోయాడు. ఆ పోక హాస్పిటల్‌కి దారితీసింది. ఈవార్త తండ్రికి తెలిసి అతన్ని ఇంటికి తీసికెళ్లాడు.

తర్వాత జీవితంలో కూడ ఈ 'అకర్మణ్యుడు' గృహస్థుఅయినా, భూస్వామి అయినా, 'అకర్మణ్యుడు' గానే ఉండిపోయాడు. ఈ అకర్మణ్యత్వం అతనిచేత అతనికి తెలియకుండా మనసార ప్రేమించిన బడదీదీకి నిలువ నీడ లేకుండా చేసింది. సురేంద్రుడు ఇల్లాలి దీవాట్లతో తన తప్పు గ్రహించి ప్రాణాలు ధారవోసి మాధవిని తన యింటికి చేర్చాడు.

ఇదీ కథా వస్తువు.

నిరుపాధిక సత్తార్థంలో ప్రయుక్తము లేని ఆనందమే కావ్యాదర్శమైతే శరత్‌బాబు కృతకృత్యుడయ్యాడు; జమీందారు బడదీదీలో చిత్రించినట్లుగాఉంటే గాంధీ గారి హృదయ పరివర్తన సిద్ధాంతము పూర్తిగా నెగ్గుతుంది. అట్లని శరత్ పాత్రలను సరిగా చిత్రించలేదనలేము. ఆపాత్రలు ఆ వాతావరణంలో అలా ఉంటానికి అవకాశముంది.

ఇలాంటి చక్కని గ్రంథాన్ని చక్రపాణిగారు ఆంధ్రలోకానికి ప్రసాదించారు కొన్ని వాక్యాలు మూలార్ధద్యోతకంగా లేక్షపోయినా అనువాదం రసవంతంగా ఉంది. ఆంధ్రీకరణాలు స్వయంగా మన వాఙ్మయానికి పరిపుష్టి చేకూర్చలేకపోయినా మంచి స్వతంత్ర గ్రంథాలు వెలువట్టానికి తోడ్పడుతాయి. కాబట్టి యీ విషయాన్ని గుర్తించి చక్రపాణిగారు ఇటువంటి గ్రంథాల్నియింకా ఆంధ్రలోకానికి అందిస్తారని మా ఆశయం.

— వి. వి. రె.

Published by M. Chandrasekhara Rao }
Printed by Tummala Venkata Ramiah } at Navasakti Press, Governorpet, Bezwada.

END OF ISSUE